




ESTD: 1999 www.voodayam.com

# వుదయం








ఖమ్మం 18-08-2026 మంగళవారం | సంపుటి : 13 | సంచిక : 262 | SINCE 27 YEARS CIRCULATED TELUGU DAILY | రూ. 1.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily

Simultaneously published from Khammam, Hyderabad, Adilabad, Karimnagar, Guntur & Warangal | Follow us on







# ప్రజలకు అత్యుత్తమ వైద్యసేవలు అందించాలి

- టిమ్స్' ఆసుపత్రి పరిశీలనలో సీఎం రేవంత్ రెడ్డి
- ఐసీయూ, ఆపరేషన్ థియేటర్లను పరిశీలించిన సీఎం, మంత్రులు



**హైదరాబాద్, ఆగస్టు 17 (వుదయం) :** సనత్‌నగర్‌లో నూతనంగా నిర్మించిన 'డాక్టర్ మర్రి చెన్నారెడ్డి తెలంగాణ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్' (TIMS) అత్యాధునిక సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారు ప్రారంభించారు. ప్రారంభోత్సవం అనంతరం ఆయన ఆసుపత్రిలోని వివిధ కీలక విభాగాలను స్వయంగా సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్డియో, రీనల్, ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంట్ సైన్సెస్ విభాగాలు, నూతన సాంకేతికతతో కూడిన ఆపరేషన్ థియేటర్లు, ఐసీయూ, పోస్ట్‌ఆపరేటివ్ వార్డులు మరియు ట్రామా విభాగాలను సీఎం క్షుణ్ణంగా తనిఖీ చేశారు. రోగులకు టోకెన్ల కేటాయింపు యంత్రాల పనితీరు, ఓపీ రిసెప్షన్ కౌంటర్లు, నమోదు ప్రక్రియలను పరిశీలించిన ముఖ్యమంత్రి, అక్కడి వైద్యులు మరియు నర్సింగ్ సిబ్బందితో మాట్లాడి వైద్య పరికరాల పనితీరుపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి నిర్వహణలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా, వచ్చే రోగులందరికీ నాణ్యమైన వైద్య సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి శ్రీ మల్లు భట్టి విక్రమార్క గారు, మంత్రులు శ్రీ దామోదర రాజనర్సింహ, శ్రీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, శ్రీ పొన్నం ప్రభాకర్ గారితో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు సీఎం వెంట పాల్గొన్నారు.

## జగిత్యాల-కరీంనగర్
# జాతీయ రహదారిపై ప్రమాదం

- లారీని ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు
- 20 మందికి గాయాలు




**హైదరాబాద్, ఆగస్టు 17 (వుదయం) :** జగిత్యాల జిల్లా కొండగట్టు పరిసర ప్రాంతంలో సోమవారం సాయంత్రం వేళ ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. జగిత్యాల కరీంనగర్ జాతీయ రహదారిపై ఉన్న బల్వంతపూర్ అడ్డరోడ్డు సమీపంలో ఆర్టీసీ బస్సు, లారీ పరస్పరం ఢీకొన్నాయి. ఈ దుర్ఘటనలో బస్సులోని 20 మందికి పైగా ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. కరీంనగర్ 1 డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు సుమారు 60 మందికి పైగా ప్రయాణికులతో జగిత్యాల వైపు వెళ్తుండగా ఈ ప్రమాదం సంభవించింది. ఢీకొన్న తీవ్రతకు బస్సు క్యాబిన్ పూర్తిగా దెబ్బతినడంతో డ్రైవర్ మురళి అందులోనే చిక్కుకుపోయారు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే స్పందించి, క్యాబిన్‌లో చిక్కుకున్న డ్రైవర్‌తో పాటు గాయపడిన ప్రయాణికులను వెలుపలికి తీసి చికిత్స నిమిత్తం జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాద సమాచారం అందుకున్న మల్యాల సీఐ రాజ్‌కుమార్ హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. రహదారిపై బస్సు, లారీ అడ్డంగా నిలిచిపోవడంతో ఇరువైపులా కిలోమీటరు మేర వాహనాలు నిలిచిపోయి తీవ్ర ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. సీఐ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు క్రేన్ల సహాయంతో వాహనాలను పక్కకు తొలగించి, ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

## ప్రైవేట్ ఆస్తులకు ఇబ్బంది కలిగించే
# ఉద్దేశం లేదు



**హైదరాబాద్, ఆగస్టు 17 (వుదయం) :** ప్రైవేటు వ్యక్తులకు చెందిన భూములు, ఆస్తులకు ఎలాంటి ఆటంకం కలిగించాలనే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల పరిధిలోని ప్రైవేట్ భూములు పొరపాటున 22ఏ (నిషేధిత) జాబితాలోకి వెళ్లాయని, వీటిని తొలగించాలంటూ ఇప్పటివరకు సుమారు 750 దరఖాస్తులు వచ్చినట్లు వెల్లడించారు. బుధవారం సచివాలయంలో సంబంధిత జిల్లాల అధికారులతో నిర్వహించిన ఉన్నత స్థాయి సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.గతంలో అర్బన్ ల్యాండ్ సీలింగ్ (ULC) పరిధిలో ఉన్న భూములు, ఆ తర్వాత రికార్డుల నవీకరణ (అప్‌డేట్) సమయంలో చోటుచేసుకున్న సాంకేతిక లోపాల వల్ల నిషేధిత జాబితాలోకి చేరాయని మంత్రి వివరించారు. ఈ పొరపాటుపై అధికారుల తరఫున ప్రజలకు క్షమాపణలు తెలియజేశారు. ప్రైవేట్ ఆస్తులను త్వరలోనే 22ఏ జాబితా నుంచి పూర్తిగా తొలగిస్తామని హామీ ఇచ్చారు. ఈ సమస్యపై ఫిర్యాదులు చేసేందుకు ప్రత్యేకంగా 18005994788 టోల్‌ఫ్రీ నంబర్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. క్రమబద్ధమైన హక్కు పత్రాలు, ఆధారాలు ఉన్న భూయజమానులు ఎలాంటి ఆందోళనా చెందాల్సిన అవసరం లేదని మంత్రి ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు.

# దేశంలో భారీ ఉగ్ర కుట్ర భగ్నం



**న్యూఢిల్లీ, ఆగస్టు 17 (ఎఎంఎస్) :** న్యూఢిల్లీ: పాకిస్థాన్ గూఢచారి సంస్థ 'ఐఎస్ఐ' నిధులతో నడుస్తున్న 'షహజాద్ భట్టీ నెట్‌వర్క్' (SBN) అనే ప్రమాదకర ఉగ్రవాద ముఠాను భారత భద్రతా దళాలు పూర్తిగా మట్టికరిపించాయని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ప్రకటించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకకు ముందే దేశవ్యాప్తంగా నిర్వహించిన భారీ ఆపరేషన్‌లో ఈ గ్రూప్‌కు చెందిన 200 మందికి పైగా సభ్యులను అరెస్టు చేసినట్లు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' (X) వేదికగా ఆయన వెల్లడించారు. భద్రతా దళాల అప్రమత్తతతో దేశంలో జరగాల్సిన తీవ్ర విధ్వంసకర దాడుల కుట్రలు తుత్తునియలయ్యాయని, ఉగ్రవాదం పట్ల భారత్ అవలంబిస్తున్న "జీరో టాలరెన్స్" (సహించేది లేదు) విధానానికి ఈ చర్య ప్రత్యక్ష నిదర్శనమని పేర్కొన్నారు. భారత్‌లో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేందుకు కుట్ర పన్నుతున్న భట్టీ నెట్‌వర్క్‌ను లక్ష్యంగా చేసుకుని దేశంలోని 14 రాష్ట్రాల్లో భద్రతా సంస్థలు అత్యంత సమన్వయంతో విరుచుకుపడ్డాయని అమిత్ షా తెలిపారు. ఈ సోదాల్లో పాకిస్థాన్ ఆయుధ కర్మాగారాల ముద్రలు ఉన్న హ్యాండ్ గ్రెనేడ్లు, ఐఈడీలు, పిస్టళ్లు, సజీవ తూటాలతో పాటు గూఢచర్యం కోసం ముఠా ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాలను పెద్ద ఎత్తున స్వాధీనం చేసుకున్నట్లు స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా, ఇటీవల మహారాష్ట్ర యాంటీ టెర్రరిజం స్క్వాడ్ (ATS) సైతం రాష్ట్రవ్యాప్తంగా విస్తృత తనిఖీలు చేపట్టి, పాక్ గ్యాంగ్‌స్టర్ షహజాద్ భట్టీతో సంబంధాలున్నాయనే అనుమానంతో 112 మందిని విచారించింది. సామ్రాజ్య విస్తరణ కోసం భట్టీ సోషల్ మీడియా మాధ్యమాల ద్వారా భారతీయ యువతను ఆకర్షించి, వారిని దేశ వ్యతిరేక కార్యకలాపాల వైపు ప్రేరేపిస్తున్నట్లు పోలీసు తనిఖీల్లో వెల్లడైంది.

**ఎవరీ షహజాద్ భట్టీ?**

పాకిస్థాన్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న షహజాద్ భట్టీ నెట్‌వర్క్.. భారత్‌లో పలు బాంబు పేలుళ్లు, లక్ష్య ఆధారిత (టార్గెటెడ్) హత్యలకు ప్లాన్ చేసినట్లు కేంద్ర ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

దేశంలోని పోలీస్ స్టేషన్లు, రక్షణ రంగానికి చెందిన కీలక ప్రాంతాలు, సున్నితమైన మతపరమైన ప్రదేశాల వద్ద గూఢచర్యం.

## రాహుల్ గాంధీకి సుప్రీం కోర్టులో ఊరట!

**న్యూఢిల్లీ, ఆగస్టు 17 (ఎఎంఎస్) :** ఆదాయానికి మించిన ఆస్తుల వ్యవహారంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టులో భారీ ఊరట లభించింది. ఈ కేసు దర్యాప్తునకు సంబంధించి ఎలాంటి నివేదికను అలహాబాద్ హైకోర్టుకు సమర్పించవద్దని కేంద్ర దర్యాప్తు సంస్థలైన సీబీఐ, ఈడీలను సుప్రీంకోర్టు ఆదేశించింది. అలాగే, తమ వద్ద తదుపరి విచారణ పూర్తయ్యే వరకు ఈ కేసును ముందుకు తీసుకువెళ్లవద్దని అలహాబాద్ హైకోర్టుకు స్పష్టం చేసింది.

## నిషేధిత భూములపై
# శ్వేతపత్రం విడుదల చేయాలి



**హైదరాబాద్, ఆగస్టు 17 (వుదయం) :** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాసం సైతం నిషేధిత ఆస్తుల జాబితా (ప్రొహిబిటెడ్ ప్రాపర్టీస్)లోనే ఉందంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి తానీరు హరీశ్‌రావు తీవ్ర విమర్శలు గుప్పించారు. స్వయంగా సీఎం ఇంట్కే ఈ పరిస్థితి ఎదురుకావడంతోనే, ఆ ఆస్తిని నిషేధిత జాబితా నుండి తొలగించేందుకు ప్రభుత్వం హడావుడి చర్యలకు దిగుతోందని ఆయన ఆరోపించారు. బుధవారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో హరీశ్‌రావు పలు ఆసక్తికర విషయాలను వెల్లడించారు. రాష్ట్రంలో స్వయంగా ముఖ్యమంత్రి పరిస్థితే ఈ విధంగా ఉంటే, ఇక సామాన్య ప్రజల పరిస్థితి ఏమిటని హరీశ్‌రావు ప్రశ్నించారు. రాష్ట్రవ్యాప్తంగా ఏ ప్రాతిపదికన, ఏ కారణాల చేత ఆస్తులను నిషేధిత జాబితాలో చేర్చారో తక్షణమే సమగ్ర విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. ఇప్పటివరకు ఎన్ని ఆస్తులను ఈ జాబితాలో ప్రతిపాదించారో స్పష్టం చేస్తూ ప్రభుత్వం వెంటనే శ్వేతపత్రం విడుదల చేయాలని కోరారు. అలాగే బాధితుల ఆస్తులను ఆ జాబితా నుంచి ఎప్పటిలోగా తొలగిస్తారో కాలపరిమితిని ప్రభుత్వం బహిర్గతం చేయాలన్నారు. నిషేధిత భూముల వివరాలపై సమాచార హక్కు చట్టం (RTI) ద్వారా దరఖాస్తు చేసినప్పటికీ ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందనా లేదని ఆయన ఈ సందర్భంగా మండిపడ్డారు.

## తెలంగాణలో ముసాయిదా
# ఓటర్ల జాబితా విడుదల

### 92 లక్షల మందికి నోటీసులు




**హైదరాబాద్, ఆగస్టు 17 (వుదయం) :** తెలంగాణ రాష్ట్రంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (SIR) ప్రక్రియకు సంబంధించి ముసాయిదా ఓటర్ల జాబితాను రాష్ట్ర ఎన్నికల సంఘం విడుదల చేసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (CEO) సుదర్శన్‌రెడ్డి వివరాలను మీడియాకు వెల్లడించారు. సవరణ ప్రక్రియలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా సుమారు 92 లక్షల మందికి నోటీసులు జారీ చేయనున్నట్లు ఆయన తెలిపారు. జాబితా పరిశీలనలో సుమారు 73 లక్షల మంది 'ఏఎస్‌డీ' (ఆబ్సెంట్, షిఫ్టెడ్, డూప్లికేట్) వర్గంలో ఉన్నట్లు గుర్తించామని సీఈవో పేర్కొన్నారు. నోటీసులు అందే వ్యక్తులు తమ వివరాలపై స్పందించేందుకు సెప్టెంబర్ 16 వరకు గడువు నిశ్చయించినట్లు తెలిపారు. ఒకవేళ జాబితాలో పేరు లేని అర్హులైన పౌరులు 'ఫారమ్ 6' ద్వారా నూతనంగా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఈ ముసాయిదా జాబితాలను ప్రజల

# అమెరికా, ఇజ్రాయెల్ గందరగోళం!

**న్యూఢిల్లీ, ఆగస్టు 17 (ఎఎంఎస్) :** పశ్చిమాసియా తీవ్ర ఉద్రిక్తతలతో రగిలిపోతున్న ప్రస్తుత తరుణంలో, అమెరికాఇరాన్‌ల మధ్య సాయుధ పోరాటంతో పాటు నకిలీ వార్తలు (ఫేక్ న్యూస్), సోషల్ మీడియా మీమ్స్ ప్రపంచ దేశాల్లో తీవ్ర అయోమయాన్ని సృష్టిస్తున్నాయి. ఈ క్రమంలో భారత్‌కు చెందిన ఒక సామాజిక మాధ్యమ వినియోగదారుడు చేసిన ఒక్క 'ఎక్స్' (ట్విట్టర్) పోస్ట్.. ఇటు ఇజ్రాయెల్‌ను, అటు అమెరికాను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. అసలేం జరిగింది?




## గుట్టలపై ఫార్మ్ ల్యాండ్ పేరుతో ప్లాట్ల విక్రయాలు?

— హామీలపై అనుమానాలు

వుదయం, నగల్గిద్ద

కరస్‌గుత్తిలోని,గంగారాం తండా సమీపంలో పి.ఎల్.సి ఫార్మ్ ల్యాండ్ పేరుతో గుంటల చొప్పున ప్లాట్ల విక్రయాలు జరుగుతున్నాయని నేషనల్ హ్యూమన్ రైట్స్ అండ్ సోషల్ జస్టిస్ కమిషన్ తెలంగాణ రాష్ట్ర చైర్మన్ రహీం ఆరోపించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కొనుగోలుదారులను ఆకర్షించేందుకు ఎర్రచందనం, వివిధ రకాల మొక్కలు పెంచుతామని, రిసార్ట్, స్విమ్మింగ్ పూల్ వంటి సౌకర్యాలు ఏర్పాటు చేస్తామని ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులు ఇందుకు భిన్నంగా ఉన్నాయన్నారు. గుట్టలపై చుక్క నీరు కూడా అందుబాటులో లేదని, విద్యుత్ సౌకర్యం లేదని, ప్రతిపాదిత రిసార్ట్, స్విమ్మింగ్ పూల్ వంటి సౌకర్యాలకు సంబంధించి వాస్తవంగా ఏ మేరకు ఏర్పాట్లు చేస్తారని ప్రశ్నించారు. చుట్టుపక్కల రైతులకు ప్రభుత్వ అందిస్తున్న ఉచిత విద్యుత్‌ను ఉపయోగిస్తున్నారని ఆరోపించారు.

**గుంటల చొప్పున విక్రయాలు.. అనుమతులు ఉన్నాయా?**

ఫార్మ్ ల్యాండ్‌ను గుంటల చొప్పున విభజించి విక్రయిస్తున్నట్లయితే, భూమి స్వభావం, యాజమాన్య హక్కులు, లేఅవుట్ అనుమతులు, భూవినియో.

## కళ్యాణ లక్ష్మి నిలిపితే పేదింటి ఆడపిల్లల పరిస్థితి ఏంటి?

- పథకాన్ని తక్షణమే పునరుద్ధరించాలి.. గద్వాలలో టీఆర్ఎస్ భారీ నిరసన

గద్వాల గద్వాల ఆగస్టు 17 (వుదయం కరస్పాండెంట్)



పేద కుటుంబాల్లో ఆడపిల్లల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించిన కళ్యాణ లక్ష్మి పథకాన్ని వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ టీఆర్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం గద్వాల జిల్లా కేంద్రంలో భారీ నిరసన చేపట్టారు. వైఎస్సార్ చౌరస్తా వద్ద నిర్వహించిన ఆందోళనకు పార్టీ గద్వాల ఇన్‌చార్జి బాసు శ్యామల హనుమంతు నాయుడు నాయకత్వం వహించారు. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు.పేదలపై ఆర్థిక భారం ఈ సందర్భంగా బాసు శ్యామల హనుమంతు నాయుడు మాట్లాడుతూ.. పేదింటి ఆడపిల్లల వివాహ సమయంలో కళ్యాణ లక్ష్మి పథకం ఎంతో ఊరట కల్పించిందన్నారు. ఈ పథకం ద్వారా ఆర్థిక సహాయం పొందిన కుటుంబాలకు ప్రస్తుతం ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. పథకం అమలుపై స్పష్టత లేకపోవడంతో అర్హులైన లబ్ధిదారులు ఆందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. పేద కుటుంబాల పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని కళ్యాణ లక్ష్మి పథకాన్ని ఎలాంటి జాప్యం లేకుండా కొనసాగించాలని డిమాండ్ చేశారు. అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ఆర్థిక సాయం అందేలా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలి కళ్యాణ లక్ష్మి పథకం ద్వారా గతంలో ఎంతోమంది పేద కుటుంబాలకు ప్రయోజనం చేకూరిందని హనుమంతు నాయుడు అన్నారు. అర్హత ఉన్నప్పటికీ సాయం కోసం ఎదురుచూ స్తున్న కుటుంబాల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పేదల సంక్షేమాన్ని విస్మరించ కుండా పథకాన్ని పునరుద్ధరించి ఆర్థిక భరోసా కల్పించాలని కోరారు. కార్యక్ర మంలో టీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేలా నిరసన చేపట్టిన నాయకులు, పథకం పునరుద్ధరణ కోసం తమ ఆందోళనలను కొనసాగిస్తామని తెలిపారు.

## పేదింటి ఆడబిడ్డల కళ్యాణ కాంతులపై సర్కార్ గ్రాహణం!

- హామీలు గాలికి.. పథకాలకు తూట్లు: ధరూర్ రహదారిపై కదంతొక్కిన బీఆర్ఎస్

ధరూర్ గద్వాల ఆగస్టు 17 (వుదయం బ్యూరో)



నిరుపేద, మధ్యతరగతి కుటుంబాలకు కష్టకాలంలో కొండంత అండగా నిలిచే 'కళ్యాణ లక్ష్మి', 'షాదీ ముబారక్' పథకాలపై ప్రస్తుత ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుపై నిరసన జ్వాలలు ఎగిసిపడ్డాయి. ఈ సంక్షేమ పథకాలను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ ధరూర్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ శ్రేణులు భీకర పోరాటానికి దిగాయి. గద్వాల నియోజక వర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి బాసు హనుమంతు నాయుడు ఆదేశాలతో నాయకులు, కార్యకర్తలు ప్రధాన రహదారిని దిగ్బంధించి తమ ఆగ్రహాన్ని వెళ్లగక్కారు.హోరెత్తిన "ఆడబిడ్డ గెలవాలి" రణనినాదంకళ్యాణ లక్ష్మి కొనసాగాలి.. 'పేదింటి ఆడబిడ్డ గెలవాలి" అంటూ బీఆర్ఎస్ శ్రేణులు చేసిన నినాదాలతో ధరూర్ రణరంగంగా మారింది. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న తల్లిదండ్రులకు ఆడపిల్ల పెళ్లి భారం కాకూడదన్న మానవీయ కోణంలో తీసుకొచ్చిన ఈ పథకం విషయంలో ప్రభుత్వ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని నేతలు విరుచుకుపడ్డారు. సమర శంఖం ఊదిన నేతలు ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల నేతలు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు — "పేదింటి పెళ్లిళ్లకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు ఆర్థిక వెసులుబాటును కల్పించాయి. ప్రజాదరణ పొందిన ఇటువంటి సంక్షేమ పథకాలను నిలిపివేయడం అంటే నిరుపేదల బతుకులతో ఆడుకోవడమే. ప్రభుత్వం తక్షణమే ఉదాసీనత వీడి, అర్హులైన ప్రతి కుటుంబానికి కళ్యాణ లక్ష్మి నిధులను విడుదల చేయాలి. లేని పక్షంలో ఈ ఉద్యమాన్ని గల్లీ నుండి ఢిల్లీ దాకా తీసుకెళ్తాం" అని హెచ్చరించారు. ఈ రోడ్డు దిగ్బంధన కార్యక్రమంలో పాల్గొన్నవారు వెంకటేష్ నాయుడు,అల్లాపాడు ప్రతాప్, మునిరెడ్డి, జాంపల్లి భరత్ సింహారెడ్డి, రాముడు, ఆంజనేయులు, ద్యాం శ్రీను,చంద్రశేఖర్, మహేందర్ రెడ్డి, ధర్మారావు, లక్ష్మణ, రాఘవేంద్ర, నరసింహులు, దుబన్న, దేవదాస్, బాలు సహా పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు పాల్గొని మద్దతు తెలిపారు.

## శివనామస్మరణతో మార్మోగిన వేణు సోంపురం

- విజృంభించిన భక్తిపారవశ్యం.. వైభవంగా పార్వతీ పరమేశ్వర శివాలయ ప్రథమ వార్షికోత్సవం

ఐజ ఆగస్టు 17 (వుదయం ప్రతినిధి)



జోగులాంబ గద్వాల జిల్లా ఐజ మండలం వేణు సోంపురం గ్రామంలో భక్తి చైతన్యం వెల్లివిరిసింది. స్థానిక శ్రీ పార్వతీ పరమేశ్వర స్వామివారి ఆలయ ప్రథమ వార్షికోత్సవం సోమవారం దివ్యభవంతో, అత్యంత అంగరంగ వైభవంగా జరిగింది. వేద పండితుల శంఖారావాలు, మంత్రోచ్ఛారణలు, భక్తుల 'హర హర మహాదేవ.. శంభో శంకర'హరోహర నినాదాలతో వేణు సోంపురం గ్రామం కైలాసాన్ని తలపించింది. స్వామివారి దివ్యదర్శనం కోసం పరిసర ప్రాంతాల నుంచి భక్తులు జనసముద్రమై తరలివచ్చారు. లోకకల్యాణార్థం పవిత్ర వైదిక క్రతువులు సమస్త ప్రాణికోటి శ్రేయస్సు, గ్రామ ప్రజల సుఖశాంతులను ఆకాంక్షిస్తూ జిల్లా అర్చక సంఘం అధ్యక్షులు ఆచార్య చక్రవర్తి చార్యుల దివ్య పర్యవేక్షణలో అత్యంత నిష్ఠతో పవిత్ర వైదిక క్రతువులు నిర్వహించారు. ఇందులో భాగంగా పాశుపత హోమం, రుద్రాభిషేకం, నమక చమక పారాయణలను వేద పండితులు శాస్త్రోక్తంగా సాగించారు. హోమ గుండాల నుంచి మిన్నంటిన సుగంధ దూపాలు, వేదఘోషలతో ఆలయ ప్రాంగణమంతా ఆధ్యాత్మిక శోభతో ప్రకాశమానంగా ప్రతిధ్వనించింది.ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం వార్షికోత్సవ పర్వదినాన్ని పురస్కరించుకుని వేణు సోంపురంతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి పసిపిల్లల నుంచి వృద్ధుల వరకు, విశేషంగా మహిళా భక్తులు క్యూలైన్లలో వేచి ఉండి పార్వతీ పరమేశ్వరులను దర్శించుకుని తమ మొక్కుబడులు తీర్చుకున్నారు. భక్తుల కోలాహలంతో ఆలయ ప్రాంగణంలో పండుగ ఉత్సాహం ఉప్పొంగింది.ఈ ఆధ్యాత్మిక మహోత్సవంలో గ్రామ సర్పంచ్ సరోజ జనార్ధన్, ఉప సర్పంచ్ శివన్న, మాజీ సర్పంచ్ నర్సోజి వీరేష్‌లతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, గ్రామ ప్రముఖులు, భక్తాదులు విశేష సంఖ్యలో పాల్గొని వేడుకలను అత్యంత దిగ్విజయం చేశారు.

## పాఠశాల భవనం నేలమట్టం.. విద్యార్థుల భవిష్యత్తు లంబకోణం!

- అనుమతుల్లేకుండానే కూల్చేశారా?.. 'మన ఊరు–మన బడి'లో అక్రమాల రచ్చ!
- మండల స్థాయి 'ప్రజావాణి'లో అధికారులకు వినతిపత్రం ఇచ్చిన గట్టు ఉపసర్పంచ్!

గట్టు ఆగస్టు 17 (వుదయం బ్యూరో)




భవనం కూల్చివేత పూర్తయ్యి నెలలు గడుస్తున్నా కొత్త నిర్మాణానికి పునాది రాయి కూడా పడలేదు. ప్రత్యామ్నాయ తరగతి గదులు లేవు.. కనీసం దాహార్తి తీర్చేందుకు గుక్కెడు నీళ్లూ దొరకడం లేదు. 'మన ఊరు-మన బడి' పేరుతో అధికారులు చేసిన అరకొర నిర్ణయాలు, కాంట్రాక్టర్ల నిర్వాకం ఇప్పుడు వందలాది మంది విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టేసింది. గట్టు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (జడ్పీహెచ్ఎస్ )లో పది తరగతి గదులు ఉన్న భవనాన్ని అసలు పంచాయతీరాజ్, విద్యాశాఖల అనుమతులు లేకుండానే కూల్చివేశారనే ఆరోపణలు నియోజక వర్గంలో తీవ్ర దుమారం రేపుతున్నాయి. ప్రజావాణి'లో ఫిర్యాదు.. రికార్డులు బయటపెట్టాలి! పాఠశాల భవనాన్ని కూల్చివేసేందుకు పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం నుంచి సాంకేతిక అనుమతులు ఉన్నాయా? అసలు ఉన్నతాధికారుల నుంచి అధికారికంగా కూల్చివేత ఉత్తర్వులు వచ్చాయా? కొత్త భవనానికి పరిపాలనాపరమైన నిధులు మంజూరయ్యాయా? అని ప్రజాప్రతినిధులు నిలదీశారు. సోమవారం గట్టు మండల తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమంలో గట్టు గ్రామ ఉపసర్పంచ్ యస్. అంజనమ్మ, వార్డు సభ్యులు పాల్గొని అధికారులకు సమగ్ర వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కూల్చివేత వ్యవహారానికి సంబంధించిన రికార్డులను పరిశీలించి వాస్తవాలను బయటపెట్టాలని వారు డిమాండ్ చేశారు.నరకప్రాయంగా మారిన విద్యాభ్యాసంచెట్ల కిందే పాఠాలు: పది గదులు నేలమట్టం కావడంతో ప్రత్యామ్నాయ వసతులు లేక విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. నీటి చుక్కకూ తిప్పలే: పాఠశాలలో ఉన్న ఒక్క తాగునీటి ట్యాంకు విద్యార్థుల సంఖ్యకు ఏమాత్రం సరిపోవడం లేదు. పంచాయతీ హామీ: విద్యార్థుల దాహార్తిని తీర్చేందుకు గ్రామపంచాయతీ నిధులతో అదనపు తాగునీటి ట్యాంకును నిర్మించేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రజాప్రతినిధులు తెలిపారు. కాంట్రాక్టర్లు, అధికారులపై 'వేటు' పడాల్సిందే! విచారణ పేరుతో కాలయాపన చేయకుండా, నిబంధనలు ఉల్లంఘించి భవనాన్ని కూల్చివేసిన కాంట్రాక్టర్లు, సహకరించిన అధికారులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ప్రజావాణి వేదికగా విజ్ఞప్తి చేశారు. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి క్షేత్రస్థాయి పరిశీలన జరపాలని, విద్యార్థులకు యుద్ధప్రాతిపదికన తాత్కాలిక షెడ్లు ఏర్పాటు చేయడంతో పాటు కొత్త భవన నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

## రాజ్యాంగ విలువలను కాపాడాలి

- డిసిసి అధ్యక్షులు కే ప్రశాంత్ కుమార్ రెడ్డి
- ఖర్గే కు జరిగిన అవమానంపై నారాయణపేట లో కాంగ్రెస్ మహాధర్నా

నారాయణపేట టౌన్ ఆగస్టు 17 (వుదయం ప్రతినిధి)



ఉత్తరఖండ్ రాష్ట్రంలోని హల్ద్వానీ లో జరిగిన కులవివక్ష ఘటనకు నిరసనగా ఏఐసీసీ,టిపిసిసి కమిటీ పిలుపు మేరకు సోమవారం నారాయణపేట జిల్లా కేంద్రంలో డీసీసీ అధ్యక్షులు కె.ప్రశాంత్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ సత్యాగ్రహ మహాధర్నా నిర్వహించారు.సీవీఆర్ భవన్ నుంచి కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు భారీ ర్యాలీగా అంబేద్కర్ చౌరస్తా వరకు పాదయాత్ర నిర్వహించారు.అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించిన అనంతరం అక్కడే సత్యాగ్రహ దీక్ష చేపట్టారు.

ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షులు కె. ప్రశాంత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ హల్ద్వానీలో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే పాల్గొన్న సభ అనంతరం జరిగిన ఘటన అత్యంత బాధాకరమన్నారు.ప్రజా సభ జరిగిన ప్రదేశాన్ని శుద్ధీకరణ పేరుతో బిజెపి పార్టీ కి చెందిన కొందరు సానుభూతి పరులు గంగాజలంతో శుభ్రం చేయడం కుల వివక్షకు సంబంధించిన ఆలోచనలకు తావిచ్చే చర్యగా కనిపిస్తోందన్నారు .ఈ ఘటనను తీవ్రంగా ఖండించారు. రాజకీయ విభేదాలు ఎన్ని ఉన్నా ఒక వ్యక్తి కులం ఆధారంగా అతని గౌరవాన్ని కించపరిచే చర్యలు జరగడం బాధాకరమన్నారు.ఈ ఘటనకు బీజేపీకి చెందిన కొందరు సానుభూతిపరుల ప్రమేయం ఉందని దీనిపై బీజేపీ నాయకత్వం ఘటనను బహిరంగంగా ఖండించి, సమగ్ర విచారణకు సహకరించాలని డిమాండ్ చేశారు.కుల వివక్షను ప్రోత్సహించే చర్యలకు ఎవరి మద్దతు ఉన్నా కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని స్పష్టం చేశారు.ఘటనకు బాధ్యులు ఎవరైనా చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఇలాంటి సంఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ సత్యాగ్రహ దీక్షను జిల్లా కేంద్రానికే పరిమితం చేయకుండా ప్రతి మండలం,ప్రతి గ్రామానికి తీసుకెళ్లాలి ఈ ఘటన ను ఖండించాలని కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు.

ప్రతి ఒక్కరి ఓటు హక్కును కాపాడాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. ముసాయిదా ఓటర్ల జాబితా వచ్చినప్పుడు కాంగ్రెస్ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.అర్హులైన ఒక్క ఓటరు పేరు కూడా జాబితా నుంచి తొలగిపోకుండా నిబంధనల ప్రకారం పరిశీలించాలని కోరారు.


బూత్ స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

బీఎల్ఏలు ఒక్కరే అన్నీ చేయలేరని, ప్రతి కాంగ్రెస్ నాయకుడు ఇందులో భాగస్వామి కావాలన్నారు.ఈ కార్యక్రమంలో పేట,కోస్గి, మక్తల్ మార్కెట్ చైర్మన్లు శివారెడ్డి,భీములు,రాధ లక్ష్మరెడ్డి,జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి. సలీం,జిల్లా అధికార ప్రతినిధి సంతోష్,క్రమశిక్షణ సంఘం జిల్లా అధ్యక్షులు గాజుల శివకుమార్,ఎస్సి సెల్ జిల్లా అధ్యక్షులు వెంకటయ్య,మండల, పట్టణ అధ్యక్షులు కోట్ల. రవీందర్ రెడ్డి, వెంకటేష్ గౌడ్,అనంద్, విజ్జప్ప గౌడ్,సూర్య ప్రకాష్ రెడ్డి,శివరాం రెడ్డి,బాలయ్య,మాజీ మార్కెట్ చైర్మన్లుబండి.వేణుగోపాల్,సుధాకర్,ఎండి. గౌస్,నరహరి,వైస్ చైర్మన్ కె. హన్మంతు ,బోయ. శరణప్ప,పళ్ళ అనిల్,పిఎసిఎస్ చైర్మన్ ఈదప్ప,నిరంజన్ రెడ్డి కౌన్సిలర్లు రాజేష్ ఘాట్, కుర్వ మనోజ్,శంకర్,ఉగ్గు రాజు,ఆర్టివో బోర్డ్ డైరెక్టర్ పోషల్ రాజేష్,యూత్ జిల్లా అధ్యక్షులు కోట్ల. మధుసూదన్ రెడ్డి,యూత్ మండల అధ్యక్షులు మహేష్, సర్ఫరాజ్ , వేణు గౌడ్,అఖిల్ రెడ్డి,యస్సి సెల్ మండల అధ్యక్షులు చంద్రయ్య,శ్రీను,చందర్, రాజేష్,రాములు తదితరులు పాల్గొన్నారు.

## రైతు బీమా పథకం యధావిధిగా కొనసాగించాలి

- రైతు రక్షణ సమితి జిల్లా అధ్యక్షులు అక్కమొల్ల మైసయ్య....

వుదయం న్యూస్ శివ్వంపేట ఆగస్ట్ 17..



రైతు బీమా పథకాన్ని కొనసాగించాలని రైతు కుటుంబాలకు హార్థిక భద్రత కల్పించిన రైతు బీమా పథకాన్ని ఎలాంటి విరామం లేకుండా కొనసాగించాలని తెలంగాణ రైతు రక్షణ సమితి ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షుడు అక్కముళ్ల మైసయ్యా యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతు బీమా పథకం ద్వారా రైతు కుటుంబాలకు అండగా నిలిచే ఐదు లక్షల రూపాయల బీమా రక్షణను కొనసాగించడం అత్యవసర అవసరములకు రైతు కుటుంబాన్ని ఆధారమైన వ్యక్తి మరణిస్తే ఆ కుటుంబానికి ఒక సహాయంగా ఆర్థిక ఇబ్బందుల్లో పడకుండా అలాంటి సమస్యల్లో రైతు బీమా కుటుంబానికి ఎంతో కీలకమైన భరోసా కల్పిస్తుందని వైశ్య యాదవ్ తెలిపారు. 2025.26 సంవత్సరానికి సంబంధించిన రైతు బీమా కాలపరిమితి ముగిసిన నేపథ్యంలో 2026. 27 సంవత్సరానికి బీమా పథకం కొనసాగించడం పై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు రక్షణ సమితి మెదక్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మిరియాల చంద్రశేఖర్. జిల్లా కార్యదర్శి బోగిని రమేష్ యాదవ్. జిల్లా ఉపాధ్యక్షులు కే అశోక్ రెడ్డి. జిల్లా ముఖ్య సలహాదారులు కొండ ఎల్లం యాదవ్. జిల్లా సబ్బులు పి మల్లేష్. పరుశురాం. ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## వ్యాధుల నివారణకు టీకాలు తప్పనిసరి

- ఆర్డిఓ అర్చన

తెలకపల్లి ఆగస్టు 17 (వుదయం ప్రతినిధి)



వ్యాధుల నివారణ కోసం టీకాలు తప్పనిసరిగా వేయించుకోవాలని నాగర్కర్నూల్ ఆర్డీవో అర్చన అన్నారు. మండల కేంద్రంలోని బాలికల గురుకుల పాఠశాలలో సోమవారం వైద్యశాఖ అధికారులు నిర్వహించిన వ్యాక్సినేషన్ శిబిరాన్ని ఆమె సందర్శించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కోరింత దగ్గు తదితర వ్యాధుల నివారణ కోసం 5,10, 16 ఏళ్ల నిండిన వారు బూస్టర్ డోస్ తప్పనిసరిగా వేయించు కోవాలని సూచించారు. వ్యాక్సిన్ వేయించుకోవడం వల్ల ఇమ్యూనిటీ పెరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరికి టీకాలు అందే విధంగా వైద్యశాఖ సిబ్బంది ప్రణాళిక రూపొందించుకొని ప్రత్యేక శిబిరాలు నిర్వహించాలన్నారు. ఆరోగ్యంగా ఉంటూ ఉన్నత శిఖరాలకు ఎదగాలని విద్యార్థులకు సూచించారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఆమెతోపాటు డిప్యూటీ తాసిల్దార్ లక్ష్మణ్, హెల్త్ సూపర్వైజర్ యశోద,హెల్త్ అసిస్టెంట్ సందీప్ రెడ్డి, ఏ ఎన్ ఎం లు తదితరులు పాల్గొన్నారు.

## వీధి కుక్కల బెడదను అరికట్టాలి

అచ్చంపేటఆగస్టు17 (వుదయం ప్రతినిధి)




పట్టణంలో వీధి కుక్కల సంఖ్య విపరీతంగా పెరిగి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న నేపథ్యంలో వాటి నియంత్రణ & సమస్య శాశ్వత పరిష్కారం కొరకు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం నిర్వహించిన మండల స్థాయి ప్రజావాణిలో అడ్వకేట్ S. చందూలాల్ చౌహాన్ సంబంధిత అధికారులకు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అచ్చంపేట పట్టణంలోని వివిధ కాలనీలు, ప్రధాన రహదారులు, మార్కెట్ ప్రాంతాలు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల పరిసరాల్లో వీధి కుక్కలు గుంపులుగా సంచరిస్తున్నాయని తెలిపారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో ద్విచక్ర వాహనదారులను వెంబడించడం, చిన్నపిల్లలు, మహిళలు, వృద్ధులపై దాడులకు పాల్పడటం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకొని అచ్చంపేట పట్టణంలో వీధి కుక్కల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా సంబంధిత అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని S. చందూలాల్ చౌహాన్ కోరారు.




## రావికి రాక్షసకాటు!

- 80 ఏళ్ల వృక్షానికి 'గొడ్డలి' పెడతారా?
- రచ్చకట్టను ధ్వంసం చేసి కమర్షియల్ షాపుల నిర్మాణం
- అక్రమాలపై గళమెత్తిన పెద్దతాండ్రపాడు గ్రామీణులు
- ఆక్రమణలు తొలగించి, రచ్చకట్టను పునర్నిర్మించాలని ప్రజావాణిలో విజ్ఞప్తి

రాజోలి ఆగస్టు 17 (వుదయం ప్రతినిధి)

గ్రామ చారిత్రక సంపదకు, తరతరాల జ్ఞాపకాలకు సజీవ సాక్ష్యంగా నిలిచిన 80 ఏళ్ల పురాతన రావిచెట్టును కాపాడుకోవడానికి పెద్దతాండ్రపాడు గ్రామస్తులు పోరుబాట పట్టారు. ఊరి నడిబొడ్డున ఉన్న పవిత్రమైన రచ్చకట్టను కొందరు స్వార్థపరులు ధ్వంసం చేసి, ఆక్రమణలకు తెరలేపారని తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. చెట్టు చుట్టూ వెలిసిన అక్రమ నిర్మాణాలను తక్షణమే నేలమట్టం చేసి, రచ్చకట్టను పునర్నిర్మించేందుకు అనుమతులివ్వాలని సోమవారం రాజోలి ప్రజావాణిలో అధికారులకు సమగ్ర వినతిపత్రాన్ని అందజేశారు. గ్రామ ఉనికికే ముప్పుగా మారిన ఈ ఆక్రమణలపై గతంలో గ్రామసభలు, ప్రజా విచారణలు నిర్వహించి ఏకగ్రీవ తీర్మానాలు చేసినా.. అధికారులు ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఈ పురాతన చెట్టును నరికివేసేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయగా, ప్రజల అభ్యంతరం మేరకు అటవీశాఖ దాన్ని రద్దు చేసిందని గుర్తుచేశారు. అక్రమంగా నిర్మించిన కాంపౌండ్ వాల్స్, షాపులను పూర్తిగా తొలగిస్తేనే చెట్టుకు శాశ్వత రక్షణ దక్కుతుందని స్పష్టం చేశారు. ప్రభుత్వం నిధులు ఇవ్వకపోతే గ్రామస్తులందరం చందాలు వేసుకుని రచ్చకట్టను నిర్మించుకుంటామని, వెంటనే అనుమతులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

## శంభులింగేశ్వరునికి వెండి నాగపడగ బహుకరించిన భక్తులు

వుదయం న్యూస్ కొండపాక ప్రతినిధి ఆగస్టు 17



మండల పరిధిలోని దుద్దెడ గ్రామంలో వెలసిన ప్రసిద్ధ శ్రీ స్వయంభూ శంభులింగేశ్వర స్వామిదేవాలయంలో నాగుల పంచమి పర్వదినాన్ని పురస్కరించుకొని సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌కు చెందిన భక్తుడు మండల కవిత జ్ఞానేశ్వర్ దంపతులు స్వామివారికి 134 గ్రాముల బరువు గల వెండి నాగపడగను కానుకగా సమర్పించారు. ఎంతో ప్రాశస్త్యం కలిగిన స్వయంభూ శంభులింగేశ్వర స్వామికి పవిత్రమైన నాగుల పంచమి రోజున వెండి నాగపడగను బహూకరించడం పట్ల భక్తులు హర్షం వ్యక్తం చేశారు. స్వామివారికి వెండి ఆభరణాన్ని సమర్పించిన దాత జ్ఞానేశ్వర్‌కు ఆలయ పాలక మండలి సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆలయ పాలక మండలి అధ్యక్షుడు మంచాల శ్రీనివాస్, ఉపాధ్యక్షులు గోనె శ్రీనివాస్, నర్ర దేశాయిరెడ్డి, ప్రధాన కార్యదర్శి అనంతుల నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల చెంతకు ప్రజావాణి



- ప్రజల నుంచి ఫిర్యాదుల స్వీకరణ

ఊర్కొండ న్యూస్ 17 వుదయం ప్రతినిధి

నాగర్ కర్నూల్ జిల్లా ఊర్కొండ మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద సోమవారం ప్రజావాణి కార్యక్రమం ప్రారంభమైంది. ప్రజావాణి నోడల్ అధికారి, ఎంపీడీవో సత్యపాల్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించిన అధికారులు. సమస్య ఏదైనా సరే పరిష్కరిస్తామని అధికారుల హామీ . ప్రజలు సమస్యలను దరఖాస్తును స్వీకరించిన నోడల్ అధికారి సత్యపాల్ రెడ్డి, సంబంధిత అధికారి,సమస్య పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని. సంబంధిత అధికారులు తెలిపారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి అబ్దుల్ రహీం, మండల వ్యవసాయ అధికారి దీప్తి, మండల విద్యుత్ అధికారి సాయన్న గౌడ్, మండల పశువైద్యాధికారి రాజేష్, ఏఎస్ఐ లచ్చునాయక్‌తోపాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ప్రజావాణి కార్యక్రమం ఉపయోగపడుతుందని నోడల్ అధికారి, ఎంపీడీవో సత్యపాల్ రెడ్డి తెలిపారు.

## గరుడ పంచమికి ఎంతగానో ప్రాముఖ్యత

- శ్రీ గురు పీఠం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ శివకుమార్ గౌడ్

వుదయం న్యూస్, శివ్వంపేట ఆగస్ట్ 17:



మెదక్ జిల్లా శివ్వంపేట మండల పరిధిలోని గూడూరు గ్రామంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రంలో సిగ్గు పీఠం చారిటబుల్ ట్రస్ట్ ప్రధాన అర్చకులు శాస్త్రుల నటరాజ్ శర్మ ఆధ్వర్యంలో శ్రీ గురు పీఠం చైర్మన్ ఫౌండర్ వ్యవస్థాపకులు జిన్నారం శివకుమార్ గౌడ్ శ్రావణమాసం సోమవారం పంచమి .గరుడ పంచమి పురస్కరించుకొని . నేడు శ్రీ గురు పీఠంలో కొలువుదీరిన దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గరుడ పంచమిని ఈ నెల 29న దేశమంతా జరుపుకోనుంది. ఆ తరువాత విష్ణుమూర్తి వాహనంగా మారాడు. శ్రీకృష్ణుడు భగవద్గీతలో – వైనతేయశ్చ పక్షిణం అంటే.. "పక్షులలో, నేను గరుడుడిని" అని చెప్పాడు. గరుడుడు నిత్యం విష్ణుమూర్తిని తన వీపుపై మోస్తాడు. కాబట్టి ఆయనను అన్ని వాహకులకు అగ్రగణ్యుడిగా పరిగణిస్తారు. గరుడిని రెండు రెక్కలను సామవేదంలోని రెండు విభాగాలతో పోలుస్తారు. గరుడుడు తన రెక్కలను ఆడించినప్పుడు సామవేదం నుంచి శ్లోకాల జపం మనకు వినిపిస్తుందట. గరుడుడిని పక్షిరాజ, వైనతేయ, సుపర్ణ, గరుత్మాన్, పెరియ తిరువడి, వినతసుత, విష్ణు వాహన, నాగంతక, కశ్యపేయ వంటి పేర్లతో సైతం పిలుస్తారు. గరుడకు ఇంతటి ప్రాముఖ్యత ఉంది కాబట్టే మనం గరుడ పంచమిని అత్యంత వైభవంగా జరుపుకుంటాం అని వారు తెలిపారు.



# గ్రేటర్ హైదరాబాద్



## తిరుపతి పాదయాత్రను ప్రారంభించిన ఎమ్మెల్యే జీఎంఆర్



**అమీనాపూర్ ఆగష్టు 17, వుదయం**
పటాన్చెరు అమీనాపూర్ కు చెందిన సీసాల రాజు ఆధ్వర్యంలో ప్రతి ఏడాది నిర్వహిస్తున్న పటాన్చెరు-తిరుపతి పాదయాత్రను సోమవారం ఉదయం పట్టణంలోని మహంకాళి దేవాలయం వద్ద పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ప్రారంభించారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ.. భక్తిశ్రద్ధలతో వరుసగా 22 సంవత్సరాలుగా తిరుపతికి పాద యాత్ర నిర్వహించడం అభినందనీయ మని అన్నారు. ఆధ్యాత్మిక విశ్వాసంతో చేపడుతున్న ఈ పాదయాత్ర విజయవంతంగా సాగాలని, యాత్రికులందరికీ శ్రీ వెంకటేశ్వర స్వామివారి ఆశీస్సులు లభించాలని ఆకాంక్షించారు.
అనంతరం కిష్టారెడ్డిపేటకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు మాణిక్యం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తిరుపతి పాదయాత్రను కూడా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా యాత్రికులకు శుభాకాంక్షలు తెలియజేసి, వారు సురక్షితంగా తిరుపతి చేరుకుని స్వామివారిని దర్శించుకోవాలని ఆకాంక్షించారు.

## ప్రజావాణికి(136)ఫిర్యాదులు



**రంగారెడ్డి జిల్లా ఆగష్టు 17, వుదయం**
సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి (136) ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను జిల్లా రెవెన్యూ అధికారి శారద దేవి కి విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు.
ఈ సందర్భంగా డిఆర్ఓ శారద దేవి మాట్లాడుతూ ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.
రెవెన్యూ శాఖ-60, ఇతర శాఖలు 76, మొత్తం దరఖస్తులు అందాయి.
ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## 2 ఏళ్ల చిన్నారిపై లైంగిక దాడికి ప్రయత్నం అమీనాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగినట్లు ఫిర్యాదు నమోదైంది.

**అమీనాపూర్ ఆగష్టు 17, వుదయం**
నిన్న రాత్రి సుమారు 8:15 గంటల సమయంలో, నిందితుడు రఘునాథ్ (తండ్రి: రామ్స్వరూప్, వయసు: 48 ఏళ్లు, స్వస్థలం: ధనానా బుజుర్గ్, కాన్పూర్ నగర్, ఘటంపూర్, ఉత్తరప్రదేశ్; ప్రస్తుతం 'దీపక్ బ్రిక్స్ బ్లాక్ కంపెనీ' గదుల్లో నివాసం) గండిగూడెం చౌరస్తాకు చెందిన 2 ఏళ్ల చిన్నారిని, ఆమె ఇంటి ముందు ఆడుకుంటుండగా అక్కడి నుండి తీసుకువెళ్లాడు. అతను ఆ చిన్నారిని సుమారు 500 మీటర్ల దూరంలో ఉన్న ఇలాపూర్ తండా శివార్లలోని ఒక నిర్మానుష్య ప్రాంతానికి తీసుకువెళ్లి, ఆమెపై లైంగిక దాడికి ప్రయత్నించాడు. అతను తన ప్యాంట్ విప్పి, చిన్నారిని తనపై ఉంచుకుని దాడి చేయడానికి యత్నించాడు.అదే సమయంలో, చిన్నారి ఏడుపు విని, బొల్లారం గ్రామంలో పని ముగించుకుని ఇంటికి వెళ్తున్న శశి కుమార్ (తండ్రి: ధేన్య, వయసు: 27 ఏళ్లు, నివాసం: గండిగూడెం కాలనీ) ఆ సంఘటనా స్థలానికి వెళ్లాడు. అక్కడ నిందితుడు ప్యాంట్ విప్పి, చిన్నారిని తనపై ఉంచుకుని లైంగిక దాడికి ప్రయత్నించడాన్ని అతను గమనించాడు.
శశి కుమార్ ఆ చిన్నారిని రక్షించి, నిందితుడిని అతని చర్య గురించి ప్రశ్నించాడు.
అలాగే తన స్నేహితుడు నవీన్కు ఫోన్ చేసి, చిన్నారిని రక్షించడంలో సహాయపడ్డాడు. ఈ మేరకు పోలీసులు నిదితుడు రఘునాథ్ ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## వివాహ వార్షికోత్సవ వేడుకలకు సేవా స్ఫూర్తి..

**శంకర్ పల్లి ఆగస్టు 17 (వుదయం)**
శంకర్పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చేకూర్తా గోవిందమ్మ గోపాల్రెడ్డి కుమారుడు చేకూర్త మధుకర్రెడ్డి, చేకూర్త నిఖిలారెడ్డి దంపతుల మొదటి వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం మండలంలోని మహాలింగాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ చేశారు.
విద్యార్థి విద్యార్థినులకు పుస్తకాలు, డిక్షనరీలు, బ్లాక్బోర్డులు, అట్లాస్లు అందజేసి విద్యా ప్రగతికి అండగా నిలిచారు. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ గోవిందమ్మ మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టపడి చదువుకొని వృద్ధిలోకి రావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సీతాలక్ష్మి ఉపాధ్యాయులు అంజయ్య, శ్రీరాములు, మల్లికార్జున స్వామి, రమ, అనుపమ, గీతాంజలి, పల్లవి తదితరులు పాల్గొన్నారు.

# పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యే లక్ష్యం

- **పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**

**రామచంద్రాపూర్ ఆగష్టు 17, వుదయం**
**తెల్లాపూర్లో రూ.48 కోట్లతో క్యూర్ అర్బన్ స్కూల్కు శంకుస్థాపనరామచంద్రాపురం:** పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులకు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా నాణ్యమైన విద్యను ఉచితంగా అందించడమే తమ లక్ష్యమని పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. ఆర్థిక స్థోమత కారణంగా ఏ విద్యార్థి నాణ్యమైన విద్యకు దూరం కాకూడనే ఉద్దేశంతో విద్యారంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు.
సోమవారం తెల్లాపూర్ డివిజన్ పరిధిలోని సర్వే నంబర్ 323లో ఎకరా విస్తీర్ణంలో రూ.48 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న క్యూర్ అర్బన్ స్కూల్ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి శంకుస్థాపన చేశారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రీప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యాబోధన ఒకే ప్రాంగణంలో కొనసాగించేలా పాఠశాలను నిర్మిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు క్రమశిక్షణ, సాంకేతిక పరిజ్ఞానం, క్రీడలు, సృజనాత్మకత వంటి అంశాల్లో సమగ్ర అభివృద్ధి



కల్పించేలా పాఠశాలను తీర్చిదిద్దనున్నట్లు చెప్పారు.
అత్యాధునిక వసతులుక్యూర్ అర్బన్ స్కూల్లో డిజిటల్ తరగతి గదులు, ఆధునిక సైన్స్, కంప్యూటర్ ల్యాబ్లు, సమృద్ధిగా పుస్తకాలతో కూడిన లైబ్రరీ, విశాలమైన ఆటస్థలాలు తదితర అత్యాధునిక సౌకర్యాలను ఏర్పాటు చేయనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. విద్యతో పాటు క్రీడలు, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, సాంకేతిక పరిజ్ఞానం, సృజనాత్మకతకు సమాన ప్రాధాన్యతనిస్తూ విద్యార్థుల సమగ్ర వికాసానికి బలమైన పునాది వేయనున్నట్లు పేర్కొన్నారు.
పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా..



తెల్లాపూర్, పరిసర ప్రాంతాల్లో వేగంగా పెరుగుతున్న జనాభా, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఆధునిక ప్రభుత్వ పాఠశాల అవసరం ఉందని మహిపాల్ రెడ్డి అన్నారు. పాఠశాల అందుబాటులోకి వస్తే తెల్లాపూర్తో పాటు పరిసర ప్రాంతాల్లోని వందలాది మంది పేద, మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుబాటులోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.
పనులు వేగంగా పూర్తి చేయాలి



పాఠశాల నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ నిర్ణీత గడువులోగా పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. నిర్మాణంలో ఎలాంటి నాణ్యతా లోపాలకు తావులేకుండా నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.
ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సోమిరెడ్డి, రాములు గౌడ్, దేవేందర్ యాదవ్, మల్లారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ బుచ్చిరెడ్డి, మాజీ కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## అడ్వకేట్ తేజావత్ దీపికకు ఘన అభినందనలు

- **రాష్ట్రీయ గోర్ సేన హైదరాబాద్ వైస్ ప్రెసిడెంట్గా సేవలు..**
- **ఉన్నత విద్యతో పాటు న్యాయవాద వృత్తిలోనూ రాణింపు**

**ముషీరాబాద్, ఆగస్టు 17 (వుదయం):**
రాష్ట్రీయ గోర్ సేన తెలంగాణ రాష్ట్రంలో హైదరాబాద్ వైస్ ప్రెసిడెంట్గా సేవలందిస్తున్న అడ్వకేట్ తేజావత్ దీపికకు కుటుంబ సభ్యులు, బంధువులు ఘనంగా అభినందనలు తెలిపారు. భువనగిరి సమీపంలోని కేకే తండాకు చెందిన దీపిక, సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ మరోవైపు న్యాయవాద వృత్తిలోనూ తనదైన ముద్ర వేస్తూ ముందుకు సాగుతున్నారు.జీవితంలో ఎదురైన ఎన్నో సవాళ్లను అధిగమిస్తూ దీపిక తన లక్ష్యసాధనలో పట్టుదలతో ముందుకు సాగారు. ఆమె కష్టకాలంలో భర్త పవన్ కళ్యాణ్ అండగా నిలిచి, ఉన్నత చదువులు కొనసాగించేందుకు అవసరమైన సహాయ సహకారాలు అందించారు. ఆమె ఆశయాలను గౌర



విస్తూ ప్రతి అడుగులోనూ ప్రోత్సహిస్తూ వెన్నంటే నిలిచారు.భర్త పవన్ కళ్యాణ్ అందించిన ప్రోత్సాహం.. దీపిక పట్టుదల, కృషి.. ఈ రెండూ కలిసి ఆమెను ఉన్నత విద్యను పూర్తి చేసి న్యాయవాదిగా ఎదిగేలా చేశాయి. ప్రతికూల పరిస్థితులను అవకాశాలుగా మలుచుకుని, విద్యను ఆయుధంగా చేసుకుని తన లక్ష్యాన్ని సాధించిన దీపిక నేటి యువతకు, ముఖ్యంగా మహిళలకు స్ఫూర్తిగా నిలుస్తున్నారని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.న్యాయవాద వృత్తితో పాటు సామాజిక సేవలోనూ చురుకైన పాత్ర పోషిస్తున్న దీపిక భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని వారు ఆకాంక్షించారు. మహిళలు తమ లక్ష్యాలను సాధించడంలో కుటుంబ ప్రోత్సాహం, జీవిత భాగస్వామి సహకారం ఎంత కీలకమో దీపిక ప్రయాణం నిరూపిస్తోందని తెలిపారు.ఈ సందర్భంగా దీపిక అత్త అంబి నాయక్, మామ హేమ నాయక్ తదితర కుటుంబ సభ్యులు ఆమెను ఘనంగా అభినందించారు. న్యాయవాద వృత్తిలో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించడంతో పాటు, సామాజిక సేవా రంగంలోనూ మరింత విస్తృతంగా సేవలందించాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.కేకే తండా నుంచి న్యాయవాద వృత్తి వరకు.. ఉన్నత విద్యతో ఎదిగి.. సామాజిక సేవలోనూ తనదైన ముద్ర వేస్తున్న అడ్వకేట్ తేజావత్ దీపికకు అభినందనల వెల్లువ!

## ప్రజావాణిలో ప్రజల సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యత...

- **ఎడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, ఐఏఎస్**

**మేడ్చల్, ఆగష్టు 17 ,(వుదయం ప్రతినిధి ),**
మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ (ఐడీఓసీ) సమావేశ మందిరంలో సోమవారం రోజున నిర్వహించిన 'ప్రజావాణి' కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఫైజాన్ అహ్మద్, ఐఏఎస్ జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్ఓ) మాలతి ప్రజల నుంచి నేరుగా వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ మాట్లాడుతూ ప్రజావాణిలో సమర్పించిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖల అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, చట్టపరిధిలో త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజల ఫిర్యాదుల పట్ల అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించా



లని, అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజావాణి కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితులు, దరఖాస్తుదారులు మొత్తం 92 అర్జీలను అధికారులకు సమర్పించారు. ఇందులో ప్రధానంగా రెవెన్యూ, భూసంబంధిత సమస్యలు, డబుల్ బెడ్రూమ్ ఇళ్లు, పింఛన్లు, డ్రైనేజీ, రహదారులు, తాగునీటి సరఫరా వంటి పౌర సమస్యలు, ఆసరా పింఛన్లు ఇతర సంక్షేమ పథకాలపై దరఖాస్తులు అందాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిధిలోని అన్ని శాఖల జిల్లా అధికారులు (డిస్ట్రిక్ట్ ఆఫీసర్స్), కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సర్వే నెంబర్ 23లో ప్రభుత్వ స్థలాన్ని రక్షించాలి

- **ఆకుల సతీష్**

**కుత్బుల్లాపూర్, ఆగష్టు 17 ,(వుదయం ప్రతినిధి ),**
కుత్బుల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని పేట్ బషీరాబాద్ సర్వే నెంబర్ 23లో డీసీపీ కార్యాలయం కోసం గతంలో కేటాయించిన రెండు ఎకరాల ప్రభుత్వ స్థలానికి తక్షణమే అడ్వాన్స్ పొజిషన్ ఇచ్చి, ఫెన్సింగ్ ఏర్పాటు చేసి రక్షించాలని కోరుతూ ఆకుల సతీష్ టీమ్ ఆధ్వర్యంలో ప్రజావాణిలో అధికారులకు ఫిర్యాదు చేసారు. డీసీపీ కార్యాలయం కోసం కేటాయించిన ఈ విలువైన ప్రభుత్వ స్థలాన్ని రోడ్డు పేరుతో ఇతర నిర్మాణాలకు, ముఖ్యంగా బీఆర్ఎస్ నాయకులకు సంబంధించిన
నిర్మాణాలకు అప్రోచ్ రోడ్గా ఉపయోగించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయంలో సిఎంసీ కమిషనర్ ఒత్తిడి మేరకు వ్యవహరించడం, కలెక్టర్ ఆ ఆదేశాలను అమలు చేయడం తక్ష



ణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ అవసరాల కోసం కేటాయించిన రెండు ఎకరాల స్థలాన్ని ఇతరుల నిర్మాణాలకు ఉపయోగించకుండా అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ కార్యాలయం కోసం కేటాయించిన స్థలాన్ని పరిరక్షించడం అధికారుల బాధ్యత అని, వారంలోపు స్థలానికి ఫెన్సింగ్ ఏర్పాటు చేసి, అడ్వాన్స్ పొజిషన్ కల్పించి ప్రభుత్వ ఆస్తిని రక్షించాలని, అధికారులు స్పందించి తక్షణ చర్యలు తీసుకోకపోతే శనివారం కుత్బుల్లాపూర్ ఎమ్మార్వో కార్యాలయం ఎదుట శాంతియుత నిరసన కార్యక్రమం నిర్వహిస్తామని ఆకుల సతీష్ టీమ్ హెచ్చరించారు. ప్రభుత్వ స్థలాల పరిరక్షణలో ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా నిబంధనల ప్రకారం వ్యవహరించి సర్వే నెంబర్ 23 లోని రెండు ఎకరాల స్థలాన్ని డీసీపీ కార్యాలయం కోసం కాపాడాలని అధికారులను డిమాండ్ చేశారు.

## హెచ్ఓడీ ఉద్యోగులకు 12.5% కోటా అమలు చేయాలి

- **TNGOs' యూనియన్ కేంద్ర కార్యవర్గ సమావేశంలో కీలక తీర్మానం**

**ముషీరాబాద్,ఆగస్టు17(వుదయం)**
తెలంగాణ నాన్గెజిటెడ్ అధికారుల సంఘం (TNGOs' Union) కేంద్ర కార్యవర్గ సమావేశం సోమవారం హైదరాబాద్లో నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షులు శ్రీ ఎం. జగదీశ్వర్ అధ్యక్షతన, ప్రధాన కార్యదర్శి శ్రీ ఎస్.ఎం. హుస్సైనీ (ముజీబ్) ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు, పెండింగ్ డిమాండ్లు, పదోన్నతులు తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు.

**హెచ్ఓడీ ఉద్యోగులకు 12.5% కోటా అమలుపై తీర్మానం**
తెలంగాణ సచివాలయంలోని హెచ్ఓడీ శాఖల్లో పనిచేస్తున్న అర్హులైన ఉద్యోగులకు 12.5 శాతం కోటాను వెంటనే అమలు చేయాలని TNGOs' Union కేంద్ర కార్యవర్గం ఏకగ్రీవంగా తీర్మానించింది. ఉద్యోగుల న్యాయమైన హక్కులను కాపాడేందుకు ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలని సమావేశం డిమాండ్ చేసింది. ప్రత్యేకంగా 202526 ప్యానల్ సంవత్సరానికి సంబంధించి ASO, SO క్యాడర్లలో 12.5% కోటా కింద అర్హులైన హెచ్ఓడీ ఉద్యోగులకు తగిన అవకాశాలు కల్పించాలని




కోరింది. ASO నియామక ప్రక్రియను ఆలస్యం చేయకుండా వెంటనే అమలు చేయడంతో పాటు, SO క్యాడర్కు సంబంధించి అవసరమైన చర్యలను ప్రభుత్వం చేపట్టాలని నాయకులు డిమాండ్ చేశారు.

**పెండింగ్ సమస్యలపై ప్రభుత్వానికి హెచ్చరిక**
ఉద్యోగుల సమస్యలను ఏళ్ల తరబడి పెండింగ్లో ఉంచడం సరికాదని TNGOs' Union స్పష్టం చేసింది. పెండింగ్ బిల్లుల చెల్లింపులు, DA బకాయిలు, PRC అమలు, ఉద్యోగుల ఇతర పెండింగ్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కేంద్ర కార్యవర్గం ప్రభుత్వాన్ని కోరింది.
హెచ్ఓడీ ఉద్యోగులకు 12.5% కోటా అమలు చేయాలని TNGOs' Union ఇప్పటికే పలుమార్లు ప్రభుత్వానికి విజ్ఞప్తులు, వినతిపత్రాలు సమర్పించిందని నాయకులు తెలిపారు. అయినప్పటికీ సమస్యకు పూర్తి పరిష్కారం లభించకపోవడంతో కేంద్ర కార్యవర్గ సమావేశంలో మరోసారి స్పష్టమైన తీర్మానం చేయడం జరిగిందన్నారు.హక్కులు సాధించే వరకు పోరాటం కొనసాగుతుంది
హెచ్ఓడీ ఉద్యోగులకు 12.5% కోటా అమలు కేవలం డిమాండ్ మాత్రమే కాదని, అర్హులైన ఉద్యోగులకు న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని TNGOs' Union నాయకులు పేర్కొన్నారు. కోటా అమలు జరిగే వరకు సంఘం ఉద్యోగుల తరపున నిరంతరం కృషి చేస్తుందని స్పష్టం చేశారు.
TNGOs' Union హైదరాబాద్ సిటీ బ్రాంచ్ అధ్యక్షులు శ్రీ కటుకూరి శ్రీకాంత్ మాట్లాడుతూ, కేంద్ర కార్యవర్గ సమావేశంలో 12.5% కోటా అమలుకు తీర్మానం చేయడం హెచ్ఓడీ ఉద్యోగుల న్యాయమైన హక్కుల సాధనలో కీలక ముందడుగు అని అన్నారు. ప్రభుత్వం ఇకనైనా స్పందించి అర్హులైన ఉద్యోగులకు తక్షణమే న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

## మల్కాపూర్ శివారులో ఘోర రోడ్డు ప్రమాదం సాఫ్ట్వేర్ ఉద్యోగి మృతి





**చేవెళ్ల,ఆగస్టు17(వుదయం)**
చేవెళ్ల మండల పరిధిలోని మల్కాపూర్ గ్రామ శివారులో సోమవారం తెల్లవారుజామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్వేర్ ఉద్యోగి గుడిపూడి హరీష్(38) మృతి చెందాడు.ఈ ఘటన స్థానికంగా విషాదాన్ని నింపింది.పోలీసుల వివరాల ప్రకారం
.హైదరాబాద్లోని నార్సింగి,గండిపేట్ పరిధిలోని మై హోమ్ అవతార్లో నివసించే హరీష్,హైదరాబాద్ నుంచి చేవెళ్ల మండలంలోని రామన్నగుడికి హ్యుందాయ్ క్రెటా (TS07KH8586)కారులో ప్రయాణిస్తుండగా ప్రమాదం జరిగింది.కారును ఏలిపాటి కావ్య (35) నడుపుతుండగా.. హరీష్ ముందు ఎడమవైపు సీటులో కూర్చున్నాడు.కారు వేగంగా,అజాగ్రత్తగా, నిర్లక్ష్యంగా నడపడంతో అదుపుతప్పి రహదారి ఎడమవైపున ఉన్న చెట్టును ఢీకొన్నట్లు మృతుడి తండ్రి గుడిపూడి వెంకటేశ్వర రావు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.ప్రమాద తీవ్రతకు కారు ముందు భాగం పూర్తిగా దెబ్బతినగా.. హరీష్ తలకు తీవ్ర రక్తగాయం, రెండు కాళ్లకు తీవ్ర గాయాలు, ఛాతీ భాగంలో బలమైన గాయం కావడంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కారు నడుపుతున్న కావ్యకు కూడా తలకు తీవ్ర గాయాలైనట్లు సమాచారం.సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వారిని చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.ప్రమాదానికి అసలు కారణం, వాహనం వేగం, డ్రైవింగ్ పరిస్థితులు తదితర అంశాలపై పోలీసులు పూర్తి


**IN THE COURT OF THE HON'BLE III SENIOR CIVIL JUDGE CITY CIVIL COURT AT: SEC'BAD**
**O.S. No. 219 of 2026**
**BETWEEN :**
1. Parsha Niranjan s/o late P.S.Mallaiah, aged 75 yrs, occ: Rtd Bank employee 2.Parsha Koushik s/o Parsha Nirajan, aged 43 yrs,occ: Software employee both R/o H.No. 4-36/1/20, Indraprasta colony Tumkunta, NISA, Hakimpet Post, Hyderabad,
presently working and staying at No. 2603, Canale Tagg Cv Germantown, Tenesee TN 38138 USA Rep.by his father and G.P.A.Holder Sri Parsha Niranjan s/o late.Mallaiah, 75 yrs, Rtd bank employee
...Plaintiffs
AND
1. Parsha Dhananjaya s/o late P.Mallaiah. 70 yrs, Business House Old No.85, New No.4-2-207 Cariappa road, Bollarum, Secunderabad.
2.All concerned ...Defendants

To:
All Concerned ...2nd Defendant
Please take notice that the Plaintiffs abovenamed filed the above suit for Declaration, to declare the Plaintiffs 1&2 are the absolute owners and possessors of Schedules A and B properties in pursuance of Regd Will Deed executed by deceased P.S.Mallaiah son of late P.Shambaiah, vide Doct.No.74/Bk.III/1996 Dtd. 07.12.1996 Regd before the SRO, Bowenpaly, The said suit stands posted to 10.09.2026. If any person/s claiming to be the beneficiaries of the Said Will nor having any objection in granting the said relief, may appear before the above said court on the date mentioned above at 10.30 a.m. either in person or through your Advocate, and submit your contentions with documentary evidence, failing which, the matter will be heard decided exparte.
**A Schedule Property**
All that Portion of Property House Old No.85 New No.4-2-27, adm.100sq.yds (out of 300 Sq.yds) situated at Cariappa Road, Doveton bzr, Secunderabad Cantt. bounded on the
North by: H.No.84
South by: Portion belonging to 2nd Plaintiff in H. No. 85
East by: Main Road
West by: Part of H.No.82/A
**B- Schedule Property**
All that Portion of Property House Old No.85, Corresponding to New No.4-2-207, adm.100 Sq. Yards (out of 300 Sq.yds), situated at Cariappa Road, Doveton bzr, Secunderabad Cantonment, bounded on the:-
North : Portion belonging to 1st Plaintiff H.No.85
South : Portion belonging to1st Defendant in H.No.85
East : Main Road
West by:House No.82/A
(By Order of the Court)
Secunderabad
Dt.18-08-2026
Sd/-
**Kolla. Sanjeeva Reddy**
**Advocate**
**Plot No.35, Sundaram colony Rukmini enclave, Medchal Bollarum, Alwal, Secunderabad-500010 TG**
**Cell No.9246524030**
**Counsel for Plaintiff**




వైద్యం ఒక సేవ.. నా జీవితాశయం

"వైద్యం నిజంగా ఒక సేవ. జీవితాశయం వంటిదే. చిన్నప్పటి నుంచే నాకు కొన్ని ఆశయాలు ఉండేవి. ముఖ్యంగా డాక్టర్ అయి ప్రజలకు సేవ చేయాలనేది నా కోరిక. దీంట్లో మొదటి లక్ష్యం.. బాగా చదివి, అన్ని అడ్డంకుల్ని దాటి డాక్టర్‌గా మారడం. తర్వాతి అడుగు.. ఇంటర్న్‌షిప్. అక్కడ ఎలాంటి మొహమాటం లేకుండా ప్రశ్నలు అడుగుతూ ప్రతి విషయం నేర్చుకోవాలి. తర్వాత సాయుధ బలగాల మెడికల్ సర్వీసెస్‌లో చేరినప్పుడు మొదటి పోస్టింగ్ ఏదైనా మారుమూల ప్రాంతంలో పడుతుంది."

**-అడ్మిరల్ ఆర్తీ సరీన్, త్రివిధ దళాల వైద్య సేవల విభాగం అధిపతి**

## వే'మన' పద్యం

అల్పుఁడైన వాని కధిక భాగ్యము గల్గ
దొడ్డవారి దిట్టి తొలఁగఁ గొట్టు
అల్పబుద్ధి వాఁ డధికుల నెఱుఁగునా
విశ్వదాభిరామ! వినురవేమ!



# సంపాదకీయం

## మన ఓటు ఉంటుందా? పోతుందా...?

ప్రజాస్వామ్యంలో ఓటు ఒక హక్కు మాత్రమే కాదు. అది రాజ్యాంగం ప్రతి పౌరుడికి కల్పించిన అత్యంత విలువైన రాజకీయ అధికారం. ఆ హక్కును వినియోగించే అవకాశాన్ని కల్పించే ఓటర్ జాబితా ఎంత కచ్చితంగా ఉంటుందో ప్రజాస్వామ్యం అంతబలంగా ఉంటుంది. ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ప్రత్యేక సమగ్ర సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ఎన్నో భయాందోళనలకు గురిచేస్తోంది. బీహార్, పశ్చిమబెంగాల్ రాష్ట్రాల్లోకంటే ఇప్పుడు తెలంగాణలో పూర్తయిన సర్ మొదటి దశ ప్రక్రియ ప్రతి ఒక్కరిలో గుబులు రేపుతోంది. సర్ ప్రక్రియలో భాగంగా రాష్ట్రంలో బూత్ స్థాయి అధికారులు సేకరించిన ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ సోమవారంతో పూర్తయింది. 17న ముసాయిదా ఓటర్ల జాబితా విడుదలయింది.

ఆ తర్వాత అభ్యంతరాల స్వీకరణ ఉంటుంది. అక్టోబర్‌లో తుది ఓటర్ జాబితాను విడుదల చేస్తారు. కానీ, అంతకన్నా ముందే 'ఓటుందా.. పోయిందా?' అనే ఆందోళన ప్రతి ఓటరులో నెలకొంది. రాష్ట్రవ్యాప్తంగా 3.38 కోట్ల మంది ఓటర్లు ఉండగా, అందులో సోమవారం సాయంత్రం ఆరుగంటల వరకు 2.64 కోట్ల మంది (78.26 శాతం) పత్రాలకే డిజిటలైజేషన్ పూర్తయింది. 74 లక్షల మంది ఓటర్లు తమ పత్రాలను బీఎల్ఓలకు అందించలేదు. ఈ ఓట్లలో 73.40 (21.70 శాతం) ఓట్లు సేకరించడానికి వీలులేని (అన్ కలెక్టబుల్) జాబితాలో ఉంచారు. వారిలో కొంతమంది ఓటరు కార్డులో నమోదు చేసిన చిరునామాలో లేరు. శాశ్వతంగా వలస వెళ్లిన వారు, మృతి చెందిన వారూ ఉన్నారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని జిల్లాలోనే అత్యధికంగా కనుమరుగయ్యే ఓట్లున్నాయి. ఇంత పెద్దసంఖ్యలో అనిశ్చితి ఏర్పడినప్పుడు దీనంతటికీ బాధ్యత వహించేది కేంద్రమా? ఎన్నికల సంఘమా? అర్హులైన వారి ఓట్లు పోకుండా చూస్తామని ఎన్నికల సంఘం చెబుతున్నా గత అనుభవాలు పరిశీలించినప్పుడు అలాంటి ప్రకటనలు చెత్త కాగితాలకే పరిమితమని రుజువు చేస్తున్నాయి. తమ ప్రభావం ఎక్కువగా ఉన్నచోట్ల అక్కడ వ్యతిరేకుల ఓట్లను తొలగించడానికే మొగ్గు చూపుతున్న బీజేపీ ...తొలగించబడిన వారి ఓట్లను తిరిగి ఓటర్ల జాబితాలో ఎన్నికల సంఘం చేర్చుతుందా? అంటే అనుమానమే. ఓటర్ల జాబితాను సవరించడం కొత్త విషయం కాదు. ప్రతి ఎన్నికల ముందు, తర్వాత జాబితాల్లో మార్పులు జరుగు తుంటాయి. మరణించిన వారి పేర్లు తొలగించడం, ఒక వ్యక్తి పేరు ఒకటికంటే ఎక్కువ చోట్ల నమోదై ఉంటే సరిచేయడం, శాశ్వతంగా వలస వెళ్లిన వారి వివరాలను సవరించడం వంటి చర్యలు అవసరమే. దాన్ని ఎవరూ తప్పు పట్టడం లేదు.

ఇతర గుర్తింపు పత్రాలు ఉన్నా ఓటర్ల జాబితాలో పేరు లేకపోతే పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకోవడం సాధ్యం కాదు. ఇప్పటికే ఓటు హక్కు లేని వారికి ఎలాంటి సంక్షేమ పథకాలను ప్రభుత్వాలు వర్తింపజేయడం లేదు. రాష్ట్రంలో అంతర్గత వలసలు ఎక్కువగా ఉన్నాయి. సుమారు నలభై లక్షల ఓట్లు వలస వెళ్లినట్లు అధికారులు నమోదు చేశారు. ముసాయిదా జాబితాను విడుదల చేసిన తర్వాత ఎన్నికల సంఘం ఈ విషయంలో మరింత సమాచారాన్ని ప్రజలకు అందుబాటులో ఉంచాలి. ఎంతమంది పేర్లను ఎందుకు తొలగించాల్సి వస్తోంది? ఎంతమంది అభ్యంతరాలు స్వీకరణ తరువాత వాటిలో ఎన్ని పరిష్కరించారు? ఎంతమంది పేర్లు తిరిగి చేర్చారు? వంటి వివరాలను స్పష్టంగా తెలియచేయాలి. ఎన్నికల జాబితా కేవలం ప్రభుత్వ రికార్డు కాదు. ఎన్నికల రోజున పౌరుడు తమ ఓటు హక్కును వినియోగించుకోగలరో లేదో నిర్ణయించే ప్రాథమిక పత్రం. అందుకే దానిలో జరిగే ప్రతి మార్పుకూ సరైన కారణం, పారదర్శకత అవసరం. రాజకీయాలకు పోటు లేదన్నప్పుడు అర్హులైన వారి ఓటు పోకుండా చూడటం ఎన్నికల సంఘం కర్తవ్యం. ఒక నకిలీ పేరు ఉండడం కంటే ఒక నిజమైన ఓటర్ల పేరు తొలగిపోవడమే ప్రజాస్వామ్యానికి పెద్దప్రమాదం ఈ విషయాన్ని ఎన్నికల సంఘం గుర్తించాలి. పరిశీలనకు వీలుకాదంటూ పక్కన పెడుతున్న ప్రతి దరఖాస్తును మరోసారి క్షుణ్ణంగా చూడాలి. తిరస్కరణకు గురయ్యే ప్రతి ఓటరుకు అభ్యంతరం చెప్పే అవకాశం కల్పించాలి. ప్రతి అర్హుడి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా చూడాలి. ఓటు హక్కును కాపాడటం అంటే ప్రజాస్వామ్యాన్ని కాపాడమే. అదే ఎన్నికల సంఘం ముందున్న అత్యంత ముఖ్యమైన రాజ్యాంగ బాధ్యత.

**రచనలు పంపండి**

వుదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలను విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర అంశాలపై వ్యాసాలు, సంపాదక లేఖలు పంపించాలని కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.

voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020

# మన స్వేచ్ఛను పూర్తిగా కోల్పోయాం

ఏడేళ్ల క్రితం, 2019 ఆగస్టు 5న, మన రిపబ్లిక్ తన శరీరాంగాల్లో ఒకదానిని చడీచప్పుడు లేకుండా కత్తిరించి తొలగించింది. జమ్ము కాశ్మీర్ రాష్ట్రపతి పాలనలో ఉండి, దాని నాయకులు గృహ నిర్బంధంలో ఉన్నప్పుడు, ఫోన్ లైన్లు పని చేయనప్పుడు, సంప్రదించడానికి ఎటువంటి శాసనసభ లేని సమయంలో ఆర్టికల్ 370, ఆర్టికల్ 35 ఎ రద్దు చేయబడ్డాయి. స్వయంగా సంతకం చేసిన విలీన పత్రం ద్వారా భారతదేశంలో చేరిన ఒక పూర్తి స్థాయి రాష్ట్రాన్ని ముక్కలు చేసి, ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ ద్వారా రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా విభజించారు. ఆర్టికల్ 370ని చట్టవిరుద్ధంగా రద్దు చేయడానికి ముందు ఆ రాష్ట్రం దేశంలో భాగమే కానట్లుగా, రాష్ట్ర అక్రమ విభజనను 'సమైక్యత'గా అభివర్ణిస్తూ అధికార పార్టీ గొప్పగా ప్రచారం చేసుకున్నది. ఈ చర్యలన్నీ సంస్కరణల భాషతో కప్పబడి, ఎవరి అనుమతీ లేకుండా ఒక ఆర్డినెన్స్ ద్వారా అమలు చేశారు. తర్వాతి సంవత్సరాల్లో, ఆ ప్రాంతం వీధి సైనిక బలగాల నీడలో గడిపింది. 'సెక్యూరిటీ క్లియరెన్స్' పేరిట చెల్లుబాటు కాని ఒక సాకుతో ఆ రాష్ట్ర యువతీ యువకులకు ఉద్యోగాలు నిరాకరించారు. ఉపా, పిఎస్ఎ వంటి అత్యంత నిర్బంధ చట్టాల కింద విలేకరులను జైలులో పెట్టారు. ఢిల్లీ ప్రభుత్వం కాశ్మీర్ లో 'సాధారణ పరిస్థితి' నెలకొన్నదని సంబరాలు చేసుకుంటుంటే, అక్కడి యాపిల్ రైతులు, దినసరి కూలీలు బతుకుదెరువు కోసం అష్టకష్టాలూ పడ్డారు. 2019లోనే ఈ పరిస్థితి మొదలయిందని సిపిఎం భావించడం లేదు. ప్రపంచంలోనే ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన తొలి కమ్యూనిస్ట్ ప్రభుత్వమైన కేరళలోని మా ప్రభుత్వాన్ని... 1959లో కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టికల్ 356ను బాహాటంగా దుర్వినియోగం చెయ్యడం ద్వారా... రద్దు చేసింది. ఆ గాయాన్ని మేము ఆరు దశాబ్దాలకు పైగా గుర్తుచేస్తూనే ఉన్నాము. అయితే కాంగ్రెస్ ఒక ముతక ఆయుధాన్ని ఉపయోగించగా, ప్రస్తుత బిజెపి ప్రభుత్వం ప్రతి ఎన్నికల లేదా న్యాయపరమైన తీర్పునకు వ్యతిరేకంగా ఒక ఆధునిక సర్జికల్ కత్తి లాంటి ఆర్డినెన్స్‌నో, బిజెపి యేతర పాలనలో ఉన్న ప్రతి రాష్ట్రంలోనూ తమకు అనుకూలమైన గవర్నర్, లెఫ్టినెంట్ గవర్నర్లనో అడ్డం పెట్టుకున్నది. కాశ్మీర్ లో 2024లో జరిగిన ఎన్నికలను కేంద్ర ప్రభుత్వ ఉదారతగా ఎవరూ భావించనవసరం లేదు. కేంద్ర ప్రభుత్వం జమ్ము కాశ్మీర్ రాష్ట్ర హోదాపై, ఎన్నికల నిర్వహణపై ఐదేళ్లపాటు కాలయాపన చేసింది. ఇక ఆలస్యం చేయడానికి వీలు లేకుండా సుప్రీంకోర్టు గడువు విధించేసరికి గత్యంతరం లేక ఎన్నికలు నిర్వహించింది. ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేయడానికి డబ్బు, నకిలీ ఓటర్లు, మత, ప్రాంతీయ ప్రాతిపదికన విభజించే ప్రయత్నాలతో సహా అన్ని అనైతిక చర్యలకూ పాల్పడ్డారు. కానీ బిజెపి రూపుకట్టదలిచిన కాశ్మీర్‌కు, ఆగస్టు 5 నాటి అనాలోచిత చర్యలకు వ్యతిరేకంగా, చర్చలకు బదులు తమపై ఆధిపత్యం చెలాయించడానికి వ్యతిరేకంగా ప్రజలు స్పష్టమైన తీర్పు ఇచ్చారు. అయితే, స్పష్టమైన ప్రజా తీర్పు వున్నప్పటికీ, ఆ రాష్ట్ర ముఖ్యమంత్రికి లెఫ్టినెంట్ గవర్నర్ అనుమతి లేకుండా తన సొంత అధికారులను బదిలీ చేసే ప్రాథమిక అధికారాలు కూడా లేవు. ఆయన అధ్యక్షత వహించాల్సిన కమిటీలకు కూడా హాజరయ్యే అవకాశం కల్పించడం లేదు. అదే సమయంలో, ఢిల్లీకి మాత్రమే జవాబుదారీగా ఉండే ఒక ఎన్నిక కాని అధికారి (లెఫ్టినెంట్ గవర్నర్)... ముఖ్యమంత్రికి బదులుగా పోస్టింగులు, పోలీసు వ్యవస్థ, భూ కేటాయింపులు వంటి కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఒమర్ అబ్దుల్లా ఏ అధికారాలు లేని అలంకారప్రాయమైన ముఖ్యమంత్రిగా కొనసాగుతున్నారు. ఆ రాష్ట్రంలో ఏం జరుగుతున్నదో మనం అర్థం చేసుకోవడానికి ప్రయత్నించడం ముఖ్యం, ఎందుకంటే ఇది కేవలం పిర్ పంజాల్ ప్రాంతానికే పరిమితం కాదు. ప్రజా తీర్పును వమ్ము చేసే మార్గాలు ఏమిటో తెలుసుకునేందుకు జమ్ము కాశ్మీర్ ఒక నమూనాగా ఉపయోగపడుతుంది. పార్లమెంటులో ఓటింగ్ ఎదుర్కొనే ప్రమాదం లేకుండా, రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎలా బలహీనపరచవచ్చో చూపించే సాధనాలు వారి దగ్గరున్నాయి. మొదటి




రెండు సాధనాలు సరిపోనప్పుడు ఆర్డినెన్స్‌లు, గవర్నర్లు, కేంద్ర ఏజెన్సీలను రంగంలోకి దించడం ఇందులో భాగం. ఢిల్లీలో కూడా 2015, 2023లో రెండుసార్లు జరిగింది ఇదే. ఢిల్లీలో ఎన్నికైన ప్రభుత్వానికి అధికారులను ఎంపిక చేసుకునే హక్కు ఉండాలని సుప్రీంకోర్టును ఆశ్రయించి అందుకనుగుణంగా తీర్పు తెచ్చుకుంటే, దానిని పూర్వపక్షం చేసేలా కొన్ని రోజుల్లోనే మోడీ ప్రభుత్వం ఆర్డినెన్సులు తీసుకు వచ్చింది. న్యాయవ్యవస్థ కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఏ తీర్పు ఇచ్చినా, ఎన్నికలలో ప్రజలు బిజెపి ని తిరస్కరించినా ఆ తీర్పులను తిప్పికొట్టేందుకు తగిన చట్టాలు చేయడంలో బిజెపి ప్రభుత్వం నైపుణ్యం సాధించింది. దీనిని నిరసించే హక్కును కూడా నియంత్రించడం మరింత ఆందోళనకరమైన విషయం. ఒకవైపు ఈ ప్రభుత్వం జమ్ము కాశ్మీర్ ప్రజలకు అన్ని విధాలా మద్దతు ఇస్తున్నామని పేర్కొంటుంది.

మరొకవైపు అదే ప్రజలు ఎన్నుకున్న ప్రజా ప్రతినిధులు రాష్ట్ర హోదా కావాలన్న రాజ్యాంగబద్ధమైన డిమాండ్ కోసం జంతర్ మంతర్ దగ్గర శాంతియుతంగా ధర్నా చేయడానికి అనుమతి అడిగితే ఇవ్వదు. బిజెపి ప్రభుత్వానికి తాను సాధించిన రికార్డుపై నమ్మకం ఉంటే, ప్లకార్డులను కూడా అణచివేయాల్సిన అవసరం ఏమొచ్చింది? కాశ్మీర్ ను కేంద్రపాలిత ప్రాంతంగా ప్రకటించిన రోజు నుండి సిపిఎం ఈ అంశంపై దృఢమైన వ్యతిరేకత ప్రదర్శిస్తూనే వచ్చింది. మా పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి, కామ్రేడ్ సీతారాం ఏచూరి జమ్ము కాశ్మీర్ లో విధించిన దిగ్బంధనాన్ని ధిక్కరించడానికి ప్రయత్నించిన తొలి ప్రతిపక్ష నాయకుడు. మా కేంద్ర కమిటీ సభ్యుడు, కామ్రేడ్ యూసుఫ్ తరిగామి కాశ్మీర్ ప్రజల బలమైన గొంతుకలలో ఒకరిగా నిలిచి వారి పోరాటాలలో తోడుగా ఉన్నారు. 2022, 2025 లలో కన్నూర్, మధురైలలో జరిగిన మా 23వ, 24వ పార్టీ అఖిల భారత మహాసభలు, జమ్ము కాశ్మీర్ కు తక్షణమే రాష్ట్ర హోదాను పునరుద్ధరించాలని, ప్రజల రాజ్యాంగ హక్కులన్నింటినీ పునరుద్ధరించాలని, శాశ్వత నివాసితుల నుండి తొలగించబడిన భూమి, ఉద్యోగ రక్షణలను తిరిగి కల్పించాలని, రాజకీయ ఖైదీలు, విలేకరులను విడుదల చేయాలని, తప్పుడు ఆరోపణలతో కాశ్మీరీ యువతపై జరుగుతున్న వేధింపులకు స్వస్తి పలకాలని డిమాండ్ చేశాయి.

మేము ఈ రాజకీయ సంకల్పాన్ని నికరంగా ముందుకు తీసుకెళ్లాము. రాష్ట్ర ప్రశాంతతకు భంగం కలిగిన ప్రతిసారీ, ప్రతి కొత్త అరెస్టు తర్వాత, బిజెపి ని ఓడించి ఎన్నికల్లో గెలిచిన నేరానికి గానూ అక్కడి ప్రజా ప్రభుత్వానికి ఎదురవుతున్న ప్రతి అవమానం సందర్భంగా మేము ఈ అంశాన్ని లేవనెత్తుతూనే ఉన్నాము. ఇక్కడ ప్రమాదంలో పడింది ఏదో ఒక కేంద్రపాలిత ప్రాంత హోదా మాత్రమే కాదు. ఒక ఎన్నికైన ప్రభుత్వాన్ని ప్రణాళికాబద్ధంగా ఒక ఆర్డినెన్సు ద్వారా బలహీనపరిచిన ప్రతిసారీ, రాష్ట్రాలకు, కేంద్రానికి మధ్య దూరం మరింత పెరుగుతున్నది. ఆ నమ్మకాన్ని మళ్లీ సులభంగా పునరుద్ధరించలేము. ఈ దేశం రాష్ట్రాల సమాఖ్యగా రూపొందింది. ఢిల్లీ వాటిపై ఆధిపత్యం చెలాయించడం కాదు. వాటితో కలిసి పరిపాలిస్తుందనే నమ్మకంతో నిర్మితమైంది. జమ్ము కాశ్మీర్‌కు పూర్తి రాష్ట్ర హోదాను పునరుద్ధరించాలన్న మా డిమాండును మరోసారి పునరుద్ఘాటిస్తున్నాం. ఓటు వేసిన ప్రజలకు అధికారాన్ని తిరిగి ఇవ్వడంలో కేంద్ర ప్రభుత్వం ఇంకెంతమాత్రం ఆలస్యం చేయకూడదు. రాజ్యాంగబద్ధమైన హక్కును ఏదో దయతో ఇస్తున్నామన్న వైఖరిని కేంద్ర ప్రభుత్వం వీడాలి. ఎనిమిది దశాబ్దాల తర్వాత కూడా ఈ కనీసమైన అవగాహనను గుర్తుచేసుకోవాల్సి రావడమంటే ఇప్పటికే మనం ప్రజాస్వామ్యాన్ని ఎంతగా కోల్పోయామో గుర్తించి సిగ్గుపడాలి.




## నైపుణ్యం.. ఉద్యోగం.. యువతరం..

భారత ఆర్థిక వ్యవస్థ వేగంగా విస్తరిస్తున్న సమయంలో, ఆ వృద్ధి ఫలాలు ఉద్యోగాల రూపంలో ఎంత విస్తృతంగా ప్రజలకు చేరుతున్నాయన్నది కీలకంగా మారింది. తాజా పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే ప్రకారం 2026 ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో 15 సంవత్సరాలు, అంతకంటే పైబడిన వారిలో దేశవ్యాప్త నిరుద్యోగ రేటు 5.4 శాతంగా నమోదైంది. జనవరి-మార్చి త్రైమాసికంలోని 5.0 శాతంతో పోలిస్తే ఇది 0.4 శాతం పాయింట్ల పెరుగుదల. అయితే ఈ ఒక్క సంఖ్యతో భారత ఉద్యోగ మార్కెట్ పరిస్థితిని అంచనా వేయడం సరైంది కాదు. ప్రాంతాల వారీగా చూస్తే గ్రామీణ నిరుద్యోగం 4.8 శాతం, పట్టణ నిరుద్యోగం 6.7 శాతంగా ఉంది. గ్రామీణ రేటు కూడా గత త్రైమాసికంలోని 4.3 శాతం నుంచి పెరిగింది. పట్టణ ప్రాంతాల్లో విద్యార్హతలకు అనుగుణమైన ఉద్యోగాల కోసం పెరుగుతున్న పోటీ, అవకాశాల కేంద్రీకరణ, నైపుణ్యాల సరిపోలిక వంటి అంశాలు ఈ వ్యత్యాసాన్ని ప్రభావితం చేయవచ్చు. అయితే అత్యంత ముఖ్యమైన అంశం యువ నిరుద్యోగం. 15-29 సంవత్సరాల యువతలో నిరుద్యోగం 15.9 శాతంగా ఉంది. గ్రామీణ యువతలో 14.7 శాతం, పట్టణ యువతలో 18.2 శాతంగా నమోదైంది. విద్య నుంచి ఉద్యోగానికి మారే దశలో యువతకు పరిశ్రమ అవసరాలకు అనుగుణమైన నైపుణ్యాలు, ప్రాక్టికల్ అనుభవం, అప్రెంటిస్‌షిప్‌లు, ఇంటర్న్‌షిప్‌లు, కెరీర్ మార్గదర్శకత్వం మరింత అవసరమని ఈ గణాంకాలు సూచిస్తున్నాయి. ఇక్కడ ఉద్యోగాల సంఖ్యతో పాటు ఉద్యోగ నాణ్యత కూడా ముఖ్యమే. స్థిరమైన ఆదాయం, సామాజిక భద్రత, నైపుణ్యాభివృద్ధికి అవకాశం, కెరీర్ పురోగతి కలిగిన ఉద్యోగాలు ఆర్థిక వ్యవస్థకు ఎక్కువ విలువను అందిస్తాయి. అందువల్ల భవిష్యత్ ఉపాధి వ్యూహం "ఎన్ని ఉద్యోగాలు?"తో పాటు "ఎలాంటి ఉద్యోగాలు?" అనే ప్రశ్నకు కూడా సమాధానం ఇవ్వాలి. మహిళల ఉపాధి భాగస్వామ్యం మరో కీలక అంశం. పట్టణ మహిళల నిరుద్యోగ రేటు 8.7 శాతం, పట్టణ పురుషుల రేటు 6.1 శాతంగా ఉంది. రవాణా, భద్రత, శిశు సంరక్షణ, అనువైన పనివేళలు, నైపుణ్య శిక్షణ వంటి అంశాలు మహిళల ఉద్యోగ భాగస్వామ్యాన్ని ప్రభావితం చేస్తాయి. మహిళలకు ఎక్కువ అవకాశాలు కల్పించడం సామాజిక పురోగతితో పాటు దేశ ఉత్పాదక సామర్థ్యాన్ని పెంచే ఆర్థిక అవకాశంగా చూడాలి. మరో ముఖ్యమైన సూచిక లేబర్ ఫోర్స్ పార్టిసిపేషన్ రేట్ (ఎల్ పి ఎఫ్ ఆర్). ఏప్రిల్-జూన్ 2026లో మొత్తం ఎల్ పి ఎఫ్ ఆర్ 54.6 శాతంగా ఉంది. గత త్రైమాసికంలోని 55.5 శాతంతో పోలిస్తే ఇది తగ్గింది. ఉద్యోగం కోసం ప్రయత్నించడం మానేసిన వ్యక్తి నిరుద్యోగిగా కాకుండా శ్రామిక శక్తి వెలుపల ఉన్న వ్యక్తిగా లెక్కించబడవచ్చు. అందుకే నిరుద్యోగ రేటుతో పాటు ఎల్ పి ఎఫ్ ఆర్, వర్కర్ జనాభా నిష్పత్తి, వేతనాలు, పని గంటలు, ఉద్యోగ స్థిరత్వం వంటి సూచికలను కూడా పరిశీలించాలి. జూన్ 2026 నెలవారీ పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే గణాంకాల్లో నిరుద్యోగ రేటు 5.5 శాతంగా నమోదైంది. దీనిని ఏప్రిల్-జూన్ త్రైమాసికపు 5.4 శాతంతో నేరుగా పోల్చకూడదు. ఒకటి నెలవారీ గణాంకం కాగా, మరొకటి మూడు నెలల కాలానికి సంబంధించినది. సీజనల్ మార్పులు కూడా నెలవారీ ఉద్యోగ గణాంకాలను ప్రభావితం చేయవచ్చు. భారత్‌కు గ్రామీణ ఉపాధి విస్తరణ కూడా అవసరం. ఆహార ప్రాసెసింగ్, గిడ్డంగులు, కోల్డ్ చైన్, లాజిస్టిక్స్, గ్రామీణ పర్యాటకం, చిన్న పరిశ్రమలు, డిజిటల్ సేవలు వంటి వ్యవసాయేతర రంగాలను విస్తరించడం ద్వారా



స్థానిక ఉపాధి అవకాశాలను పెంచవచ్చు. అదే సమయంలో టైర్2, టైర్3 నగరాలను కొత్త ఆర్థిక కేంద్రాలుగా అభివృద్ధి చేయడం ద్వారా మెట్రో నగరాలపై ఉద్యోగ ఒత్తిడిని తగ్గించవచ్చు. తయారీ రంగం కూడా ఉద్యోగ సృష్టికి ప్రధాన ఆధారం. ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్లు, ఔషధాలు, ఆటోమొబైల్స్, యంత్ర సామగ్రి, పునరుత్పాదక ఇంధన పరికరాలు, ఆహార ప్రాసెసింగ్ వంటి రంగాల్లో పెట్టుబడులు పెరిగితే ప్రత్యక్ష ఉద్యోగాలతో పాటు సరఫరా గొలుసులో పరోక్ష ఉపాధి కూడా పెరుగుతుంది. సేవారంగంలో ఆఈ, డిజిటల్ సేవలు, ఫిన్‌టెక్, ఆరోగ్య సేవలు, పరిశోధన, సైబర్ సెక్యూరిటీ వంటి రంగాలు అధిక విలువ కలిగిన కొత్త అవకాశాలను సృష్టించగలవు. ఈ అవకాశాలను వినియోగించుకోవాలంటే విద్య-నైపుణ్యం-పరిశ్రమ మధ్య అనుసంధానం బలపడాలి. డిగ్రీల సంఖ్య కంటే పరిశ్రమకు అవసరమైన నైపుణ్యాలు ముఖ్యం. అప్రెంటిస్‌షిప్‌లు, పరిశ్రమ భాగస్వామ్యంతో శిక్షణ, ఇంటర్న్‌షిప్‌లు, డిజిటల్ సామర్థ్యాలు యువతను ఉద్యోగ మార్కెట్‌కు మరింత సిద్ధం చేయగలవు. భారత్ 20 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలనే దీర్ఘకాలిక లక్ష్యాన్ని పరిశీలించినా ఉద్యోగాల సృష్టి కీలకం. ఆర్థిక వృద్ధి ప్రజల ఆదాయాలు, వినియోగం, జీవన ప్రమాణాలను మెరుగుపరచాలంటే అది ఉద్యోగాలను సృష్టించే, ఉత్పాదకతను పెంచే, విస్తృతంగా పంచబడే వృద్ధిగా ఉండాలి. యువ జనాభా భారతదేశానికి గొప్ప ఆర్థిక వనరు; వారికి సరైన నైపుణ్యాలు, అవకాశాలు లభిస్తే అదే జనాభా దేశ అభివృద్ధికి ప్రధాన శక్తిగా మారుతుంది. కాబట్టి 5.4 శాతం నిరుద్యోగ రేటును కేవలం ఆందోళనగా కాకుండా ఉపాధి వ్యవస్థను మరింత సమర్థంగా తీర్చిదిద్దేందుకు ఒక సూచికగా చూడాలి. యువతకు మొదటి ఉద్యోగం, మహిళలకు విస్తృత అవకాశాలు, గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయేతర ఉపాధి, పట్టణాల్లో నాణ్యమైన ఉద్యోగాలు, పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు—ఇవన్నీ సమన్వయంగా ముందుకు సాగాలి. చివరికి భారతదేశం ఎదుర్కొంటున్న అసలు ప్రశ్న కేవలం నిరుద్యోగ రేటును తగ్గించడం కాదు. ప్రతి యువ ప్రతిభకు సరైన అవకాశం, ప్రతి నైపుణ్యానికి తగిన పని, ప్రతి ప్రాంతానికి తగిన ఉపాధి అవకాశాలు కల్పించడం అసలు లక్ష్యం కావాలి. ఆర్థిక వృద్ధి, ఉత్పాదకత, నైపుణ్యాభివృద్ధి, ఉద్యోగ సృష్టి కలిసి ముందుకు సాగినప్పుడే భారత జనాభా శక్తి నిజమైన ఆర్థిక బలంగా మారుతుంది.



హెచ్.ప్రతాప్
77998 00773

## సహజీవనం అంటే నిజమైన ప్రేమ.. స్నేహమే...

ప్రతిసంవత్సరం ఆగస్టు 18న ప్రపంచ వ్యాప్తంగా జాతీయ జంటల దినోత్సవం (National Couples Day)ను జరుపు కుంటారు. ఇది




ప్రభుత్వ అధికారిక పండుగ కాకపోయినా, అనుబంధం, ప్రేమ, పరస్పర సహకారం అనే విలువలకు అంకితమైన రోజు. ఈ రోజు ప్రత్యేకత ఏమిటంటే, జీవిత భాగస్వాములు, ప్రేమికులు, నిశ్చితార్థితులు లేదా డేటింగ్‌లో ఉన్న జంటలు ఒకరినొకరు గుర్తు చేసుకుని కృతజ్ఞతలు తెలుపు కోవడం, బిజీగా మారిపోయిన రోజువారీ జీవితం లోనూ కొంత సమయం కేటాయించుకొని తమ బంధాన్ని బలపరచు కోవడం. ఆధునిక జీవన శైలిలో సంబంధాలు యంత్రప్రాయంగా మారిపోతున్న తరుణంలో, ఈ రోజు ఒకరికి ఒకరు సమయాన్ని, శ్రద్ధను అంకితం చేయాలని గుర్తుచేసే ఒక మధురమైన అవకాశమై నిలుస్తోంది. జాతీయ జంటల దినోత్సవం అనేది చరిత్ర పరంగా కొత్తగానే వెలుగులోకి వచ్చింది. 2010లలో అమెరికాలోని కొన్ని సంస్థలు తమ ఉత్పత్తులను ప్రచారం చేయడం కోసం ఈ రోజును ప్రవేశపెట్టినట్లు సమాచారం ఉంది. కానీ వాణిజ్య ఉద్దేశ్యంతో మొదలైన ఈ ఆచారం, క్రమంగా ప్రేమను, బంధాన్ని, సహజీవనాన్ని గౌరవించే ప్రత్యేకమైన పండుగగా మారి పోయింది. ముఖ్యంగా సోషల్ మీడియా యుగంలో ఇది ఒక ప్రజా వేడుకగా స్థిరపడింది. నేడు అమెరికా సహా యూరప్, ఆసియా, భారతదేశం వంటి అనేక దేశాల్లో జంటలు ఈ రోజును ఉత్సాహంగా జరుపు కుంటున్నారు.

ఒక ఆన్‌లైన్ సర్వే ప్రకారం, అమెరికాలో వివాహితులలో దాదాపు 62 శాతం మంది ఆగస్టు 18న తమ జీవిత భాగస్వామితో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారని, డేటింగ్‌లో ఉన్న యువ జంటలలో 70 శాతం మంది చిన్న చిన్న బహుమతులు ఇచ్చి పుచ్చుకుంటారని తేలింది. సోషల్ మీడియాలో హ్యాష్‌ట్యాగ్ కింద లక్షలాది పోస్టులు ఆ రోజున వెలువడు తుంటాయి. ఈ గణాంకాలు ఈ రోజు ప్రాచుర్యం ఎలా విస్తరించిందో స్పష్టంగా తెలియ జేస్తాయి. ప్రతీ సంబంధం పరస్పర విశ్వాసం, గౌరవం, సహనం అనే మూలాలపై ఆధారపడి ఉంటుంది. అయితే ఆధునిక జీవన విధానం, వృత్తి ఒత్తిళ్లు, నగరీకరణ వేగం వల్ల జంటలు ఒకరితో ఒకరు నాణ్యమైన సమయం గడపలేక పోతున్నారు. ఫలితంగా సంబంధాలలో దూరం పెరగడం, అపార్థాలు రావడం వంటి సమస్యలు తలెత్తుతున్నాయి. ఇలాంటి సందర్భాల్లో జంటల దినోత్సవం ఒక ప్రత్యేకమైన విరామాన్ని కలిగిస్తూ, ప్రేమను మళ్లీ పునరుద్ధరించుకునే క్షణాన్ని అందిస్తుంది. ఒక ప్రత్యేక భోజనం, కలిసి సినిమా చూడడం, ఒక లేఖ రాయడం, చిన్న బహుమతి ఇవ్వడం వంటి సాధారణ చర్యలే సంబంధాలను గాఢ తరం చేస్తాయి. సోషల్ మీడియా వేదికలపై జంటలు తమ ఫోటోలు, జ్ఞాపకాలు, ప్రేమ సందేశాలను పంచుకోవడం ద్వారా ఈ రోజుకు ఒక ఆధునిక రూపు వచ్చింది. మానసిక, సామాజిక కోణాల్లో ఈ దినోత్సవం ప్రాముఖ్యత ఎంతో విశేషం. పరిశోధనలు చెబుతున్నట్లు సుస్థిరమైన ప్రేమ బంధంలో ఉన్న వారు ఒత్తిడి తక్కువగా అనుభవిస్తారు, ఆరోగ్య పరంగా మెరుగ్గా ఉంటారు. అమెరికాలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ నిర్వహించిన ఒక అధ్యయనం ప్రకారం, ప్రేమతో నిండిన స్థిరమైన బంధాలలో ఉన్న వ్యక్తులలో గుండె సంబంధ వ్యాధులు తక్కువగా వస్తాయని తేలింది. అలాగే సంతోషకరమైన దాంపత్యం పిల్లలపై కూడా సానుకూల ప్రభావం చూపుతుంది. కుటుంబాలు సమాజానికి పునాది అని పరిగణిస్తే, జంటల మధ్య బంధం బలపడడం సమాజంలో స్థిరత్వం, ఐక్యత, మానవతా విలువలకు దోహదం చేస్తుంది. జాతీయ జంటల దినోత్సవం వివాహితులకు మాత్రమే పరిమితం కాదు. ప్రేమలో ఉన్నవారు, నిశ్చితార్థితులు, డేటింగ్‌లో ఉన్నవారు, ఒకరిని మరొకరు ఆప్యాయంగా భావించే ఏ ఇద్దరు వ్యక్తులైనా ఈ రోజును జరుపుకోవచ్చు. ఇది ఒక పండుగ మాత్రమే కాదు, ఒకరికి ఒకరు విలువనిచ్చే, గౌరవించే క్షణం. చిన్న చిన్న చర్యలు—ఒక పూల బొకే, ఒక ఆప్యాయమైన ఆలింగనం, ఒక మధురమైన జ్ఞాపకం—ఇవన్నీ బంధాన్ని మరింత అద్భుతంగా మార్చగలవు. ఆగస్టు 18, జాతీయ జంటల దినోత్సవం, ప్రేమను గౌరవించుకునే రోజు, అనుబంధాన్ని బలపరచుకునే రోజు, జీవితాన్ని మరింత సార్థకంగా మార్చుకునే రోజు. ఒకరికొకరు అంకిత భావంతో ఉన్న జంటలు, తమ బంధాన్ని మరింత దృఢపరచు కోవాలని గుర్తుచేసే ఈ వేడుక, ఆధునిక సమాజంలో ప్రేమకు ప్రతీకగా నిలిచిపోయింది.



రామ కిష్టయ్య సంగన భట్ల
సీనియర్ జర్నలిస్ట్

## అత్తగారి కోర్టులో..!

అత్తగారి న్యాయస్థానంలో..
తీర్పులు బహు విచిత్రం
తన కొడుగు కోప్పడితే..
వాడికి కోపం గుర్చి పట్టించుకోకు..
వాడు పనితనంలో దిట్ట అంటుంది
ముద్దుల కూతురు కోప్పడితే..
దానికి ముక్కు మీదే కోపం..
మనసు మాత్రం వెన్నపూస అంటుంది
కోడలుకు కోపం వస్తే..
దీనికి కుటుంబ మర్యాదలు తెలియవు..
పొగరుబోతులా ఉందే..
తల్లిగారింట్లో పెంపకం అలా ఉంది
ఇదే కదా అత్తగారి కోర్టులో..
న్యాయ అన్యాయాల విచిత్ర తీర్పులు!
కొడుకు ఆలస్యంగా నిద్ర లేచినా..
వాడు కష్టపడి అలసిపోయాడు
నిద్ర పొమ్మని గారాబం చేస్తుంది
కూతురు పొద్దెక్కే దాకా నిద్రపోతే..
ఇంకెన్నాళ్లు హాయిగా నిద్రపోతుంది
పెళ్లి వరకే కదా సుఖపడనివ్వు అంటుంది
కోడలు వేకువనే లేవకపోతే..
సోమరిపోతులా ఉందే అంటూ..
పనితనం లేని కోడలు అని కేకలేస్తూ..
అరుస్తూ బలవంతంగా నిద్రలేపి..
చేతికి చీపురు ఇస్తుంది జడ్జ్ అత్తయ్య!



మధుసూదన్ రెడ్డి
9949700037



# జాతీయం-అంతర్జాతీయం



## మహిళలకేది రక్షణ.. భద్రత...?

**న్యూఢిల్లీ, ఆగస్టు 17 (ఎ.ఎం.ఎస్) :**
దేశంలో మహిళల భద్రత ఇప్పటికీ ఒక ప్రధాన సమస్యగానే ఉంది. 'భారత్ మాతా కీ జై', 'నారీ శక్తి' అంటూ నినాదాలతో ప్రచారాలు చేసుకుంటున్న కేంద్రంలోని మోడీ ప్రభుత్వం.. వారి భద్రతకు మాత్రం భరోసా ఇవ్వలేకపోతోంది. భద్రతాలేమితో మహిళలు ఉద్యోగాలకు దూరం కావడం, ఉత్పాదకత తగ్గడం, ఆరోగ్య వ్యయాలు పెరగడం, పిల్లల భవిష్యత్తుపై ప్రభావం పడటం ద్వారా ఏటా లక్షల కోట్ల రూపాయల ఆర్థిక నష్టం దేశానికి జరుగుతోంది. ఈ సమస్యను అభివృద్ధి చర్చల్లో పెట్టాల్సిన అవసరం ఉన్నప్పటికీ... మోడీ ప్రభుత్వ విధానాల్లో దీనికి తగిన ప్రాధాన్యం దక్కుతోందా అనే ప్రశ్న మాత్రం ఇంకా మిగిలే ఉంది.

భారత్ 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా మారాలని ప్రధాని మోడీ ప్రభుత్వం లక్ష్యంగా చెబుతున్నప్పటికీ.. దేశంలో మహిళలపై కొనసాగుతున్న హింస దేశ ఆర్థిక వ్యవస్థకు భారీ మూల్యాన్ని మిగుల్చుతోంది. మహిళలపై హింస, ముఖ్యంగా కుటుంబంలో జరిగే హింస, వారి ఉద్యోగ అవకాశాలను, ఆదా యాన్ని, ఆరోగ్యాన్ని, ఆర్థిక స్వాతంత్ర్యాన్ని దెబ్బ తీస్తోంది. జాతీయ మీడియాలో వచ్చిన విశ్లేషణ ప్రకారం. మహిళలపై హింస కారణంగా మహిళ ల కార్మిక భాగస్వామ్యం తగ్గితే రూ.2.3 లక్షల కోట్ల నుంచి రూ.4.6 లక్షల కోట్ల వరకు ఉత్పత్తి నష్టం సంభవించే అవకాశం ఉంది. ఇది భారత జీడీపీలో సుమారు 0.8 శాతం నుంచి 1.6 శాతం వరకు ఉంటుంది. ఆరోగ్య వ్యయాలు, ఉద్యోగం లో ఉన్న మహిళల ఉత్పాదకత తగ్గడం, తరతరాల పై పడే ప్రభావం వంటి అంశాలను కూడా కలిపితే ఈ నష్టం మరింత పెరిగే అవకాశం ఉంది.

జాతీయ నేర గణాంకాల బ్యూరో (ఎన్సీఆర్బీ) 2024 నివేదికలో మహిళలపై నేరాలకు సంబంధించి 4,41,534 కేసులు నమోదయ్యా యి. అంటే సగటున ప్రతి 71 సెకన్లకు ఒక కేసు నమోదైనట్టుగా ప్రభుత్వ రికార్డులు చూపిస్తున్నా యి. 2014తో పోలిస్తే నమోదైన కేసులు 30 శాతానికి పైగా పెరిగాయి. భర్త, ఆయన బంధువుల చేతిలో మహిళలపై జరిగే క్రూరత్వం నమోదైన నేరాల్లో అతిపెద్దదిగా ఉంది. పోలీస్ స్టేషన్లలో నమోదయ్యే ఎఫ్ఐఆర్‌లు మాత్రమే మహిళలు ఎదుర్కొంటున్న వాస్తవ హింస మొత్తా న్ని ప్రతిబింబించవు. మహిళలపై జరుగుతున్న అనేక నేరాలకు సంబంధించిన ఘటనలు ఫిర్యాదు దశకు కూడా రావడం లేదు. నమోదైన కేసుల సంఖ్యను మాత్రమే ఆధారంగా చేసుకుని సమస్య తీవ్రతను అంచనా వేయడం వాస్తవ పరిస్థితిని తక్కువగా చూపే ప్రమాదం ఉందని విశ్లేషకులు చెప్తున్నారు. ఇంట్లో హింస (గృహ హింస) ఎదుర్కొనే మహిళలకు ఉద్యోగం చేయడం, ఉద్యోగంలో కొనసాగడం, ఆర్థిక నిర్ణయాల్లో భాగస్వామ్యం కావడం మరింత కష్టమవుతుంది. దేశవ్యాప్తంగా 29 రాష్ట్రాలపై చేసిన విశ్లేషణలో పట్టణ ప్రాంతాల్లో భర్త లేదా భాగస్వామి నుంచి హింసను ఎదుర్కొంటున్న మహిళల శాతం ఎక్కువగా ఉన్న రాష్ట్రాల్లో మహిళలు ఉద్యోగాలు చేయడం లేదా పనిలో పాల్గొనడం తక్కువగా ఉంది. ఉదాహరణకు.. బీహార్‌లో పట్టణ ప్రాంతాల్లో వివాహిత మహిళల్లో భాగస్వామి హింసను ఎదుర్కొంటున్న వారి శాతం ఎక్కువగా ఉంది. ఇక్కడ మహిళల కార్మిక భాగస్వామ్యం కేవలం 15.3 శాతంగా ఉంది.




- **దేశంలో కోట్లాది మంది ఉద్యోగాలకు దూరం**
- **కాగితాలపై పెరిగిన ఉపాధి**
- **గృహ హింస.. ఉద్యోగానికి దూరం**
- **పిల్లల భవిష్యత్తుపైనా ప్రభావం**
- **నినాదాలకే పరిమితమైన కేంద్రం విధానాలు**

భారత్‌లో మహిళల కార్మిక భాగస్వామ్యం ఇటీవలి సంవత్సరాల్లో పెరిగినట్టు అధికారిక గణాంకాలు సూచిస్తున్నాయి. క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితులు ఇందుకు భిన్నంగా కనిపిస్తున్నాయి. అయితే ఇక్కడే మోడీ ప్రభుత్వ 'వికసిత్ భారత్' లక్ష్యాలపై ప్రశ్న లేవనెత్తుతోంది. ఆర్థిక వృద్ధి అంటే కేవలం జీడీపీ పెరగడం కాదు.. దేశంలోని సగం జనాభా సురక్షతంగా, స్వతంత్రంగా, గౌరవంగా ఉద్యోగాల్లో ఉండే పరిస్థితులు ఏర్పడినప్పుడే ఆ వృద్ధి సమగ్రంగా ఉంటుందని విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. మహిళలపై హింస ప్రభావం అక్కడితో ఆగదు. కుటుంబ హింస మహిళల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపడంతో పాటు, పిల్లల పోషణ, ఆరోగ్యం, చదువు, భవిష్యత్ ఉపాధి సామర్థ్యంపైనా ప్రభావం చూపుతుంది. హింసతో కూడిన కుటుంబ వాతావరణంలో పెరిగే పిల్లల్లో పాఠశాలలు మానేయడం, బాల్య వివాహాలు, భవిష్యత్తులో తక్కువ కార్మిక భాగస్వామ్యం వంటి సమస్యల ప్రమాదం పెరుగుతుందని పరిశోధనలు సూచిస్తున్నాయి. మహిళలపై హింసను కేవలం నేరం, పోలీసింగ్, శిక్షల కోణంలో మాత్రమే చూడటం సరిపోదు. ఇది దేశ ఉత్పాదకత, ఉపాధి, ఆరోగ్యం, మానవ మూలధనం, ఆర్థిక వృద్ధికి సంబంధించిన సమస్య. మోడీ ప్రభుత్వం 2047 నాటికి 'వికసిత్ భారత్' అని గొప్పగా ప్రచారాలు చేసుకుంటోంది. అయితే అసలు పరీక్ష మహిళల భద్రతేనని విశ్లేషకులు చెప్తున్నారు. దేశంలోని మహిళలు భయంలేకుండా ఇల్లు దాటి ఉద్యోగానికి వెళ్లగలరా? హింసకు గురైతే న్యాయం పొందగలరా? తమ సంపాదనపై స్వతంత్ర నిర్ణయం తీసుకోగలరా? వారి గృహ శ్రమకు ఆర్థిక విలువ గుర్తించబడుతుందా? అనే ప్రశ్నలకు మోడీ సర్కారు సమాధానం ఇవ్వాల్సి ఉంటుందని అంటున్నారు. మహిళల భద్రతతోనే 'వికసిత్ భారత్' సాధ్యమవుతుందని చెప్తున్నారు.

దేశంలో పని చేసే వయసున్న మహిళల సంఖ్య కోట్లలో ఉన్నప్పటికీ.. భద్రతపై భయం అనేది వారిని ఉద్యోగాల్లోకి ప్రవేశించకుండా ఆపే ప్రధాన అడ్డంకుల్లో ఒకటిగా నిలిచింది. మహిళలు సురక్షితంగా ప్రయాణించగలిగే రవాణా, కార్యాలయాలు, వీధులు, నివాస ప్రాంతాలు లేకపోతే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెంచడం మాత్రమే సరిపోదని మేధావులు చెప్తున్నారు. పరిశోధకుల అంచనా ప్రకారం... మహిళలపై హింస, దాని భయం మహిళల కార్మిక భాగస్వామ్యాన్ని 5 నుంచి 10 శాతం పాయింట్లు తగ్గిస్తే, సురక్షితమైన పరిస్థితుల్లో మరో 2.3 కోట్ల నుంచి 4.6 కోట్ల మంది మహిళలు ఉద్యోగ రంగంలోకి ప్రవేశించే అవకాశం ఉంటుంది. వారి సగటు వార్షిక ఆదాయాన్ని సుమారు రూ.లక్షగా తీసుకుంటే... ఆర్థిక వ్యవస్థ కోల్పోతున్న మొత్తం రూ.2.3 లక్షల కోట్ల నుంచి రూ.4.6 లక్షల కోట్ల వరకు ఉండవచ్చని అంచనా.

## రష్యాతో సంబంధాలు బలపడుతున్నాయి

- **పుతిన్‌కు ఉత్తర కొరియా అధినేత కిమ్ సందేశం**



**ప్యాంగ్యాంగ్ :**
రష్యాతో సంబంధాలు మరింత బలపడుతున్నాయని ఉత్తర కొరియా అధినేత కిమ్ జాంగ్ ఉన్ తెలిపారు. రెండో ప్రపంచ యుద్ధంలో జపాన్ లొంగిపోయిన కారణంగా వలస పాలన నుంచి ఉత్తర కొరియా స్వాతంత్ర్యం పొందిన సంగతి తెలిసిందే. జపాన్ లంగుబాటుకు గుర్తుగా జరిగిన 81వ వార్షికోత్సవ వేడుకల సందర్భంగా కిమ్‌కు అభినందనలు తెలుపుతూ రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ శనివారం ఓ సందేశం పంపారు.

దీనికి కిమ్ సమాధానం ఇస్తూ సోవియట్ సైనికులు జపాన్‌కు వ్యతిరేకంగా పోరాడుతున్నప్పుడు స్నేహబంధం ఏర్పడిందని, అది మరింత బలపడి అన్ని రంగాలలో సహకారం కొనసాగుతోందని తెలిపారు. న్యాయం కోసం సాగించిన ఉమ్మడి పోరాట చరిత్రను, స్నేహబంధం యొక్క విలువైన సంప్రదాయాలను ముందుకు తీసుకుపోయిన ద్వైపాక్షిక సంబంధాల భవిష్యత్తుపై ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.విమోచన వార్షికోత్సవం సందర్భంగా సద్భావనా పర్యటన కోసం రష్యా నౌక 'పల్లాడా' ఉత్తర కొరియాలోని వాన్సాన్ ఓడ రేవుకు చేరుకుంది. ఉత్తర కొరియా ప్రాంతీయ అధికారులు, రష్యా రాయబార కార్యాలయ సిబ్బంది ఆ నౌకకు స్వాగతం పలికారు. ఇదిలా వుండగా శాంతియుత సహజీవనం కోసం ఉత్తర కొరియాతో చర్చలు జరపాల్సిన అవసరం ఉన్నదని దక్షిణ కొరియా అధ్యక్షుడు లీ జే మ్యూంగ్ అభిప్రాయపడ్డారు.ఘర్షణల నివారణకు ఉభయ కొరియాల మధ్య రక్షణ చర్యలు అవసరమని సియోల్ విమోచనా దినోత్సవ వేడుకల సందర్భంగా ఆయన అన్నారు. అయితే లీ అభిప్రాయంతో ఉత్తర కొరియా ఏకీభవించలేదు. అమెరికాదక్షిణ కొరియా సైనిక విన్యాసాలు తనను రెచ్చగొట్టేందుకు ఉద్దేశించినవేనని విమర్శించింది.

## ఆలయంలో తొక్కిసలాట



- **బీహార్ లో ఏడుగురు దుర్మరణం**

**పాట్నా, ఆగస్టు 17 (ఎ.ఎం.ఎస్) :**
బీహార్‌లోని లఖిసరాయ్ జిల్లాలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. శ్రావణ మాసం మూడో సోమవారం కావడంతో అశోక్ ధామ్ ఆలయానికి భక్తులు భారీగా తరలివచ్చారు.
ఈ క్రమంలో ఆలయం వెలుపల జరిగిన తొక్కిసలాటలో కనీసం ఏడుగురు మరణించగా,
పలువురు గాయపడ్డారు. ఈరోజు ఉదయం జరిగిన ఈ ఘటనతో ఆలయ ప్రాంగణంలో ఒక్కసారిగా గందరగోళం నెలకొంది. సమాచారం అందుకున్న వెంటనే జిల్లా ఉన్నతాధికారులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు. క్షతగాత్రులను సమీప ఆసుపత్రులకు తరలించారు. ప్రస్తుతం పరిస్థితిని సమీక్షిస్తున్నామని అధికారులు తెలిపారు.



## బీజేపీకి షెహజాద్ రాజీనామా

- **పార్టీ అధ్యక్షుడు నితిన్ నబిన్‌కు సమర్పణ**

**న్యూఢిల్లీ, ఆగస్టు 17 (ఎ.ఎం.ఎస్) :**
భారతీయ జనతా పార్టీ మాజీ జాతీయ అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా పార్టీకి రాజీనామా చేశారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్‌కు రాసిన లేఖలో పార్టీతో తనకున్న అన్ని పదవులతో పాటు ప్రాథమిక సభ్యత్వానికి కూడా రాజీనామా చేస్తున్నట్లు ఆయన తెలిపారు. తన నిర్ణయానికి "అత్యవసర ఆర్థిక, వ్యక్తిగత పరిస్థితులు" కారణమని పూనావాలా పేర్కొన్నారు. తన ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా ప్రైవేట్ రంగంలోకి వెళ్లాలని నిర్ణయించుకున్నట్లు వెల్లడించారు. జూలై 30న కూడా పూనావాలా రాజీనామా లేఖ సమర్పించినప్పటికీ, బిజెపి నాయకత్వం దానిని అంగీకరించలేదు. తన నిర్ణయాన్ని పునఃపరిశీలించాలని నాయకత్వం కోరింది. అయితే, సుదీర్ఘంగా, తీవ్రంగా ఆలోచించిన అనంతరం పార్టీ ... వైదొలగాలనే తుది నిర్ణయానికి వచ్చినట్లు ఆయన తాజా లేఖలో తెలిపారు.

## అమెరికా.. అంతా ఉత్త గ్యాస్...

- **మిత్ర దేశాల్లో అగ్రరాజ్యంపై ఆగ్రహ జ్వాలలు**
- **ప్రత్యామ్నాయాలు వెతుక్కుంటున్న దేశాలు**
- **తీవ్రంగా నష్టపోయిన సౌదీ**

**వాషింగ్టన్, ఆగస్టు 17 :**
ఇరాన్ యుద్ధం తెలుగు టీవీ సీరియల్ మాదిరిగా అంతూపొంతూ లేకుండా కొనసాగుతుండడంతో గల్ఫ్ వ్యాప్తంగా అమెరికా పట్ల ఆగ్రహం పెల్లుబుకుతోంది. మధ్యప్రాచ్యాన్ని అమెరికా సురక్షిత ప్రదేశంగా ఉంచగలదా అని సౌదీ అరేబియా, యూఏఈ, ఖతార్, కువైట్, బహ్రైన్ అనుమానం వ్యక్తం చేస్తున్నాయి. అమెరికాఇరాన్ మధ్య యుద్ధం ప్రారంభమై ఆరు నెలలు కావస్తోంది. అయినా దానికి ముగింపు ఎప్పుడో ఎవరికీ తెలియడం లేదు. మరోవైపు చమురు ధరలు పైపైకి ఎగబాకుతున్నాయి. ఇంధన సరఫరాలకు తీవ్ర ఆటంకం ఏర్పడుతోంది. ఇరాన్‌తో శాంతి ఒప్పందం విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేస్తున్న పరస్పర విరుద్ధ ప్రకటనలు మరింత అయోమయాన్ని కలిగిస్తున్నాయి. యుద్ధాన్ని ఆపడంలో అమెరికా వైఫల్యం, అసమర్థతపై ఐదు పశ్చిమాసియా దేశాలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. ఇంధన సరఫరాలో ఖతార్, సౌదీ అరేబియా వంటి గల్ఫ్ దేశాలు ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. హార్ముజ్ జలసంధిని ఇరాన్ దిగ్బంధించడంతో ఆ దేశాలు ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతున్నాయి. ఎర్ర సముద్రాన్ని హిందూ మహా సముద్రంతో కలిపే బాబ్ అల్‌మందెబ్ జలసంధిని దిగ్బంధిస్తామని హౌతీలు చేసిన హెచ్చరికతో పరిస్థితి మరింత క్షీణించింది. యుద్ధం ప్రారంభం కావడానికి ముందు అమెరికా విషయంలో గల్ఫ్ దేశాలు సానుకూలంగానే ఉండేవి. అమెరికా దళాల ఉనికి అవాంఛనీయమే అయినప్పటికీ వాటితో ఉపయోగం కూడా ఉన్నదని అవి భావించాయి. అయితే ఇప్పుడు వాటి వైఖరిలో మార్పు స్పష్టంగా కన్పిస్తోంది. అమెరికా సేనలు, స్థావరాలతో తమకు ఒరిగిందేమీ లేదని అవి నిర్ణయానికి వచ్చాయి. యుద్ధం ప్రారంబమైనప్పటి నుంచే అమెరికా పట్ల వాటి విశ్వాసం క్రమేపీ క్షీణించింది. మధ్యప్రాచ్యంలో అమెరికా చర్యలు తమ భద్రతకు ఉపయోగపడడం మాట అటుంచి అవి తమకు ప్రమాదాన్ని కలిగిస్తున్నాయని ఆ దేశాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.



అయితే ఇక్కడ ఓ విషయాన్ని ప్రస్తావించాల్సి ఉంది. ఆయుధాలు, శిక్షణ, గూఢచార సమాచారం కోసం గల్ఫ్ దేశాలు ఇప్పటికీ అమెరికా పైనే ఎక్కువగా ఆధారపడుతున్నాయి. ఇరాన్‌ను ఎదుర్కోవాలంటే తమకు అమెరికా సాయం అవసరమని అవి భావిస్తున్నాయి. అయితే అమెరికా పట్ల వ్యక్తమవుతున్న అసంతృప్తి కారణంగా కొన్ని దేశాలు తమ భద్రత కోసం ఇతర మార్గాలను అన్వేషిస్తున్నాయి. సౌదీ అరేబియా, టర్కీ, పాకిస్తాన్ దేశాలు గత వారం పరస్పర రక్షణ ఒప్పందంపై సంతకాలు చేశాయి. ఇది అమెరికాకు ఓ స్పష్టమైన సంకేతమేనని విశ్లేషకులు వ్యాఖ్యానించారు. గల్ఫ్ దేశాలలో సౌదీ అరేబియా తీవ్రమైన ఒత్తిడికి గురవుతోంది. ఇరాన్‌తో పాటు హౌతీలు కూడా దానినే లక్ష్యంగా చేసుకుంటున్నారు. సౌదీ ఇంధన కేంద్రాలపై హౌతీలు పదే పదే దాడులు జరుపుతున్నారు. హార్ముజ్ మూతపడడంతో సౌదీ అరేబియా తన చమురు ఎగుమతులను ఎర్రసముద్ర ఓడరేవుల ద్వారా జరుపుతోంది. అయితే అక్కడ హౌతీల నుంచి క్షణక్షణం ముప్పు పొంచి ఉంటోంది. హార్ముజ్‌ను ఇరాన్ మూసివేయడానికి ముందు సౌదీ అరేబియా ఆ జలసంధి మీదుగా రోజుకు ఐదు మిలియన్ బ్యారల్స్ చమురును రవాణా చేసేది. ఇప్పుడు ఆ జలసంధి మీదుగా ట్యాంకర్ల రాకపోకలు దాదాపు 90 శాతం తగ్గిపోవడంతో చమురు ధరలు కొండెక్కి కూర్చున్నాయి. వాషింగ్టన్ పోస్ట్ పత్రిక కథనం ప్రకారం... అమెరికా పై ఆయా దేశాలకు ఉన్న అసంతృప్తి కేవలం అధ్యక్షభవనంపై దౌత్యపరమైన ఒత్తిడికే పరిమితం కాలేదు. మధ్యప్రాచ్యంలో అమెరికాకు అనేక సైనిక స్థావరాలు ఉన్న విషయం తెలిసిందే. వాటిలో కొన్ని స్థావరాలు గల్ఫ్ దేశాలలో కొనసాగుతున్నాయి. ఫలితంగా ఆయా దేశాలు ఇరాన్ ఆగ్రహానికి గురవుతున్నాయి. ఈ నేపథ్యంలో అసలు అమెరికా సైనిక స్థావరాలను మనం ఎందుకు అనుమతించాలన్న ప్రశ్న ఇప్పుడు సౌదీ అరేబియా, యూఏఈ, ఖతార్, కువైట్, బహ్రైన్ దేశాలలో తలెత్తుతోంది. ఇరాన్‌తో దౌత్య ప్రయత్నాలలో అమెరికా వైఫల్యం, గత ఐదు నెలలుగా ట్రంప్ చేస్తున్న పొంతన లేని ప్రకటనల కారణంగా గల్ఫ్ దేశాలు మూల్యం చెల్లించుకోవాల్సి వస్తోంది. ఫిబ్రవరిలో అమెరికా, ఇజ్రాయిల్ సేనలు ఇరాన్‌పై దాడులు ప్రారంభించినప్పటి నుంచి అమెరికాపై ఆగ్రహం పతాక స్థాయికి చేరిందని ఓ గల్ఫ్ అధికారి తెలిపారు. 'యుద్ధాన్ని ప్రారంభించింది ట్రంప్. కానీ మూల్యం చెల్లిస్తోంది మాత్రం మేమే' అని ఆయన అన్నారు.

గల్ఫ్ దేశాలలో ఒకటైన ఒమన్ యుద్ధాన్ని మొదటి రోజు నుంచే వ్యతిరేకించింది. సౌదీ, యూఏఈ, బహ్రైన్ తొలుత కొంత సానుకూలత వ్యక్తం చేసినప్పటికీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ఈ మూడు దేశాలు తరచూ ఇరాన్ దాడులకు గురయ్యాయి. వాస్తవానికి ప్రారంభంలో ఇరాన్ యుద్ధానికి గల్ఫ్ దేశాలు పూర్తి మద్దతు ప్రకటించలేదు. అలాగని వ్యతిరేకించ లేదు కూడా. ఇరాన్ ప్రభుత్వం పతనం కాబోదని, హార్ముజ్ ఇప్పట్లో తెరుచు కోదని రూఢ అయిన తర్వాత వాటి ఆశలు అడియాసలయ్యాయి. మారు తున్న ట్రంప్ వైఖరులు గల్ఫ్ దేశాలను కలవరపెడుతున్నాయి. సుదీర్ఘ యుద్ధం గల్ఫ్ దేశాలను ఆర్థికంగా బాగా దెబ్బతీసింది. వేసవిలో పర్యాటకుల సంఖ్య బాగా పడిపోయింది. కాగా గల్ఫ్ దేశాలతో తమ సంబంధాలు దెబ్బతిన్నాయన్న వాదనను అమెరికా తోసిపుచ్చింది.



## సుప్రీంలో రాహుల్ గాంధీకి ఊరట

- **ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో చర్యలకు కోర్టు నో**

**న్యూఢిల్లీ, ఆగస్టు 17 (ఎ.ఎం.ఎస్) :**
కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి సుప్రీంకోర్టులో మధ్యంతర ఊరట లభించింది. ఆదాయానికి మించిన ఆస్తుల ఆరోపణలకు సంబంధించిన కేసులో ప్రస్తుతం ఎలాంటి తదుపరి చర్యలు తీసుకోవద్దని అలహాబాద్ హైకోర్టును సుప్రీంకోర్టు ఆదేశించింది. అలాగే, అలహాబాద్ హైకోర్టు గతంలో ఇచ్చిన ఆదేశాల మేరకు సీబీఐ, ఈడీ ఎలాంటి నివేదికను సమర్పించకూడదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈ పిటిషన్‌పై తదుపరి విచారణ జరిగే వరకు అలహాబాద్ హైకోర్టు తన తదుపరి విచారణను వాయిదా వేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. హైకోర్టు ఆదేశాల మేరకు సీబీఐ, ఈడీ ఎలాంటి నివేదికను సమర్పించకూడదని కూడా పేర్కొంది. ఈ కేసులో కర్ణాటకకు చెందిన ఎస్. విఘ్నేశ్ శిశిర్, అలాగే సీబీఐ, ఈడీలకు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది.

## విద్యార్థులతో చర్చలు జరపండి

- **జార్ఖండ్ సీఎంకు రాహుల్ గాంధీ లేఖ**
- **సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి**

**రాంచీ, ఆగస్టు 17 (ఎ.ఎం.ఎస్) :**
ప్రభుత్వ నియమాక పోటీ పరీక్షల్లో జరిగిన లీక్ లను వ్యతిరేకిస్తూ జార్ఖండ్ విద్యార్థులు నిరాహార దీక్ష చేస్తున్న విషయం తెలిసిందే. జార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్, జార్ఖండ్ స్టాఫ్ సెలక్షన్ కమిషన్ నిర్వహించిన పరీక్షలలో అక్రమాలకు వ్యతిరేకంగా రాంచీలోని జైపాల్ సింగ్ స్టేడియంలో విద్యార్థులు చేస్తున్న నిరసన వరుసగా 24వ రోజుకు చేరుకుంది.సీబీఐ ద్వారా సమగ్ర దర్యాప్తు జరగాలని, బాధ్యులకు కఠిన శిక్ష పడాలని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. తాజాగా ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ ఆ రాష్ట్ర సీఎం హేమంత్ సోరెన్ కు లేఖ రాశారు. నిరసన చేస్తున్న విద్యార్థులతో నేరుగా వెళ్లి చర్చలు సాగించాలని ఆయన లేఖలో సూచించారు. గత కొన్ని నెలలుగా విద్యా వ్యవస్థలో పేపర్ లీక్‌లు మరియు అవకతవకలకు వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులకు పూర్తి మద్దతును అందించామన్నారు.

"వారి నిరసన శాంతియుతంగా ఉంది, వారి డిమాండ్లు న్యాయబద్ధమైనవి. మీరు ఏర్పాటు చేసిన ఒక కమిటీ ద్వారా జార్ఖండ్ ప్రభుత్వం వారితో సంప్రదింపులు ప్రారంభించడాన్ని నేను అభినందిస్తున్నాను. విద్యార్థులు లేవనెత్తిన అనేక డిమాండ్లపై ఏకాభిప్రాయం కూడా కుదిరిందని నేను నమ్ముతున్నాను. అయినప్పటికీ, నిరసనలు కొనసాగుతున్నాయి, కొంతమంది విద్యార్థులు నిరవధిక నిరాహార దీక్షలో ఉన్నారు. యువతే భారతదేశ భవిష్యత్తు. దయచేసి వారి మాటలను ఓపికగా విని, ఈ సమస్య పరిష్కారం కోసం తగిన చర్యలు తీసుకోండి" అని రాహుల్ గాంధీ లేఖలో పేర్కొన్నారు.



**సీబీఐ ద్వారా సమగ్ర దర్యాప్తు జరగాలని, బాధ్యులకు కఠిన శిక్ష పడాలని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. తాజాగా ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ ఆ రాష్ట్ర సీఎం హేమంత్ సోరెన్ కు లేఖ రాశారు.**

## లక్ష్మీ మిత్తల్ కంపెనీపై రష్యా దాడి

- **కీలక విద్యుత్ వ్యవస్థ ధ్వంసం**
- **బ్లాస్ట్ ఫర్నేస్‌లకు నష్టం**

**క్రీవీ రిహ్, ఆగస్టు 17 :**
ఉక్రెయిన్‌పై రష్యా దాడులు మరింత తీవ్రంగా మారాయి. భారత సంతతికి చెందిన బిలియనీర్ లక్ష్మీ మిత్తల్‌కు చెందిన ఆర్సెలార్ మిత్తల్ స్టీల్ ప్లాంట్‌పై రష్యా క్షిపణి దాడి చేసింది. ఉక్రెయిన్‌లోని క్రీవీ రిహ్‌లో ఉన్న ఈ కర్మాగారం దేశంలోనే అతిపెద్ద సమగ్ర ఉక్కు పరిశ్రమగా ఉంది. దాడిలో ఇద్దరు మృతి చెందారు. 14 మంది కార్మికులు గాయపడ్డారు. కీలక విద్యుత్ వ్యవస్థలు, బ్లాస్ట్ ఫర్నేస్‌లకు నష్టం వాటిల్లడంతో ఉత్పత్తిని కొంతకాలం నిలిపివేయాల్సి వచ్చింది.ఈ దాడికి ముందు రష్యాపై ఉక్రెయిన్ భారీ డ్రోన్ దాడికి పాల్పడింది. రష్యా అంతటా 822 డ్రోన్లను అడ్డుకున్నట్లు ఆ దేశ రక్షణ శాఖ తెలిపింది. మాస్కో వైపు దాదాపు 600 డ్రోన్లు దూసుకొచ్చాయని నగర మేయర్ సెర్గీ సోబ్యానిన్ చెప్పారు.
వాటిలో మూడో వంతును మాస్కో ప్రాంతంలోనే కూల్చివేసినట్లు తెలిపారు.



ఈ దాడుల్లో పలువురు ప్రాణాలు కోల్పోయారు. మాస్కో సమీపంలోని ఓ ఇంటిపై ఉక్రెయిన్ డ్రోన్ దాడి చేయడంతో 83 ఏళ్ల వృద్ధుడు మృతి చెందాడు. మరో దాడిలో రష్యాలో అతిపెద్ద ఆన్‌లైన్ రిటైలర్ వైల్‌డ్‌బెర్రీస్ గిడ్డంగిలో భారీగా మంటలు చెలరేగాయి. రోస్టోవ్ ప్రాంతంలో 150కి పైగా డ్రోన్లతో జరిగిన దాడిలో ఐదుగురు మృతి చెందినట్లు స్థానిక అధికారులు తెలిపారు. ఇళ్లు, రైల్వే స్టేషన్ సహా పలు ప్రాంతాలు దెబ్బతిన్నాయి.

## మధ్యప్రాచ్యానికి అమెరికా యుద్ధ విమాన వాహక నౌక

- **ధృవీకరించని పెంటగాన్**

**వాషింగ్టన్, ఆగస్టు 17 :**
ఇరాన్ యుద్ధం కారణంగా సుదీర్ఘకాలం పాటు సముద్ర జలాలలోనే గడిపిన యుద్ధ విమాన వాహక నౌక యూఎస్ఎస్ అబ్రహం లింకన్ స్థానంలో మరో నౌకను అమెరికా మోహరిస్తోంది. యూఎస్ఎస్ అబ్రహం లింకన్‌లో ఉన్న ఐదు వేల మంది సిబ్బంది అనుభవిస్తున్న దుర్భర పరిస్థితులను మీడియా బయట పెట్టడంతో మరో యుద్ధ విమాన వాహక నౌక యూఎస్ఎస్ జార్జ్‌వాషింగ్టన్‌ను మధ్యప్రాచ్యానికి పంపుతోంది. ఈ నౌక వియత్నాంలోని దనాంగ్ ఓడరేవు నుంచి పశ్చిమ పసిఫిక్ మహా సముద్రానికి బయలుదేరింది. యూఎస్ఎస్ లింకన్ 266 రోజులకు పైగా నేల అనేదే చూడకుండా సముద్ర జలాలలోనే గడిపింది. నౌకలో సరఫరాలకు తీవ్ర కొరత ఏర్పడుతోందని, సిబ్బంది మానసికంగా కుంగిపోతున్నారని, ఆత్మహత్యకు కూడా ప్రయత్నాలు జరిగాయని వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలో మధ్యప్రాచ్యానికి వేరే నౌకను పంపుతామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, నౌకాదళ తాత్కాలిక కార్యదర్శి హంగ్ కావో సూచనప్రాయంగా చెప్పారు. అయితే యూఎస్ఎస్ జార్జ్ వాషింగ్టన్ తరలింపును పెంటగాన్ ఇంకా ధృవీకరించలేదు.

## ఆ ఒప్పందంలో ఈజిప్ట్ కూడా చేరుతుంది

- **టర్కీ అధ్యక్షుడు రెసెప్ తయ్యిప్ ఎర్డోగన్ వెల్లడి**
- **హార్ముజ్ జలసంధిని తిరిగి తెరవాలంటూ విజ్ఞప్తి**

**రియాద్, ఆగస్టు 17 :**
సౌదీ అరేబియా, పాకిస్తాన్‌తో కలిసి తాము కుదుర్చుకున్న ఉమ్మడి రక్షణ ఒప్పందంలో ఈజిప్ట్ కూడా చేరుతుందని టర్కీ అధ్యక్షుడు రెసెప్ తయ్యిప్ ఎర్డోగన్ చెప్పారు. ఈ ఒప్పందంలో మరింత మంది సభ్యులు చేరవచ్చునని ఆయన తెలిపారు. సభ్య దేశాలలో ఎవరి పైన దాడి జరిగినా సంయుక్తంగా చర్యలు చేపట్టేందుకు మక్కా జాయింట్ డిఫెన్స్ అగ్రిమెంటుపై సంతకాలు చేసిన దేశాలు కట్టుబడి ఉంటాయని వివరించారు. ఈ ఒప్పందం ప్రపంచానికి ఓ ముఖ్యమైన సందేశాన్ని అందించిందని అన్నారు. పవిత్ర మక్కా నగరంలో ఈజిప్ట్ అధ్యక్షుడు ఎర్డోగన్, సౌదీ యువరాజు మహమ్మద్ బిన్ సల్మాన్, పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ గత శుక్రవారం సంతకాలు చేసిన విషయం తెలిసిందే. సభ్య దేశాలలో ఏ ఒక్కరిపై దాడి జరిగినా అందరి పైనా జరిగినట్లుగానే భావించాలని మక్కా ఒప్పందం నిర్దేశిస్తోంది.



అల్ జజీరా వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఎర్డోగన్ అనేక ప్రాంతీయ అంశాలను ప్రస్తావించారు. హార్ముజ్ జలసంధిని తిరిగి తెరవడానికి ఈజిప్ట్ ప్రాధాన్యత ఇస్తుందని అంటూ దానిని నిరంతరం మూసివేస్తే ఎవరికీ ప్రయోజనం కలగదని చెప్పారు.

మధ్యప్రాచ్యంలో యుద్ధ నివారణకు ఖతార్ నిర్వహిస్తున్న మధ్యవర్తిత్వ పాత్రను కొనియాడారు. పొరుగు దేశాలైన సిరియా, గాజా, లెబనాన్‌లో చెలరేగుతున్న అలజడి విషయంలో ప్రేక్షక పాత్ర పోషించబోమని ఎర్డోగన్ స్పష్టం చేశారు.

# వరంగల్ | ఖమ్మం | నల్లగొండ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## హెచ్ఐవీ, ఎస్టీఐలపై అవగాహనతోపాటు పరీక్షలు చేయించుకోవాలి

- జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్
- ఇండియా ఫైట్స్ హెచ్ఐవీ అండ్
- ఎస్టీఐ ప్రచార పోస్టర్ ఆవిష్కరణ

**ఖమ్మం, వుదయం బ్యూరో ఆగస్టు17**

హెచ్ఐవీ, ఎస్టీఐలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండటంతో పాటు, అనుమానం ఉన్నప్పుడు సకాలంలో పరీక్షలు చేయించుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సూచించారు. హెచ్ఐవీ, లైంగికంగా సంక్రమించే వ్యాధులపై ప్రజల్లో అవగాహన పెంపొందించడంతో పాటు, సకాలంలో పరీక్షలు చేయించుకునేలా ప్రోత్సహించేందుకు చేపడుతున్న ఇండియా ఫైట్స్ హెచ్ఐవి అండ్ ఎస్టీఐ ప్రచారంలో భాగంగా రూపొందించిన పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, అదనపు కలెక్టర్లు డా. పి. శ్రీజ, పి. శ్రీనివాస రెడ్డిలతో కలిసి సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ హెచ్ఐవీ లేదా ఎస్టీఐలకు సంబంధించి ఏవైనా సందేహాలు, అనుమానాలు ఉన్నవారు ఆలస్యం చేయకుండా తమ ఆరోగ్య పరిస్థితిపై అవగాహన పొందాలని సూచించారు.

**క్యూఆర్ కోడ్ ద్వారా గోప్యమైన స్వీయ అంచనా**

జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ (NACO) ఆధ్వర్యంలో బ్రేక్ ఫ్రీ ప్రచారంలో భాగంగా హెచ్ఐవీ, ఎస్టీఐలకు సంబంధించిన డిజిటల్ స్వీయ అంచనా సదుపాయం అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. అధికారిక ప్రచార పోస్టర్‌పై ఉన్న క్యూఆర్ కోడ్‌ను మొబైల్ ఫోన్ కెమెరాతో స్కాన్ చేసి, వ్యక్తిగత ఆరోగ్యం, వ్యాధుల బారిన పడే ప్రమాదానికి సంబంధించిన సులభమైన ప్రశ్నలకు గోప్యంగా సమాధానాలు ఇవ్వడం ద్వారా స్వీయ అంచనా చేసుకోవచ్చని వివరించారు. స్వీయ అంచనా అనంతరం అవసరమైన నివారణ చర్యలు, ఆరోగ్య సంబంధిత మార్గదర్శకాలు, సమీపంలోని పరీక్షా కేంద్రాలు, ఇతర వైద్య సేవల వివరాలను తెలుసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రజలు ఎలాంటి సంకోచం లేకుండా ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

**1097 జాతీయ ఎయిడ్స్ హెల్ప్‌లైన్ ద్వారా సేవలు:**

హెచ్ఐవీ, ఎస్టీఐలకు సంబంధించిన సందేహాలు, సమాచారం లేదా సహాయం కోసం 1097 జాతీయ టోల్‌ఫ్రీ ఎయిడ్స్ హెల్ప్‌లైన్ ను సంప్రదించవచ్చని అధికారులు తెలిపారు. ఈ సేవ ద్వారా గోప్యంగా, ఉచితంగా అవసరమైన సమాచారం, మార్గదర్శకత్వం పొందవచ్చని పేర్కొన్నారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రామారావు, డిసిహెచ్ఎస్ డా. రాజశేఖర్, వైద్యాధికారులు, జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## కేంద్ర వంటశాలలకు కూరగాయల సరఫరా

- జిల్లా కలెక్టర్ ఆదేశాలు



**జనగామ, ఆగస్టు 17 (వుదయం ప్రతినిధి) :**

జిల్లాలోని హరే కృష్ణ, అక్షయ పాత్ర, మన్నా ట్రస్ట్ కేంద్ర వంటశాలలకు మహిళా స్వయం సహాయక సంఘాల (SHG) ద్వారా రైతుల నుంచి నేరుగా కూరగాయలను సరఫరా చేసేందుకు చర్యలు వేగవంతం చేసినట్లు జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. సోమవారం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. కూరగాయల సాగును ప్రోత్సహించేందుకు జిల్లా స్థాయి బృందం ఆగస్టు 17 నుండి 20 వరకు 12 మండలాల్లో క్షేత్రస్థాయి పర్యటనలు నిర్వహించి రైతులతో సమావేశమవుతుంది.

**వేగవంతమైన చెల్లింపులు:** మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నాణ్యమైన ధర కల్పిస్తూ, కూరగాయలు అందించిన 2–3 రోజుల్లోనే SERP ద్వారా రైతులకు చెల్లింపులు చేస్తారు.

ప్రభుత్వ పథకాల అనుసంధానం: రైతులకు విత్తనాలు, డ్రిప్, పందిళ్లు, మల్చింగ్ వంటి అవసరాలను నమోదు చేసి MIDH, RKVY పథకాల ద్వారా సబ్సిడీలు అందిస్తారు. సేంద్రీయ సాగుకు (TG Organics) ప్రాధాన్యం ఇస్తారు.

**మహిళా సంఘాలకు ఉపాధి:** కూరగాయల సేకరణ, గ్రేడింగ్, రవాణా బాధ్యతలను మహిళా సంఘాలకు అప్పగించి, వారికి ప్రత్యేక శిక్షణ ఇస్తారు.

**కార్యాచరణ ప్రణాళిక:** జిల్లా వ్యవసాయ అధికారి నేతృత్వంలోని బృందం సేకరించిన వివరాలతో ఆగస్టు 21న సమగ్ర నివేదిక సమర్పిస్తుంది. ఆగస్టు 22న రాష్ట్ర స్థాయి నిపుణుల కమిటీ తుది కార్యాచరణను ఖరారు చేయనుంది.

## ప్రజావాణి' అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్

**మహబూబాబాద్, ఆగస్టు 17 (వుదయం ప్రతినిధి) :**



ప్రజావాణి కార్యక్రమానికి వచ్చే అర్జీలను అధికారులు అత్యంత బాధ్యతతో విచారించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన 'ప్రజావాణి'లో అదనపు కలెక్టర్లు అనిల్ కుమార్, పురుషోత్తం, డిఆర్ఓ నాగవాణితో కలసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ ప్రజావాణిలో భూ సమస్యలు, డబుల్ బెడ్రూమ్ ఇళ్లు, ఆసరా పింఛన్లు, ఉపాధి హామీ, గురుకుల ప్రవేశాలపై మొత్తం 110 దరఖాస్తులు వచ్చాయి. వచ్చిన అర్జీలను వెంటనే ఆన్‌లైన్ ద్వారా ఆయా శాఖలకు బదిలీ చేశారు.

అధికారులు ప్రతిరోజూ తమ అధికారిక లాగిన్‌లను తనిఖీ చేస్తూ పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని, ఒకవేళ దరఖాస్తును తిరస్కరిస్తే తగిన కారణాలను నమోదు చేసి అర్జీదారునికి స్పష్టత ఇవ్వాలని స్పష్టం చేశారు.

సంక్షేమ హాస్టళ్ల నిర్వహణ, భోజన వసతి, తాగునీరు, పరిశుభ్రత, మెనూ అమలు మరియు విద్యార్థుల హాజరును పర్యవేక్షించేందుకు ప్రత్యేక అధికారులు నిరంతరం తనిఖీలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. లోపాలు ఉంటే వెంటనే పరిష్కరించి, క్రమం తప్పకుండా నివేదికలను కలెక్టరేట్‌కు సమర్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో పలు శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

## దిశా కమిటీ సమావేశానికి సమగ్ర నివేదికలతో హాజరుకావాలి



- జిల్లా కలెక్టర్ అంకిత్

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ఆగస్టు 17(వుదయం ప్రతినిధి)**

జిల్లాలో అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సమగ్రంగా సమీక్షించేందుకు మంగళవారం (18వ తేదీ) మధ్యాహ్నం 3 గంటలకు ఐడీఓసీ కార్యాలయంలో దిశా కమిటీ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు.

ఖమ్మం పార్లమెంటు సభ్యులు రామసహాయం రఘురామ రెడ్డి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి దిశా కమిటీ కో–చైర్మన్, మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్‌తో పాటు జడ్పీ చైర్మన్, శాసనమండలి సభ్యులు, శాసనసభ్యులు, దిశా కమిటీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు హాజరుకానున్నారు. సమావేశంలో జిల్లాలో వివిధ శాఖల ఆధ్వర్యంలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, చేపడుతున్న పనుల పురోగతిని సమీక్షించనున్నారు. శాఖల వారీగా కార్యక్రమాల అమలు తీరు, ఇప్పటివరకు సాధించిన పురోగతి, ఎదురవుతున్న సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలపై చర్చించనున్నారు.

ఈ నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు తమ శాఖకు సంబంధించిన సమగ్ర నివేదికలతో సమావేశానికి తప్పనిసరిగా హాజరు కావాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. సమావేశంలో అడిగే వివరాలను స్పష్టంగా అందించే విధంగా అధికారులు అవసరమైన సమాచారాన్ని సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు.

## ప్రజావాణి వినతులను పరిష్కరించాలి

**జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్**

**హనుమకొండ, ఆగస్టు 17 (వుదయం జిల్లా ప్రతినిధి) :**

ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి వచ్చిన వినతులను ఆయా శాఖల అధికారులు త్వరితగతిన పరిష్కరించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి సమస్యలపై వినతులను స్వీకరించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమం సజావుగా సాగేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. వర్చువల్ విధానంలో తహసిల్దార్లతో సమీక్షిస్తూ, ప్రతి దరఖాస్తును తప్పనిసరిగా ప్రజావాణి పోర్టల్‌లో నమోదు చేయాలని, ఎలాంటి వినతులూ పెండింగ్‌లో ఉండకుండా చూడాలని స్పష్టం చేశారు. అలాగే, జిల్లాలోని హాస్టళ్లలో మౌలిక వసతులను పరిశీలించి నివేదికలు ఇవ్వాలని, అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి, ఇన్చార్జి అదనపు కలెక్టర్ శేషాద్రి, డిఆర్ఓ శ్రీనివాస్, ట్రైనీ కలెక్టర్ రోహిత్ నేత, డిఆర్డిఓ మేన శ్రీను, సీపీఓ సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## పోలీస్ శాఖ ఎప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటుంది

- గ్రీవెన్స్ డేలో బాధితుల ఫిర్యాదులు స్వీకరించిన ఎస్పీ నర్సింహ

**సూర్యాపేట ఆగస్టు 17: వుదయం ప్రతినిధి**



జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పోలీస్ గ్రీవెన్స్ డే కార్యక్రమంలో జిల్లా ఎస్పీ నర్సింహ ఐపీఎస్ బాధితుల నుండి వినతులు స్వీకరించారు. జిల్లా పరిధిలోని వివిధ మండలాల నుంచి వచ్చిన బాధితులు తమ సమస్యలపై ఫిర్యాదులు చేసేందుకు ఎస్పిని ప్రత్యక్షంగా కలిసి వినతి పత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఎస్పి ప్రతి ఒక్క బాధితుడి సమస్యను ఓపికగా విన్నారు. ఫిర్యాదుల పరిష్కారం కోసం తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత పోలీస్ అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి అవసరమైన సూచనలు జారీ చేశారు. "ప్రజలకు త్వరితగతిన న్యాయం అందేలా చూడాలి. బాధితుల సమస్యలను ఆలస్యం చేయకుండా పరిష్కరించాలి" అని అధికారులను ఎస్పి ఆదేశించారు. అలాగే, ప్రజల సమస్యల పరిష్కారం కోసం పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని ఎస్పి నరసింహ తెలిపారు.

చట్టబద్ధమైన విధానంలో ప్రతి ఫిర్యాదును పరిశీలించి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు

## 19న రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య పర్యటన

- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

**జయశంకర్ భూపాలపల్లి, ఆగస్టు 17(వుదయం జిల్లా ప్రతినిధి)**

రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, కమిషన్ సభ్యులతో కలిసి ఈ నెల 19వ తేదీన బుధవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో పర్యటించనున్నట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. సోమవారం ఐడిఓసి కార్యాలయంలో ఎస్సి, ఎస్టీ కమిషన్ చైర్మన్, సభ్యులు పర్యటన సందర్భంగా అన్ని శాఖల జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యటనలో భాగంగా ఆగస్టు 19న ఉదయం 11 గంటలకు జిల్లా కలెక్టరేట్ సమావేశపు హాలులో ఎస్సీ, ఎస్టీ వర్గాల సంక్షేమం, హక్కులు మరియు వివిధ శాఖల్లో అమలవుతున్న కార్యక్రమాల పురోగతిపై ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు.సమీక్షలో

ఎస్సీ, ఎస్టీ వర్గాలకు సంబంధించిన అట్రాసిటీ కేసుల విచారణ మరియు పరిష్కారం వివిధ ప్రభుత్వ శాఖల్లో రోస్టర్ పాయింట్ల అమలు తీరును సమీక్షించనున్నట్లు తెలిపారు.ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు సంబంధించిన బ్యాక్‌లాగ్ ఖాళీల భర్తీ ప్రక్రియ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమానికి సంబంధించి శాఖల వారీగా అమలు చేస్తున్న కార్యక్రమాల పురోగతిని సమీక్షించనున్నట్లు తెలిపారు. సమీక్షా సమావేశానికి జ అన్ని శాఖల అధికారులు సమగ్ర నివేదికలతో నిర్ణీత సమయానికి హాజరు కావాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, డిఆర్వో వసంత కుమారి, ఆర్డిఓ హరికృష్ణ, శిక్షణా డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి, ఎస్సి అభివృద్ధి అధికారి సుకీర్తి, అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## 'లిటిల్ కార్ట్' ఆన్‌లైన్ డెలివరీ సేవలు ప్రారంభం

- మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి

**నల్లగొండ, ఆగస్టు 17**



నల్లగొండ ముషంపల్లి రోడ్డులో 'లిటిల్ కార్ట్' ఆన్‌లైన్ డెలివరీ సేవలు ప్రారంభమయ్యాయి. సోమవారం నిర్వహించిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో నల్లగొండ మున్సిపల్ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి 'లిటిల్ కార్ట్'ను ప్రారంభించారు.

ఈ సందర్భంగా మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, నల్లగొండ యువత ఆలోచనలు, ప్రతిభ, సాంకేతిక సామర్థ్యానికి 'లిటిల్ కార్ట్' ఒక మంచి ఉదాహరణగా నిలుస్తుందని అన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఆన్‌లైన్ సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని పేర్కొన్నారు. ముఖ్యంగా ప్రజలకు అవసరమైన సరుకులను ఇంటి వద్దకే సులభంగా చేరవేసే విధానం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు

'లిటిల్ కార్ట్' ద్వారా అన్ని రకాల నిత్యావసర సరుకులను ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేసుకునే సదుపాయం అందుబాటులో ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. వినియోగదారులు ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేసుకున్న సరుకులను వేగంగా వారి ఇంటి వద్దకే సరఫరా చేయనున్నట్లు చెప్పారు. 10 నిమిషాల్లో డెలివరీ అందించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు

నల్లగొండలో సాంకేతికత ఆధారిత సేవలకు మరింత ఆదరణ పెరగాలని, 'లిటిల్ కార్ట్' విజయవంతంగా ముందుకు సాగాలని మేయర్ ఆకాంక్షించారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తూ, స్థానికంగా కొత్త ఆలోచనలకు ప్రోత్సాహం అందించే సంస్థలు మరిన్ని రావాలని మేయర్ అన్నారు

ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి గుమ్మల మోహన్ రెడ్డి, డిప్యూటీ మేయర్ ఆశ్రఫ్ అలీ అమీర్, మాజీ కార్పొరేటర్ అస్సద్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎడ్ల సైదులు, లిటిల్ కార్ట్ నిర్వాహకులు, సీఈఓ మేకల సతీష్ రెడ్డి, మేనేజర్ పోరెడ్డి ప్రమోద్ రెడ్డి, మర్రి నాగార్జున రెడ్డి, సత్యనారాయణరెడ్డి, సిబ్బంది స్వాతి, సౌజన్య, సృజనా, స్వేత, జాన్సీ, జానకమ్మ, దుర్గా, విజయ రాణి, స్థానిక ప్రముఖులు, యువత తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ బండి కుమార్‌కు వందే భారత్ అవార్డు ప్రదానం

- సంచలనాత్మక కథనాలకు కేరాఫ్..
- నాడు డాక్టరేట్, నంది అవార్డు.. నేడు వందే భారత్ అవార్డు..

**ఖమ్మం వుదయం బ్యూరో**

**ఆగస్టు 17**



జిల్లాకు చెందిన సీనియర్ జర్నలిస్ట్ డాక్టర్ బండి కుమార్ కు అరుదైన గౌరవం దక్కింది. శనివారం హైదరాబాద్ రవీంద్ర భారతిలోని పైడి జయరాజు ప్రివ్యూ థియేటర్ 2వ అంతస్తులో వారు నిర్వహించిన వందేభారత్ జాతీయ అవార్డుల ప్రదానం కార్యక్రమంలో భాగంగా పత్రికా రంగంలో సీనియర్ జర్నలిస్ట్ డాక్టర్ బండి కుమార్ కి వందేభారత్ జాతీయ అవార్డును అందజేశారు. ప్రముఖ సినీ గేయ రచయిత జాతీయ అవార్డు గ్రహీత డాక్టర్ సుద్దాల అశోక్ తేజ, ప్రముఖ సినీ దర్శకులు రేలంగి నరసింహారావు, వంశీ ఇంటర్నేషనల్ సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ వంశీ రామరాజు, ప్రముఖ సినీ నటులు పోలాప్రగడ జనార్దన్ రావు (జెన్నీ), కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత చొక్కాపు వెంకటరమణ, రాజ్ ఎంటర్ ట్రైనర్స్, సీఈఓ మునుకోటి డేవిడ్ రాజ్, వందేభారత్ మూవీ డైరెక్టర్ ఆనందలహరి సంస్థ కన్వీనర్ కళారత్న మల్లం రమేష్ చే ఈ అవార్డును ప్రధానం చేశారు. అనంతరం అవార్డు గ్రహీత సీనియర్ జర్నలిస్ట్ డాక్టర్ బండి కుమార్ మాట్లాడుతూ... తాను రాసిన వార్తలను, సేవలను గుర్తించి ఈ అవార్డును ప్రదానం చేసినందుకు వందేభారత్ జాతీయ సమైక్యత వారికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఉమ్మడి ఖమ్మం జిలా డిసిసిబి డైరెక్టర్, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ముఖ్య అనుచరుడు తుళ్లూరి బ్రహ్మయ్య, రాష్ట్ర కాంగ్రెస్ నేత బొర్రా రాజశేఖర్, ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ యరగడ్ల హనుమంత రావు, ఖమ్మం నియోజవర్గ ఆత్మ కమిటీ చైర్మన్ దిరిశాల వెంకటేశ్వర్లు, రఘునాథపాలెం మండల అధ్యక్షులు కేళోతు దేవ్ సింగ్, కాంగ్రెస్ జిల్లా నాయకులు పరికపల్లి శ్రీనివాస్ గౌడ్, కోసూరి శ్రీనివాసరావు, ఓబీసీ జిల్లా అధ్యక్షులు పుచ్చకాయల వీరభద్రం, ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి, నేలకొండపల్లి మండల ఇంచార్జి బమ్మిడి శ్రీనివాస్ యాదవ్, కాంగ్రెస్ నేత కమతం రామకృష్ణ, ఖమ్మం జిల్లా యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ గొట్టం ఆదర్శ్, తెలంగాణ సోషలిస్టు స్టూడెంట్ అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దమళ్ళ సత్యం, తెలంగాణ ఎరుకల సంఘం ఖమ్మం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దశరథ రవి, మానవ హక్కుల ప్రజా పరిరక్షణ సమితి జిల్లా ఉపాధ్యక్షులు కొప్పుల రామారావు, జర్నలిస్టు నాగార్జున, అధికారులు, సత్కరించి, అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

## వర్షం కోసం రైతుల ఎదురుచూపులు

**చిలుకూరు ఆగస్టు 17: ( వుదయం )**

వాన కోసం రైతుల కళ్లన్నీ ఆకాశం వైపే ఉన్నాయి. సకాలంలో వర్షాలు కురవక పోవడంతో బీడు భూములుగా దర్శనమిస్తున్నాయి పోసిన నార్లు ఎండిపోతున్నాయి. విత్తనాలు సిద్ధంగా ఉంచుకున్న రైతులు వర్షం కోసం ఆందోళనగా ఎదురు చూస్తున్నారు. వర్షాభావం కారణంగా సాగు పనులు ఆలస్యమవుతున్నాయి. ఇప్పటికే ఖర్చులు పెరగడంతో రైతులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. త్వరలో మంచి వర్షాలు కురిసి సాగు ప్రారంభ మవుతుందని రైతులు ఆశాభావంతో ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం కూడా పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, నాగార్జున సాగర్ నుంచి అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. సకాలంలో వర్షాలు కురిస్తేనే పంటలు బాగుండి, రైతుల ముఖాల్లో చిరునవ్వులు తిరిగి కనిపిస్తాయని స్థానికులు అంటున్నారు. భూగర్భ జలాలు అడుగంటి బోర్లు పోయడం లేదని ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు అయోమయానికి గురి అవుతున్నారని భగవంతుడు కరుణించి వర్షాలు కురిస్తే సాఫీగా జరుగుతాయని మండలంలోని పలువురు రైతులు కోరుతున్నారు.

## ప్రజావాణి దరఖాస్తులకు త్వరిత పరిష్కారం చూపాలి: మంత్రి సీతక్క

**ములుగు, ఆగస్టు 17 (వుదయం ప్రతినిధి) :**



గోవిందరావుపేట మండల ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం జిల్లా కేంద్రాలు, హైదరాబాద్ వరకు వెళ్లకుండా మండల స్థాయిలోనే పరిష్కారం చూపాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అధికారులను ఆదేశించారు. సోమవారం గోవిందరావుపేట మండల కేంద్రంలో నిర్వహించిన 'మండల ప్రజావాణి' కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై, ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సమావేశంలో మంత్రి సీతక్క మాట్లాడుతూ ప్రజావాణి దరఖాస్తుల పురోగతిని తెలిపేందుకు ఎంపీడీఓ కార్యాలయాల్లో ప్రత్యేక హెల్ప్‌డెస్కులు ఏర్పాటు చేయాలి. అర్జీదారుల సెల్‌ఫోన్ నంబర్లను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలి. ఒంటరి మహిళలు, వితంతువులు, వికలాంగుల పింఛన్ దరఖాస్తులను ఈ నెల 31వ తేదీలోగా పూర్తిస్థాయిలో స్వీకరించాలి. అత్యవసర సమస్యలపై అధికారులు వెంటనే స్పందించాలి. సమస్య పరిష్కారానికి పడుతున్న సమయం, పురోగతి వివరాలను వారం రోజుల్లో దరఖాస్తుదారునికి స్పష్టంగా తెలియజేయాలి. అధికారులు కార్యాలయాలకే పరిమితం కాకుండా మారుమూల గ్రామాలు, గూడేల్లో పర్యటించి సమస్యలను తెలుసుకోవాలి. మౌలిక సదుపాయాల అభివృద్ధి: పస్రా, గోవిందరావుపేట, చల్వాయి ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇచ్చామని, ఎస్టీ తండాలు, గూడేలలో మౌలిక వసతుల కోసం రూ.50 కోట్లతో పనులు చేపట్టనున్నట్లు వెల్లడించారు.

ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, తహసీల్దార్ సృజన్ కుమార్, ఎంపీడీవో వరుణ్ కుమార్, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## గ్రీవెన్స్ దరఖాస్తులను వేగవంతంగా పరిష్కరించండి

- బల్దియా కమిషనర్ టి.వెంకన్న

**వరంగల్ టౌన్, ఆగస్టు 17 (వుదయం ప్రతినిధి) :**



గ్రీవెన్స్ దరఖాస్తుల ను వేగవంతం గా పరిష్కరించాలని బల్దియా కమిషనర్ టి.వెంకన్న అధికారులను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమాన్ని పురస్కరించుకొని సోమవారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్ లో నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమం లో కమిషనర్ పాల్గొని సమర్థవంతంగా సమస్యల పరిష్కారానికి తగు సూచనలు చేశారు. అంతకు ముందు గత వారం గ్రీవెన్స్ లో స్వీకరించిన ఫిర్యాదుల పరిష్కార తీరును విభాగాల వారిగా అధికారులను అడిగి తెలుసుకొని పెండింగ్ లో ఉంచకూడదని ఆదేశించారు. ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తుల వివరాలు వివిధ విభాగాల వారిగా టౌన్ ప్లానింగ్ 35, ఇంజినీరింగ్ 26, హెల్త్ అండ్ శానిటేషన్ 11, రెవెన్యూ 07, నీటి సరఫరా 07, హార్టికల్చర్ 01ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ జోనా, సూపరింటెండింగ్ ఇంజనీర్ రాజ్‌కుమార్, ఇంచార్జి సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, డిప్యూటీ కమిషనర్లు ప్రసన్నరాణి, సమ్మయ్య, సెక్రటరీ అనిల్ బాబు, హార్టికల్చర్ అధికారి లక్ష్మారెడ్డి, పన్నుల అధికారి రామకృష్ణ తదితర అధికారులు పాల్గొన్నారు.

## తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి



**కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**

**సూర్యాపేట ఆగస్టు 17: వుదయం ప్రతినిధి**

ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సాగుతున్న ప్రజావాణి కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం అనంతరం జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా మరియు మండల స్థాయి ప్రజావాణి దరఖాస్తులను తప్పనిసరిగా ఆన్‌లైన్ పోర్టల్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని స్పష్టం చేశారు. ఇంకా పరిష్కారం కాకుండా ఉన్న దరఖాస్తులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. కొత్తగా వచ్చే దరఖాస్తులను వెంటనే పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. ముఖ్యంగా రాష్ట్ర ప్రజావాణిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను తక్షణమే పరిష్కరించేలా సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని తెలిపారు. ప్రజలు ఇచ్చిన అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అన్నారు. మండల స్థాయిలో ప్రారంభమైన ప్రజావాణి కార్యక్రమంపై కూడా కలెక్టర్ సమీక్షించారు. మండల స్థాయి ప్రజావాణికి అన్ని శాఖల మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరయ్యేలా జిల్లా అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. మండల స్థాయి సమస్యలు స్థానికంగానే పరిష్కారమైతే ప్రజలకు ఇబ్బందులు తప్పుతాయని ఆయన పేర్కొన్నారు.

ఈ వారం ప్రజావాణి గణాంకాలు

సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 95 దరఖాస్తులు అందాయి. వాటిలో భూ సమస్యలకు సంబంధించినవి: 43, డిపిఓ 8, డిడబ్ల్యుఓ 3, డిఎం అండ్ హెచ్ఓ 3, ఇతర శాఖలు 38, ఈ దరఖాస్తులను పరిష్కారానికి సంబంధిత శాఖలకు పంపించినట్లు కలెక్టర్ తెలిపారు. పాల్గొన్నవారు ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. హరి సింగ్, డిఆర్ఓ ప్రేమ్ రాజ్, జిల్లా పరిషత్ సీఈఓ శిరీష, డిఆర్డిఎ పిడి సన్యాసయ్య, డిఇఓ అశోక్, డిపిఓ యాదగిరి, డిఎఓ శ్రీధర్ రెడ్డి తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ప్రతీ ఫిర్యాదును పరిశీలించాలి

**జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**

**ఖమ్మం వుదయం బ్యూరో ఆగస్టు- 17**



ప్రజావాణిలో తమ సమస్యలు తెలుపుతూ ప్రజలు సమర్పించిన దరఖాస్తులను పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ లు డాక్టర్ పి. శ్రీజ, పి. శ్రీనివాస రెడ్డి లతో కలిసి ప్రజల అర్జీలను స్వీకరించారు. రఘునాధపాలెం మండలం పాపటపల్లి గ్రామానికి చెందిన చౌడవరపు దుర్గమ్మ తన కుమారుడు తనను అనేక బాధలు పెడుతున్నారని అతనిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా జిల్లా సంక్షేమ అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. కల్లూరు మండలం ఓబులరావు బంజర గ్రామానికి చెందిన భూక్యా మురళీ తాను శారీరకంగా దివ్యాంగుడినని తాను డిగ్రీ బీకాం కంప్యూటర్ చదివానని తనకు ఏదైనా ప్రభుత్వ శాఖలో ఔట్సోర్సింగ్ కాంట్రాక్ట్ ప్రాతిపదికన ఉపాధి కల్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, ఉపాధి అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. కొణిజర్ల మండలం మల్లుపల్లి గ్రామానికి చెందిన రైతులు సర్వేనెంబర్ 19 లో తమ పూర్వీకుల నుంచి వారసత్వంగా వ్యవసాయం సాగు చేసుకుంటున్నామని, సర్వే నెంబర్ 19 అటవీ భూమికి సరిహద్దున ఉన్నందున పట్టా పాస్ పుస్తకాలు రాలేదని, 1950 మ్యాపు ప్రకారం తమకు న్యాయం చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, తహసిల్దార్ కు రాస్తూ చర్యలు తీసుకోవాలని తెలిపారు. మిషన్ భగీరథ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ సభ్యులు తమకు నాలుగు నెలలుగా పెండింగ్ ఉన్న జీతాలు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, ఎస్ ఈ మిషన్ భగీరథకు రాస్తూ, అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. కూసుమంచి మండలం పాలేరు గ్రామానికి చెందిన కే. ఉపేందర్ తాను రెండు సంవత్సరాలుగా ర్యాపిడో బైక్ నడుపుకుంటున్నాని, ఎస్సీ కార్పొరేషన్ లో ఆటో కొరకు దరఖాస్తు చేసుకున్నానని చాలా పేదరికంలో ఉన్నానని తనకు ఆటో ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారికి రాస్తూ పరిశీలించి అవకాశం మేరకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో జెడ్పీ సీఈవో దీక్షా రైనా, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏఓ కె. శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు

# కరీంనగర్ |అదిలాబాద్ | నిజామాబాద్ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి...

**జగిత్యాల ఆగస్టు 17 (వుదయం ప్రతినిధి)**



ప్రజావాణి అర్జీల పై సమగ్ర విచారణ జరిపి సమస్యలను త్వరగా పరిష్కరించాలని అధికారులను జిల్లా కలెక్టర్ బి సత్య ప్రసాద్ అదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ ప్రజల నుండి ఫిర్యాదులు వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ మాట్లాడుతూ పలు సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని పలు మండలాల నుండి ప్రజలు సమస్యలు విన్నవించుకోడానికి ప్రజావాణికి వస్తారని అధికారులు వారి శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించడంతో పాటు సమస్యల పై సమగ్ర విచారణ చేపట్టి పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కాగా తేది 17 8 2026 సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 41 ఫిర్యాదులు వినతులు వచ్చాయని వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇక నుండి అన్ని ఫైల్స్ ఈ ఆఫీసు ద్వారా మాత్రమే పంపాలని జిల్లా అధికారులు జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ లు బిఎస్ లత బి రాజ గౌడ్ జిల్లా రెవెన్యూ అధికారి ప్రసాద్ సంబంధిత జిల్లా స్థాయి అధికారులు మున్సిపల్ కమిషనర్ లు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు నైపుణ్యాలపై ప్రత్యేక దృష్టి సారించాలి: కలెక్టర్

**పెద్దపల్లి (సుల్తానాబాద్) ఆగస్టు-17 (వుదయం ప్రతినిధి)**



విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు నైపుణ్యాలపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. సుల్తానాబాద్ మండలంలోని ఎం.జె.పి.టి.బి.సి.డబ్ల్యూ.ఆర్.ఐ.ఈ.ఎస్ బాలికల డిగ్రీ కళాశాలను జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కళాశాలలోని చాంబర్ ఆఫ్ డ్రీమ్స్ ను ప్రారంభించి,డార్మిటరీ, వంటగది, తరగతి గదులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారి విద్యాభ్యాసం, భవిష్యత్ లక్ష్యాలు, కెరీర్ అవకాశాల గురించి తెలుసుకున్నారు. విద్యార్థులు నాణ్యమైన విద్యతో పాటు భవిష్యత్ ఉపాధి అవకాశాలకు అవసరమైన నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. విద్యార్థులకు వారి ఆసక్తులు, సామర్థ్యాలకు అనుగుణంగా కెరీర్ గైడెన్స్ అందించాలని సూచించారు. ఉన్నత విద్య, వివిధ కోర్సులు, ఉద్యోగ అవకాశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని తెలిపారు. పీజీ కోర్సులకు సంబంధించిన అవకాశాలపై కూడా విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. జిల్లా కలెక్టరేట్ ద్వారా TASK సహకారంతో విద్యార్థులకు అవసరమైన మార్గదర్శకత్వం, శిక్షణ అందించేందుకు అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు. TASK రీజినల్ సెంటర్, V–Hub ద్వారా అందిస్తున్న వివిధ కోర్సులు, శిక్షణా కార్యక్రమాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు అకడమిక్స్‌తో పాటు సాఫ్ట్ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్ వంటి నైపుణ్యాలను కూడా అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఉపాధి అవకాశాలను పొందేందుకు నైపుణ్యాలు ఎంతో కీలకమని తెలిపారు. విద్యార్థులు తమ విద్యతో పాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు దోహదపడే నైపుణ్యాలను పెంపొందించుకోవాలని అన్నారు.కళాశాలలో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు అవసరమైన ప్రతిపాదనలు సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు, విద్యా సదుపాయాలను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీఓ మణిదీప్తి, కళాశాల ప్రిన్సిపాల్ వనజతో పాటు సంబంధిత అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రైతులు పంటల వైవిధ్యీకరణపై దృష్టి సారించాలి: కలెక్టర్

**మంచిర్యాల జిల్లా :**



రైతులు నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశానికి నీటి పారుదల శాఖ ఎస్.ఈ. విష్ణు ప్రసాద్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సురేఖలతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎల్‌నినో ప్రభావంతో తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం, భూగర్భ జలమట్టాలు తగ్గిపోవడం వంటి పరిస్థితుల నేపథ్యంలో రైతులు పంటల వైవిధ్యీకరణపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ప్రస్తుత ఖరీఫ్‌తో పాటు రానున్న రబీ సీజన్‌లోనూ నీటి లభ్యత విషయంలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉన్నందున రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ప్రస్తుతం ప్రాజెక్టులు, రిజర్వాయర్లలో అందుబాటులో ఉన్న నీటిని మొదటి ప్రాధాన్యతగా త్రాగునీటి అవసరాలకు వినియోగించాల్సిన పరిస్థితి ఉందని, గొల్లవాగు ప్రాజెక్టుతో పాటు ఇతర ప్రాజెక్టుల లోనూ వరి సాగుకు అవసరమైన స్థాయిలో నీరు అందుబాటులో ఉండే అవకాశం లేదని తెలిపారు. వరి పంటకు ఒక ఎకరాకు అవసరమయ్యే నీటితో సమానమయ్యే నీటిని వినియోగించి సుమారు 3 నుంచి 4 ఎకరాలలో ఆరుతడి పంటలను సాగు చేయవచ్చని తెలిపారు. ప్రస్తుత పరిస్థితులలో రైతులు వరి నాట్లు వేస్తే పంటకు అవసరమైన నీరు పూర్తిస్థాయిలో అందకపోవడంతో పంట ఎండిపోయే ప్రమాదం, దిగుబడి తగ్గడం, ధాన్యం నాణ్యత దెబ్బతినడం వంటి సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉందన్నారు. నీటి కొరత కారణంగా వరి గింజ పరిమాణం తగ్గి, దిగుబడి తగ్గడంతో పాటు పంటను మార్కెట్‌లో విక్రయించడంలోనూ రైతులు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితులు ఉన్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో మొక్కజొన్న, కంది, పెసలు, మినుములు, అలసందులు వంటి తక్కువ నీటితో సాగు చేయగల పంటలను రైతులు ఎంచుకోవాలని, ఈ పంటలకు అవసరమైన మేరకు నీటిని అందించగలిగే అవకాశం ఉన్నందున పంటలు విజయవంతంగా సాగయ్యే అవకాశం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. పప్పుధాన్యాల సాగును ప్రోత్సహించేందుకు రైతులకు అవసరమైన విత్తనాలను కూడా అందించే చర్యలు చేపడుతున్నామని తెలిపారు. మొక్కజొన్న, కంది, పెసలు, మినుములు తదితర పంటలకు ప్రభుత్వం కనీస మద్దతు ధర కల్పిస్తోందని, మొక్కజొన్నకు బహిరంగ మార్కెట్‌లో గరిష్ట మద్దతు ధర కంటే ఎక్కువ ధర లభిస్తున్న సందర్భాలు కూడా ఉన్నాయని తెలిపారు. నీటి లభ్యత, వర్షపాతం పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని జూన్ 1వ తేదీ నుంచే రైతులకు పంటల ఎంపికపై అవగాహన కల్పిస్తున్నామని, అయినప్పటికీ కొంతమంది రైతులు వరి సాగు చేయాలని నిర్ణయిస్తే భవిష్యత్తులో నీటి కొరత కారణంగా ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని తెలిపారు. భూగర్భ జలమట్టాలు తగ్గిన నేపథ్యంలో బోర్లపై ఆధారపడే రైతులు సైతం నీటి సమస్యను ఎదుర్కొనే అవకాశం ఉందని, రైతులు పరిస్థితులను అంచనా వేసి నీటి లభ్యతకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. ప్రస్తుత నీటి పరిస్థితులపై రైతులకు వాస్తవ పరిస్థితిని వివరించి, పంటల వైవిధ్యీకరణపై అవగాహన కల్పించడంలో మీడియా సంస్థలు కూడా భాగస్వాములు కావాలని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా, దేశ వ్యాప్తంగా అనేక ప్రాంతాలలో నీటి లభ్యత, వర్షపాతం విషయంలో అనిశ్చిత పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో రైతులు ముందస్తు ప్రణాళికతో సాగు చేపట్టడం అవసరమని తెలిపారు. అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగిస్తూ ఎక్కువ విస్తీర్ణంలో పంటలు పండించాలంటే వరికి బదులుగా తక్కువ నీటితో సాగు చేసే పంటలను ఎంచుకోవాలని, ప్రస్తుత పరిస్థితులలో వరి సాగు చేసి నీటి కొరతతో పంట నష్టపోయే కంటే మొక్కజొన్న, కంది, పెసలు, మినుములు, అలసందులు వంటి పంటలను సాగు చేయడం రైతులకు ప్రయోజనకరమని తెలిపారు. రైతులు నీటి లభ్యతను ముందుగానే అంచనా వేసుకొని, వ్యవసాయ, వ్యవసాయ విస్తరణ, సాగునీటి శాఖల అధికారుల సూచనలు పాటిస్తూ పంటలను ఎంపిక చేసుకోవాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, పాత్రికేయులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను వెంట వెంటనే పరిష్కరించాలి:

**జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు.**



**నిర్మల్ జిల్లా 17 ఆగస్ట్ 2026 (వుదయం ప్రతినిధి)**

ప్రజావాణి దరఖాస్తులను వెంటవెంటనే పరిష్కరించాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పాల్గొన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఆయన స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆయా శాఖల అధికారులు ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, తక్షణమే స్పందించాలని అధికారులకు సూచించారు. మండలాల వారీగా పెండింగ్లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులకు సంబంధించి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రజల సమస్యలను సంబంధిత శాఖలు సమన్వయంతో పరిష్కరించేలా పనిచేయాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా, ప్రజలు విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు, భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తులను కలెక్టర్ కు సమర్పించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో అదనపు (రెవెన్యూ) కిషోర్ కుమార్, డిఆర్ఓ రాథోడ్ రమేష్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## బడులలో అసంపూర్తి పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయించాలి

**నాణ్యతా ప్రమాణాలు పాటించని కాంట్రాక్టర్ లను బ్లాక్ లిస్టులో పెడతాం**

**వారం రోజుల్లోపు ఏకరూప దుస్తులు పంపిణీ చేయాలి**

**కలెక్టర్ తో కలిసి అధికారులతో సమీక్ష నిర్వహించిన ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి**

**నిజామాబాద్, ఆగస్టు 17 :**



ప్రభుత్వ విద్యా సంస్థలలో మౌలిక సదుపాయాలను మరింతగా మెరుగుపర్చేందుకు వీలుగా చేపట్టిన పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయించాలని ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని స్టేట్ చాంబర్ లో సోమవారం ఆయన కలెక్టర్ భవేష్ మిశ్రాతో కలిసి వివిధ శాఖల పనితీరుపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. వివిధ పాఠశాలల్లో పెండింగ్ లో ఉన్న అసంపూర్తి పనులను గుర్తించి, విద్యార్థుల సంఖ్య, స్థానిక అవసరాలకు అనుగుణంగా ప్రాధాన్యతా క్రమంలో చేపట్టి పూర్తి చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఎక్కడ కూడా తాగునీరు, టాయిలెట్స్ వంటి సమస్యలు లేకుండా చూడాలన్నారు. విద్యార్థుల ప్రయోజనాల విషయంలో ఎంతమాత్రం రాజీ పడకూడదని, నూటికి నూరు శాతం పనులు నాణ్యతతో జరిగేలా పకడ్బందీ పర్యవేక్షణ చేయాలన్నారు. నాణ్యతా ప్రమాణాలు పాటించని కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో పెట్టాలని అధికారులకు సూచించారు. పెండింగ్ పనులను పూర్తి చేసేందుకు అవసరమైన నిధుల విషయమై ఉన్నతాధికారులను సంప్రదించి మంజూరు చేయిస్తానని తెలిపారు. అయితే పనులను పూర్తి చేయించే విషయంలో నిర్లక్ష్యం వహించకుండా, విద్యార్థులకు అన్ని సదుపాయాలు అందుబాటులో ఉండేలా చూడాలని హితవు పలికారు. మరుగుదొడ్లు, మూత్రశాలల నిర్మాణాలు, మరమ్మతుల కోసం వీబీజీరాంజీ పథకం కింద ప్రతిపాదనలు పంపాలని, నిధులను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకునేలా చొరవ చూపాలన్నారు. జిల్లాలోని అన్ని పాఠశాలల విద్యార్థిని, విద్యార్థులకు వారం రోజుల్లోపు ఏకరూప దుస్తులు (యూనిఫాంలు) పంపిణీ జరిగేలా చర్యలు తీసుకోవాలని, స్వయం సహాయక సంఘాల ద్వారా యూనిఫాంలను వేగవంతంగా కుట్టించాలని ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి సూచించారు. ఉపాధ్యాయుల కొరత నెలకొని ఉన్న బడులలో ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా బోధకులను ఏర్పాటు చేసి, విద్యార్థులకు నాణ్యమైన విద్యను బోధించేలా కృషి చేయాలన్నారు. పౌర సరఫరాల శాఖ పనితీరును సమీక్షిస్తూ, డిఫాల్ట్ రైస్ మిల్లర్లపై చేపట్టిన చర్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు ఎంత మంది నుండి ఏమేరకు బకాయిలు రాబట్టగలిగారు, ఇంకా ఎంత మంది సీ.ఎం.ఆర్ కు సంబంధించిన బకాయిలు చెల్లించేందుకు సముఖంగా ఉన్నారు తదితర వివరాలను ఆరా తీశారు. బకాయిలు చెల్లించని మిల్లర్లకు నోటీసులు జారీ చేసి, రెవెన్యూ రికవరీ యాక్టు కింద కేసులు నమోదు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. పంచాయతీ శాఖ పనితీరును సమీక్షిస్తూ, ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో పారిశుధ్యం పనులు, తాగునీటి సరఫరా సక్రమంగా జరిగేలా రోజువారీగా పకడ్బందీ పర్యవేక్షణ చేయాలన్నారు. ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించే పంచాయతీ కార్యదర్శులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. నిజామాబాద్ నగర పాలక సంస్థ పరిధిలోనూ ఇంటింటి చెత్తను వెంటదివెంట తరలించేందుకు వీలుగా డంపింగ్ యార్డ్ మల్టిపుల్ పాయింట్స్ ను ఏర్పాటు చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్ కు సూచించారు.

సమీక్షా సమావేశంలో జెడ్పీ సీ.ఈ.ఓ సాయాగౌడ్, డీ.ఆర్.డీ.ఓ సాయన్న, డీ.ఎస్.ఓ శ్రీకాంత్ రెడ్డి, సివిల్ సప్లైస్ డీ.ఎం ప్రవీణ్, డీ.ఈ.ఓ పి.అశోక్, డీ.పీ.ఓ శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.

## అర్జీలను సత్వరం పరిష్కరించాలి

**ప్రజావాణిలో 136 దరఖాస్తులు**

**కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశం**

**రాజన్న సిరిసిల్ల ఆగస్టు 17 (వుదయం ప్రతినిధి):**



ప్రజావాణిలో ప్రజలు సమర్పించిన అర్జీలను పరిశీలించి సత్వరం పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ) ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు ప్రజలు సమర్పించిన అర్జీలను సంబంధిత శాఖల అధికారులకు అందజేసి, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సూచించారు. అధికారులు బాధ్యతగా వ్యవహరించి పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు దరఖాస్తులను పరిష్కరించాలని ఆదేశించారు.ఆర్డీఓ కార్యాలయాల్లో 9.సిరిసిల్ల ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో రెండు, వేములవాడ ఆర్డీఓ కార్యాలయంలో ఏడు దరఖాస్తులు వచ్చాయి. మొత్తం తొమ్మిది అర్జీలను సంబంధిత అధికారులకు పంపించి పరిష్కరించాలని ఆదేశించారు, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని మండలాల ఎంపీడీఓ కార్యాలయాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజావాణి నిర్వహించారు. మండలాల వారీగా బోయినపల్లి 11, చందుర్తి 2, ఇల్లంతకుంట 7, గంభీరావుపేట 7, కోనరావుపేట 15, ముస్తాబాద్ 18, రుద్రంగి 0, తంగళ్లపల్లి 20, వీర్నపల్లి 8, వేములవాడ అర్బన్ 7, వేములవాడ రూరల్ 5, ఎల్లారెడ్డిపేట 7 దరఖాస్తులు వచ్చాయి. ఎంపీడీఓ కార్యాలయాల్లో మొత్తం 107 అర్జీలు స్వీకరించారు,ఐడీఓసీతో పాటు సిరిసిల్ల, వేములవాడ ఆర్డీఓ కార్యాలయాలు, అన్ని ఎంపీడీఓ కార్యాలయాల్లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. స్థానికంగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి అర్జీలు సమర్పించాలన్నారు. స్వీకరించిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జయశ్రీ, జడ్పీ సీఈవో వెంకట మాధవరావు, ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్ నిఖిత తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

**అధికారులు సమన్వయంతో క్షేత్రస్థాయిలో పరిశీలించాలి: కలెక్టర్**

**ఆసిఫాబాద్, ఆగస్టు 17 (వూదయం ప్రతినిధి):**



ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, త్వరితగతిన పరిష్కరించేలా అధికారులు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ కె. హరిత ఆదేశించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం. డేవిడ్, జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణుతో కలిసి అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు అర్జీదారులు తమ సమస్యల పరిష్కారం కోరుతూ దరఖాస్తులు అందజేశారు. ఆసిఫాబాద్ మండలం పర్సానంబాల గ్రామానికి చెందిన దుర్గం హనుమంతు తాను సాగు చేస్తున్న భూమికి పట్టాదారు పాస్ పుస్తకం జారీ చేయాలని కోరారు. కాగజ్‌నగర్ మండలం అంకుషాపూర్ కు చెందిన సోగాల కోమల్ జనకాపూర్ శివారులోని తన పట్టా భూమిని కొలతలు నిర్వహించి హద్దులు నిర్ధారించాలని కోరారు.జిల్లా కేంద్రంలోని జనకాపూర్ కు చెందిన సొన్నాయిల మానస దివ్యాంగుల పింఛన్ మంజూరు చేయాలని దరఖాస్తు సమర్పించారు. కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన కాంపెల్లి రవీందర్ తన కుమారుడికి గురుకుల పాఠశాలలో సీటు ఇప్పించాలని కోరారు. మంచిర్యాల జిల్లా కేంద్రానికి చెందిన ఎస్. భాస్కర్‌రావు దహేగాం మండలం లగ్గాం గ్రామ శివారులో ఉన్న తన భూములకు పట్టాదారు పాస్‌పుస్తకాలు జారీచేయాలనికోరుతూదరఖాస్తు అందజేశారు. ఆసిఫాబాద్ మండలం రహపల్లి గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ పి. శ్రీనివాస్ తాను సర్పంచ్‌గా పనిచేసిన కాలానికి సంబంధించిన పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరారు.

## ప్రజావాణి దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించాలి

**జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్**

**కామారెడ్డి, ఆగస్టు 17 (వుదయం ప్రతినిధి):**



ప్రజావాణి కార్యక్రమానికి వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించి, అర్హత మేరకు త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కామారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, అదనపు కలెక్టర్లు వి. విక్టర్, ఎన్.వై. గిరి, శిక్షణ కలెక్టర్ రవితేజ ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా మొత్తం 52 ఫిర్యాదులు అందాయి. ప్రజలు సమర్పించిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖల అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. దరఖాస్తుదారులకు న్యాయం జరిగేలా పారదర్శకంగా విచారణ నిర్వహించి, నిర్ణీత సమయంలో సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు.ప్రజావాణి ద్వారా అందిన దరఖాస్తులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, క్షేత్రస్థాయిలో పరిశీలన అవసరమైన అంశాలను స్వయంగా పరిశీలించాలని కలెక్టర్ తెలిపారు. పరిష్కరించిన దరఖాస్తుల వివరాలను సంబంధిత రికార్డుల్లో నమోదు చేసి, దరఖాస్తుదారులకు సమాచారం అందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## తులం బంగారం ఎగ్గొట్టేందుకే కల్యాణలక్ష్మికి ఎసరు

**హైకోర్టు తీర్పు సాకుతో పేదింటి ఆడబిడ్డలకు ద్రోహం**

**ధర్మపురిలో గులాబీ శ్రేణుల భారీ రాస్తారోకో**

**ధర్మపురి ఆగస్ట్17(వుదయం ప్రతినిధి):**



పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు ఆర్థిక భరోసానిచ్చే కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను ఎత్తివేసేందుకు కాంగ్రెస్ ప్రభు త్వం కుట్ర చేస్తోందని బీఆర్ఎస్ నాయకులు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆదేశాల మేరకు ధర్మపురి నియోజకవర్గ కేంద్రంలోని స్థానిక అంబేడ్కర్ చౌరస్తా వద్ద బీఆర్ ఎస్ శ్రేణులు భారీ రాస్తారోకో నిర్వహించాయి.కాంగ్రెస్ ప్రభు త్వ మొండి వైఖరి నశించాలం టూ నినదించారు.ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కనువిప్పు కలగాలని కోరుతూ డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి,అనంత రం సమస్యను ప్రభుత్వం దృష్టి కి తీసుకెళ్లాలని తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ధర్మపురి మండల కన్వీనర్ అయ్యోరి రాజేశ్‌మాట్లా డుతూ కాంగ్రెస్ సర్కార్ వైఖరిపై విరుచుకుపడ్డారు.ఎన్నికల వేళ కల్యాణలక్ష్మితో పాటు తులం బంగారం ఇస్తామని ప్రగల్భాలు పలికిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అసలు పథకాన్నే ఎత్తేసేందుకు హైకోర్టు తీర్పును సాకు గా వాడుకుంటోందని మండిప డ్డారు.లబ్ధిదారులు తులం బం గారం ఎక్కడ అడుగుతారోనన్న భయంతోనే ఈ పథకానికి మంగ ళం పాడేందుకు తెరవెనుక కుట్రలు పన్నుతోందని ఆరోపించారు.కోట్ల ఫీజుల ప్రైవేటు లాయర్లు పేదల పథకానికి ఎందుకు లేరు అని ప్రశ్నించారు.ముఖ్యమంత్రి, మంత్రుల అవినీతి ఆరోపణల కేసుల కోసం కోట్ల రూపాయల ప్రజాధనాన్ని వెచ్చించి ప్రైవేటు లాయర్లను పెట్టుకుంటున్న ప్రభుత్వం పేద ఆడబిడ్డల ఆత్మగౌరవంతో ముడిపడిన కల్యాణలక్ష్మి విషయంలో హైకోర్టులో ఎందుకు కౌంటర్ దాఖలు చేయలేదని నిలదీశారు.న్యాయస్థానం నాలుగు సార్లు గడువు ఇచ్చినా ఉద్దేశ పూర్వకంగానే సరైన వాదనలు వినిపించకుండా నిర్లక్ష్యం వహించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.తెలంగాణ ఏర్పడిన తర్వాత నాటి సీఎం కేసీఆర్ ఆడబిడ్డల కన్నీళ్లు తుడిచేందుకు రూ.51 వేలతో ప్రారంభించి, దశలవారీగా రూ.1,00,116 కు పెంచి దాదాపు 13 లక్షల కుటుంబాలకు రూ.13 వేల కోట్ల మేర సాయం అందించారని గుర్తుచే శారు. కాంగ్రెస్



రాగానే ఆగిపో యిందని ఆవేదన వ్యక్తం చేశారు. నేడు పెళ్లిళ్లు జరిగి పిల్లలు పుట్టినా కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన దుస్థితి దాపురించిందని, ఆమోదం పొందిన చెక్కులను కూడా పంపిణీ చేయకుండా నిలిపివేశారని ఆరోపించారు. తక్షణమే పెండింగ్ దరఖాస్తులన్నింటినీ పరిష్కరించి నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ సంగి సత్తెమ్మ, వివిధ మండలాల తాజా మాజీ అధ్యక్షులు గాలి పెల్లి మహేశ్, చల్లూరి రాంచందర్ గౌడ్,సింహాచలం జగన్, రాచూ రి శ్రీధర్, గోస్కుల జలంధర్, లోక మల్లారెడ్డి, పట్టణ కన్వీనర్ బండారి రంజిత్, సీనియర్ నాయకులు ఒడ్నాల మల్లేశం, సంగి శేఖర్, చిలువేరి శ్యామ్‌సుం దర్, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, కౌన్సిలర్లు, భారీ సంఖ్యలో పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# మహబూబ్ నగర్ | మెదక్ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## సంగారెడ్డి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం

**సంగారెడ్డి, ఆగస్టు 17:వుదయం:**
సంగారెడ్డి మండల ప్రజా పరిషత్ (ఎంపీపీ) కార్యాలయంలో సోమవారం ప్రజావాణి-ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి వివిధ సమస్యలు, ఫిర్యాదులు, వినతులను అధికారులు స్వీకరించి పరిశీలించారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకువచ్చేలా కార్యక్రమాన్ని నిర్వహిస్తూ, ప్రతి ఫిర్యాదును నమోదు చేసి సంబంధిత శాఖల ద్వారా త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో ఎలాంటి జాప్యం లేకుండా, అర్హతలు మరియు నిబంధనల మేరకు ప్రతి ఫిర్యాదును పరిశీలించి తగిన చర్యలు చేపట్టాలని, అవసరమైన సందర్భాల్లో సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు.



ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారి సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించేందుకు మండల స్థాయిలో నిరంతరం చర్యలు చేపడుతున్నట్లు మండల ప్రజా పరిషత్ అధికారులు తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యంగా నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

## కళ్యాణ లక్ష్మి ,షాదీ ముబారక్ పథకాలను కొనసాగించాలి

**మహబూబ్ నగర్ ఆగస్టు 17 (వుదయం ప్రతినిధి)**



కళ్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ పథకాలను కొనసాగించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ శ్రేణులు భూత్పూర్ మండల కేంద్రంలో సోమవారం ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా అన్ని వర్గాలను మోసం చేస్తూ బీఆర్ఎస్ ప్రవేశపెట్టిన పథకాలను ఎత్తేయాలని చూస్తుందని దీనిని బిఆర్ఎస్ నాయకులు ఖండించి వెంటనే పథకాలు అమలు చేసే ఆందోళనలు కొనసాగిస్తామని ఆయన ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు.
కళ్యాణ లక్ష్మి,షాది ముబారక్ నిరుపేద ఆడపిల్లల పెళ్లిళ్ల కోసం కేసీఆర్ ప్రవేశపెట్టిన గొప్ప పథకమని,ఆడపిల్ల పెళ్లి కోసం ఇబ్బంది పడుతున్న అనేక కుటుంబాలకు ఆర్థిక భరోసా ఇచ్చి ,లక్షలాది కుటుంబాలు ఈ పథకం ద్వారా లబ్ధి పొందాయని గుర్తు చేశారు. ఎన్నికల సమయంలో తులం బంగారం అదనంగా ఇస్తామన్న కాంగ్రెస్ ఇప్పుడు పథకం పూర్తిగా ఎత్తేయాలని చూస్తుంది అని,కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పథకాలు ఖచ్చితంగా కొనసాగించాలని లేకపోతే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా ఆగ్రహానికి గురికాక తప్పదన్నారు.దేవరకద్ర నియోజకవర్గంలోనే తొమ్మిది వేల మంది ఆడపిల్లలకి కళ్యాణ లక్ష్మి,షాది ముబారక్ చెక్కులను అందచేసిన ఘనత గత ప్రభుత్వంలో కేసీఆర్ కే దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో బి. ఆర్. ఎస్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆరుతడి, ప్రత్యామ్నాయ పంటల సాగుకే ప్రాధాన్యత

**వనపర్తి ఆగస్టు 17 (వుదయం ప్రతినిధి)**
జిల్లాలో నీటి లభ్యత తక్కువగా ఉన్న ప్రాంతాల్లో మినుములు, వేరుశెనగ, మొక్కజొన్న, ఆముదం వంటి ఆరుతడి పంటలకు రైతులు ప్రాధాన్యత ఇవ్వాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఖీమ్యా నాయక్ సూచించారు.సోమవారం అదనపు కలెక్టర్ తన ఛాంబర్ లో జిల్లా వ్యవసాయ అధికారి అంజనేయులుతో కలిసి ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించేందుకు రూపొందించిన పోస్టర్లను ఆవిష్కరించారు.



ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, నీటి లభ్యత తక్కువగా ఉన్న ప్రాంతాల్లో మినుములు, వేరుశెనగ, మొక్కజొన్న, ఆముదం వంటి ఆరుతడి పంటలకు రైతులు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. తక్కువ నీటితో సాగు చేసే పంటల ద్వారా నీటి వనరులను కాపాడటంతో పాటు రైతులకు నష్టం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవచ్చని తెలిపారు.అలాగే కంది - మినుములు, ఆముదం - మినుములు, మొక్కజొన్న- మినుములు వంటి అంతర పంటల సాగును రైతులు చేపట్టేలా ప్రోత్సహించాలని అధికారులకు సూచించారు. ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగుపై క్షేత్రస్థాయిలో విస్తృతంగా అవగాహన కల్పించాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. వ్యవసాయ శాఖ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు రైతులకు అందుబాటులో ఉండి, నీటి లభ్యత, నేల పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపికపై అవసరమైన సూచనలు అందించాలని తెలిపారు.రైతులు రానున్న నీటి కొరత పరిస్థితులను అంచనా వేసుకుని తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకోవాలని అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ సూచించారు.
ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి అంజనేయులు, జిల్లా ఉద్యాన శాఖ అధికారి విజయభాస్కర్, డి ఎల్ పి ఓ రఘునాథ్, హౌసింగ్ పీడీ విఠోబా, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సిద్దిపేటలో బీఎంఎస్ ఆధ్వర్యంలో భారీ ధర్నా

- **కార్మిక సమస్యలను వెంటనే పరిష్కరించాలి**
- **బీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కలాల్ శ్రీనివాస్**

**వుదయం, సిద్దిపేట ప్రతినిధి**



కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) ఆధ్వర్యంలో సోమవారం సిద్దిపేట జిల్లా కలెక్టరేట్ ఎదుట భారీ ధర్నా నిర్వహించారు. బీఎంఎస్ 161వ కేంద్ర కార్యవర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు దేశవ్యాప్తంగా జిల్లా కేంద్రాల్లో నిర్వహిస్తున్న నిరసనల్లో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టారు.ధర్నాకు ముఖ్య అతిథిగా హాజరైన బీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కలాల్ శ్రీనివాస్ మాట్లాడుతూ...కార్మికుల హక్కులు, సమస్యల పరిష్కారం కోసం బీఎంఎస్ నిరంతరం పోరాటం చేస్తోందన్నారు. ఎమ్మెల్యేలు, ఎంపీల వేతనాలు, పెన్షన్లు పెరుగుతున్నా..కార్మికుల వేతనాలు, పెన్షన్ల విషయంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని విమర్శించారు. కార్మికుల సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే స్పందించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.ఈపీఎస్ కనీస పెన్షన్‌ను రూ.1,000 నుంచి రూ.7,500కు పెంచాలని, తెలంగాణలో కనీస వేతనాన్ని రూ.30 వేలకు పెంచాలని కోరారు. బీడీ కార్మికులకు రూ.4,016 జీవనభృతిని ఎలాంటి ఆంక్షలు లేకుండా అందరికీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. అసంఘటిత కార్మికుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలని కోరారు.ఆశా, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన కార్మికులు తదితర స్కీమ్ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి సామాజిక భద్రతతో పాటు పెన్షన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈఎస్ఐ, పీఎఫ్ సీలింగ్‌ను రెండింతలు చేయాలని, కార్మికులకు అనుకూలంగా లేబర్ కోడ్లు, ఓఎస్‌హెచ్ అండ్ డబ్ల్యూసీ, పారిశ్రామిక చట్టాల్లో మార్పులు చేయాలని కోరారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్‌కు బీఎంఎస్ నాయకులు సమర్పించారు. సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే రాబోయే రోజుల్లో మరింత పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని నాయకులు హెచ్చరించారు.కార్యక్రమంలో బీఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బోలెక్కేశ్వరి, జిల్లా అధ్యక్షులు చామకూరి రాజయ్య, ప్రధాన కార్యదర్శి ముద్దం రాజిరెడ్డి, బీడీ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి కందికొండల్ రెడ్డి, దొంతుల మల్లేశం, వసంత, లక్ష్మి, బుచ్చిలింగం, విష్ణు, రాజు, చల్ల శీను, కృష్ణమూర్తి, శీను తదితర నాయకులు, బీడీ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్‌లో భాగంగా డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా విడుదల

- **సెప్టెంబర్ 16 వరకు క్లెయిమ్స్, అభ్యంతరాలు స్వీకరణ**

**నాగర్ కర్నూల్, ఆగస్టు 17, వుదయం బ్యూరో:**



భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ SIR ప్రక్రియలో భాగంగా జిల్లాలోని నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కొల్లాపూర్ మూడు అసెంబ్లీ నియోజకవర్గాల డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ సోమవారం విడుదల చేశారు.910 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన డ్రాఫ్ట్ జాబితాను కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ప్రకటించారు.డ్రాఫ్ట్ ప్రకారం జిల్లాలో మొత్తం 6,18,592 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో 3,11,395 మంది పురుషులు, 3,07,182 మంది మహిళలు, 15 మంది ఇతరులు, 579 మంది సర్వీస్ ఓటర్లు ఉన్నారు.ఆగస్టు 17 నుంచి సెప్టెంబర్ 16 వరకు క్లెయిమ్స్, అభ్యంతరాలు స్వీకరించి, అక్టోబర్ 19న తుది ఓటర్ల జాబితాను విడుదల చేస్తామని కలెక్టర్ తెలిపారు.ఓటర్లు తమ పేరు, చిరునామా వివరాలను తప్పనిసరిగా పరిశీలించుకోవాలని, అర్హత ఉన్నా పేరు లేనివారు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## మాఫియా హస్తం...రోగికి రిక్తహస్తం!

- **గద్వాలలో దందాగా మారిన 'ఔషధం': జనరిక్‌కు బ్రాండెడ్ బాదుడు.. చీటీ లేకుండానే ప్రాణాలతో చెలగాటం!**

**గద్వాల ఆగస్టు 17 (వుదయం బ్యూరో)**



రోగం వస్తే ప్రాణాలు నిలుపుకోవడానికి వెళ్లే సామాన్యుడి బలహీనతను ఆసరాగా చేసుకుని, గద్వాలలో మెడికల్ మాఫియా సాగిస్తున్న 'ప్రాణాల వ్యాపారం' పరాకాష్టకు చేరింది. ఔషధాల పేరిట సాగుతున్న ఈ దోపిడీ కేవలం ఆర్థిక శోషణ మాత్రమే కాదు,నేరుగా ప్రజారోగ్యంపై జరుగుతున్న నరమేధం! అధికారుల అండదండలు, మామూళ్ల మత్తులోనే ఈ అక్రమ సామ్రాజ్యం ఎలాంటి భయం లేకుండా విస్తరిస్తోందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**రక్తపింజరుల్లాంటి అక్రమాలు:**
దోపిడీకి 'బ్రాండెడ్' రంగు: సామాన్యుడికి తక్కువ ధరకు అందాల్సిన జనరిక్ మందులను, బ్రాండెడ్ ఉత్పత్తుల ముసుగులో వందల రెట్ల అధిక ధరకు విక్రయిస్తున్నారు. పాంటోప్రాజోల్ వంటి ప్రాథమిక ఔషధాల వద్దే నిలువుదోపిడీ చేస్తూ, పేదల జేబులు గుల్ల చేస్తున్నారు.చీటీ లేకపోతే ఏంటి? ప్రాణాలతో చెలగాటమే!: డాక్టర్ ప్రిస్క్రిప్షన్ అనే కనీస నిబంధనను కూడా కాలరాస్తున్నారు. మెడికల్ షాపు నిర్వాహకులే సుడో డాక్టర్లు'గా మారి, ఏ వ్యాధికి పడితే ఆ మందులు ఇచ్చేస్తూ రోగులను మృత్యుముఖంలోకి నెడుతున్నారు.బిల్లుల ఎగవేత - నేరాలకు తెల్లకాగితం: కొనుగోలు చేసిన మందులకు పక్కా బిల్లు ఇవ్వడం లేదు. దీనివల్ల కాలంచెల్లిన (ఎక్స్‌పైరీ) మందులు విక్రయించినా, వికటించి ప్రాణాలు పోయినా అడిగే నాథుడే లేకుండా బాధ్యత నుంచి తప్పుకుంటున్నారు. కమీషన్ల కోసం కక్కుర్తి: మందుల కంపెనీలు ఇచ్చే కమీషన్లు, విదేశీ పర్యటనల ఆశకు కక్కుర్తి పడి రోగికి అవసరం లేని మందులను కూడా అంటగడుతూ వ్యాపార దాహాన్ని తీర్చుకుంటున్నారు. ఔషధ నియంత్రణ శాఖ నిద్రపోతోందా? మామూళ్ల మత్తులో ఉందా? నిబంధనలు ఉల్లంఘిస్తున్న దుకాణాలపై ఉక్కుపాదం మోపాల్సిన ఔషధ నియంత్రణ శాఖ అధికారులు తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారు. తనిఖీలు కేవలం 'మామూళ్ల' వసూళ్లకే పరిమితమయ్యాయా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రజాప్రతినిధులు,అధికారుల అలసత్వం చూస్తుంటే ప్రజల ప్రాణాలంటే వీరికి అంత చౌకబారాయా అనే ఆగ్రహం కలుగుతోంది. తక్షణ ఉక్కుపాదం తప్పదు! విభాగం తీసుకోవాల్సిన కఠిన

**చర్య జిల్లా కలెక్టర్ ఔషధ నియంత్రణ శాఖ**
తక్షణమే ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలతో ఆకస్మిక దాడులు జరిపి, ఉల్లంఘనుల లైసెన్సులను శాశ్వతంగా రద్దు చేసి, క్రిమినల్ కేసులు పెట్టాలి. ప్రభుత్వ రక్షణప్రజలకు నాణ్యమైన, చౌకైన మందులు లభించేలా 'జనౌషధి' కేంద్రాలను వెంటనే విస్తరించాలి. వినియోగదారులుడాక్టర్ చీటీ లేకుండా మందులు కొనడం మానాలి. బిల్లు నిరాకరించే దుకాణాలపై అధికారులకు వెంటనే ఫిర్యాదు చేయాలి మెడికల్ మాఫియా పీచమణచకపోతే, గద్వాల జిల్లా ప్రజల ప్రాణాలకు రక్షణ లేకుండా పోతుంది. జిల్లా యంత్రాంగం ఇప్పటికైనా నిద్రలేచి ఈ అక్రమ దందాపై ఉక్కుపాదం మోపుతుందో లేదో వేచి చూడాలి!

## డిజిటల్ డొల్లతనం.. జనం విలవిల!

- **రవాణా శాఖ కార్యాలయంలో అంతర్జాల 'కోత'.. నడిరోడ్డుపై ప్రజా సేవలు!**
- **'సమయం' కేటాయించినా దక్కని సేవ.. గద్వాల కార్యాలయంలో సాంకేతిక వ్యవస్థ ఘోర వైఫల్యం**
- **గంటల తరబడి పడిగాపులు.. రూ.వందలు తగలేసి వెనుదిరిగిన బాధితులు**
- **ప్రత్యామ్నాయ సదుపాయం కరువై శతకోటి తిప్పలు.. అధికారుల ఉదాసీనతపై ప్రజాగ్రహం!**

**గద్వాల ఆగస్టు 17 (వుదయం కరస్పాండెంట్)**



చెప్పేవి శ్రీరంగ నీతులు.. చేసేవి ఘోర విఫల యత్నాలు! ఆధునిక విప్లవం, వేగవంతమైన సేవలంటూ పాలకుల గొప్పలు ఒకవైపు.. తీరా క్షేత్రస్థాయికి వస్తే చిన్న సాంకేతిక లోపానికి విలవిలలాడే చేతకాని వ్యవస్థలు మరోవైపు! జోగులాంబ గద్వాల జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో సోమవారం ప్రత్యక్షమైన దృశ్యాలివి. ప్రధాన సమాచార వ్యవస్థ ఘోర వైఫల్యంతో కీలక సేవలన్నీ నడిరోడ్డుపై పడ్డాయి. ఆన్‌లైన్ వ్యవస్థ మొరాయించడంతో వందలాది మంది ప్రజలు, వాహనదారులు గంటల తరబడి చుక్కలు చూడాల్సి వచ్చింది. వ్యవస్థలు కట్.. సేవలు అటకెక్కాయ్! అంతర్జాల అనుసంధానం తెగిపోవడంతో అభ్యాసన చోదక పత్రాల (లెర్నింగ్ లైసెన్స్) జారీ, డ్రైవింగ్ పరీక్షలు, నూతన వాహనాల నమోదు, యాజమాన్య బదిలీలన్నీ నిలిచిపోయాయి. వారాల తరబడి వేచి చూసి, ముందుగానే కాసులు చెల్లించి సమయం పొందిన దరఖాస్తుదారులకు అధికారుల వైఖరి తీవ్ర మానసిక నరకాన్ని చూపించింది. అధికారులు చేతులెత్తేసి నిమ్మకు నీరెత్తినట్లు కూర్చోవడంతో బాధితుల ఆక్రోశం అంబరాన్నంటింది.రెక్కాడితే గానీ డొక్కాడని జనం పైనేనా ఈ ప్రతాపం? జిల్లాలోని మారుమూల గ్రామాల నుంచి రోజువారీ పనులు మానకుని, అప్పులు చేసి చార్జీలు పెట్టుకుని వచ్చిన నిరుపేదల పరిస్థితి మరీ దారుణంగా మారింది. పొద్దంతా ఆకలిదప్పులతో ఆవరణలోనే పడిగాపులు కాసినా ఒక్క పని కూడా కాకపోవడంతో కన్నీళ్లతో ఖాళీ చేతులతో వెనుదిరిగారు. "రుసుములు వసూలు చేయడంలో ఉన్న ఉత్సాహం.. సమాచార వ్యవస్థను సరిగ్గా నడిపించడంలో ఏదీ?" అని నిలదీస్తున్నారు.

**కనీస ప్రత్యామ్నాయం లేని దౌర్భాగ్యం!**
ప్రజల నుంచి కోట్ల రూపాయల ఆదాయం గుంజుతున్న రవాణా శాఖ, అత్యవసర సమయాల్లో వాడేందుకు కనీస ప్రత్యామ్నాయ అంతర్జాల సదుపాయం కూడా కల్పించకపోవడం వారి నిర్లక్ష్యానికి సజీవ సాక్ష్యం. తరచూ పునరావృతమవుతున్న ఈ సాంకేతిక రాక్షసికి చరమగీతం పాడాలని, తక్షణమే ప్రత్యామ్నాయ వ్యవస్థను ఏర్పాటు చేసి బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా ప్రజలు రోడ్డెక్కేందుకు సిద్ధమవుతున్నారు.



## ఎంపిడిఓ కార్యాలయంలో ప్రజావాణి ప్రారంభించిన కలెక్టర్

**నారాయణపేట ఆగస్టు 17 (వుదయం ప్రతినిధి)**
నారాయణపేట జిల్లాలో మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమాలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా అన్ని మండలాల్లోని ఎంపీడీవో కార్యాలయాల్లో ప్రజావాణి కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.
అందులో భాగంగా నారాయణపేట ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమాన్ని సోమవారం జిల్లా కలెక్టర్ ప్రియాంక లాంఛనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ప్రజల నుంచి వివిధ సమస్యలు, వినతులను స్వీకరించి, వాటిని పరిశీలించి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా మండల స్థాయిలో ప్రజావాణి కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో కొత్త పింఛన్లకు వచ్చిన దరఖాస్తుల వివరాలను కంప్యూటర్ ఆపరేటర్ ను అడిగి తెలుసుకున్నారు. కార్యాలయ కార్య కలాపాలను పారదర్శకంగా కొనసాగించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ అమరేంద్ర కృష్ణ, ఎంపీడీవో విజయలక్ష్మి, ఎం ఈ వో బాలాజీ, వివిధ శాఖలకు చెందిన అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలి జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్తా

**మహబూబ్ నగర్ ఆగస్టు 17 (వుదయం ప్రతినిధి)**



ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు సమర్పించే ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనల మేరకు సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు.
సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియతో కలిసి ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు.ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. భూ సమస్యలు, రెవెన్యూ, పింఛన్లు, సంక్షేమ పథకాలు, ఉపాధి, రహదారులు, తాగునీరు, గృహ నిర్మాణం తదితర అంశాలకు సంబంధించిన ఫిర్యాదులను ప్రజలు సమర్పించారు. ప్రజావాణిలో 93 ఫిర్యాదులను అధికారులు స్వీకరించారు.ప్రతి ఫిర్యాదును సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి, సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు వెంటనే చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ప్రజల నుంచి వచ్చే ప్రతి వినతికి ప్రాధాన్యతనిస్తూ, ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పరిష్కరించిన ఫిర్యాదుల వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేసి, సంబంధిత దరఖాస్తుదారులకు సమాచారం అందించాలని అధికారులను ఆదేశించారు.ప్రజావాణి ద్వారా ప్రజలు తమ సమస్యలను నేరుగా జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకువస్తున్నందున, వాటి పరిష్కారంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయంతో పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు.

**వ్యసన ముక్త్ భారత్ కోసం అధికారులతో బ్రహ్మకుమారీల ప్రతిజ్ఞ....**
ప్రజావాణి కార్యక్రమం అనంతరం బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వ్యసన ముక్త్ భారత్ ప్రచారంలో భాగంగా జిల్లా అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు.ఈ సందర్భంగా బ్రహ్మకుమారీల ప్రతినిధులు మాట్లాడుతూ వ్యసన ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా దేశవ్యాప్తంగా 10 కోట్ల మందితో ప్రతిజ్ఞ చేయించాలనే లక్ష్యంతో ప్రచారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆగస్టు 6 నుంచి 20వ తేదీ వరకు దాది ప్రకాశ్‌మణి స్మారకార్థం రక్తదాన శిబిరాలు, వ్యసన విముక్తి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.మద్యం, పొగాకు, మాదకద్రవ్యాలతో పాటు మొబైల్ ఫోన్, స్క్రీన్ వినియోగం, ప్రతికూల ఆలోచనలు, పనులను వాయిదా వేయడం వంటి అలవాట్లు కూడా వ్యసనాలుగా మారుతున్నాయని తెలిపారు. వ్యసనాలకు దూరంగా ఉంటూ సానుకూల ఆలోచనలు, క్రమశిక్షణతో కూడిన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని సూచించారు. వ్యసన ముక్త్ మహబూబ్‌నగర్, వ్యసన ముక్త్ తెలంగాణ, వ్యసన ముక్త్ భారత్ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

**సెన్సస్ వివరాలను ఈ నెల 20లోగా అందించాలి: కలెక్టర్ ఖుష్బూ గుప్తా....**
అనంతరం, జిల్లా ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అధికారుల సమావేశంలో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ, జిల్లాలో సెన్సస్ హౌస్ లిస్టింగ్ ఆపరేషన్ స్టేజ్ 1 విజయవంతంగా పూర్తయిందని తెలిపారు. తదుపరి దశ సెన్సస్ ప్రక్రియలో భాగంగా జిల్లా సెన్సస్ హ్యాండ్ బుక్ కోరకు అవసరమైన సమాచారాన్ని శాఖల వారీగా వివరాలను నిర్దేశిత ఫార్మాట్ లో సేకరిస్తున్నట్లు చెప్పారు.31 సంబంధిత లైన్ డిపార్ట్‌మెంట్లు తమ పరిధిలోని వివరాలను ఖచ్చితంగా నమోదు చేసి ఈ నెల 20లోగా జిల్లా ప్రణాళిక శాఖకు పంపించాలని ఆదేశించారు. సెన్సస్‌కు సంబంధించిన రికార్డులు, ఫైళ్లను భద్రంగా ఉంచాలని సూచించారు. సెన్సస్ ప్రక్రియ విజయవంతంగా పూర్తిచేయడానికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ కోరారు.కార్యక్రమంలో ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ సాయి శివాని, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాంరెడ్డి, డి.ఆర్.డి.ఓ. నర్సింహులు, జిల్లా ప్రణాళిక శాఖ ఇంచార్జి అధికారి బి. నర్సింహులు వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఇక పై ఎంపీడీవో కార్యాలయం లోనే ప్రజావాణి

- **ప్రజావాణి కి 113 దరఖాస్తులు**
- **జిల్లా కలెక్టర్ దీపక్ తివారి**

**వికారాబాద్(వుదయం జిల్లా ప్రతినిధి);ఆగష్టు 17:**



ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని ఇక పై ఎంపీడీవో కార్యాలయం లో నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ తెలిపారు. ప్రభుత్వం ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలనే లక్ష్యంతో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమం సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశం హాలు లో నిర్వహించారు . ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ వినతులు, ఫిర్యాదులు మరియు సమస్యలకు సంబంధించి ఇచ్చిన 113 దరఖాస్తులను జిల్లా కలెక్టర్ స్వీకరించారు. వీటిలో ప్రధానంగా పెన్షన్, భూ సమస్యలు, ఇందిరమ్మ ఇండ్లు, , సంబంధిత శాఖలకు సంబంధించి దరకాస్తులు ప్రజావాణి లోజిల్లా కలెక్టర్ స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి ద్వారా వచ్చిన ప్రజల సమస్యలను పెండింగ్ ఉంచకుండా పారదర్శకంగా,వేగవంతంగా పరిష్కరించాలని ,ప్రతి వినతిని పరిశీలించి అర్హత మేరకు చర్యలు తీసుకోవాలని, శాఖ ల వారిగా పెండింగ్ ఉన్న వాటిని త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. ఇక పై నేటి నుండి ప్రతి మండలం లో ఎం పి డి ఓ కార్యాలయంలోనే ప్రజా వాణి కార్యక్రమం నిర్వహించబడుతుందని, ప్రజలు ప్రతి సోమవారం మండలాల్లో జరిగే ప్రజావాణి కార్యక్రమానికి హాజరు కావాలని' మండల ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు.
కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటాచారి, ట్రైనింగ్ కలెక్టర్ సచిన్ బస్వరాజ్ గుట్టూర్,జడ్ పి సి ఇ ఓ సుధీర్, డి ఆర్ ఓ స్వర్ణ లత, డి ఆర్ డి ఓ శ్రీనివాస్,జిల్లా స్థాయి అధికారులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా నాగుల పంచమి వేడుకలు

**మెదక్ జిల్లా వుదయం**
నిజాంపేట మండల వ్యాప్తంగా సోమవారం నాగుల పంచమి వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.ఈ మేరకు మండల కేంద్రంలోని స్థానిక ఎల్లమ్మ ఆలయానికి గ్రామ మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చారు.ఆలయ సమీపంలోని పుట్టలో పాలు పోసి, ఎల్లమ్మ తల్లికి దూపదీప నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.ఈ సందర్భంగా గ్రామ మహిళలు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం నాగుల పంచమి రోజున మహిళలు తెల్లవారుజామునే లేచి భక్తి శ్రద్ధలతో ఎల్లమ్మ ఆలయానికి చేరుకుని పుట్టలో పాలు పోసి మొక్కులు చెల్లించుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు. నాగుల పంచమి పర్వదినం సందర్భంగా నిజాంపేట గ్రామ, మండల ప్రజలకు నాగుల చవితి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి లక్ష్మి ఆంజనేయులు గౌడ్, గ్రామ మహిళలు వర్ష, నవదీప్ గౌడ్,నిహాల్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# అజ్ఞానాన్ని పారద్రోలే ఏకైక ఆయుధం విద్య



- పద్మశ్రీ మహాసహస్ర అవధాని గరికపాటి
- యస్.బి.ఐ.టి లో ఆకట్టుకున్న ఓరియన్‌టేషన్ ప్రోగ్రాం

ఖమ్మం వుదయం బ్యూరో ఆగస్టు 17:

గురువులను, తల్లిదండ్రులను గౌరవించటం విద్యార్థులు అలవరుచుకోవాలని పద్మశ్రీ పురస్కార గ్రహీత, మహాసహస్ర అవధాని గరికపాటి నరసింహారావు తెలిపారు. సోమవారం స్థానిక యస్.బి.ఐ.టి. కళాశాలలో నిర్వహించిన మొదటి సంవత్సర విద్యార్థుల ఓరియంటేషన్ ప్రోగ్రాంలో విశిష్ట అతిథిగా పాల్గొన్న గరికపాటి తల్లిదండ్రులు గురువుల ప్రాముఖ్యతను గురించి విద్యార్థులకు అవగాహన కలిగించారు. విద్యార్థులు ఫోన్లు, టెలివిజన్ వంటి వ్యాపకాలు మాని వారంలో 2 రోజులు డిజిటల్ ఉపవాసం అలవర్చుకోవడం ద్వారా విద్యపై దృష్టిని కేంద్రీకరించగలమని వెల్లడించారు. మోయలేని భారం వల్లనే ఒత్తిడి పెరుగుతుందన్నారు. గురువులతో చర్చించడంతో ఎలాంటి ఒత్తిడినైనా జయించవచ్చని వారు తెలిపారు. విద్యను అభ్యసిస్తూనే దేశ అభివృద్ధి గురించి ఆలోచించాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గరికపాటి విద్యార్థులతో ముఖాముఖి చర్చించి ప్రశ్నోత్తరాలలో పాల్గొన్నారు.

కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ మాట్లాడుతూ యస్.బి.ఐ.టి. లో ఉన్నత మైన విద్యా ప్రమాణాలు పాటించటంతో పాటు విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించటంలో నిర్విరామంగా కృషి చేస్తున్నామని, కళాశాల పొందిన న్యాక్ ఎ ప్లస్ గ్రేడ్ మరియు యు.జి.సి అటానమస్ హోదా దీనికి నిదర్శనం అని, ఈ విద్యా సంవత్సరంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 100 శాతం అడ్మిషన్‌లు కలిగిన కళాశాలగా నిలవటం ఎంతో గర్వనీయమని ఇది మా కళాశాలపై భాద్యతను పెంచిందని, తల్లిదండ్రుల నమ్మకానికి అనుగుణంగా విద్యార్థులు అభివృద్ధి చేందేందుకు తాము సాయశక్తుల కృషి చేస్తామని వెల్లడించారు.

విలువలతో కలిగిన విద్యనందించటంలో తమ కళాశాల అహర్నిసలు కృషి చేస్తుందని కళాశాల వైస్–చైర్మన్ కె. శ్రీచైతన్య తెలిపారు. విద్యార్థులు పరిస్థితులకు అనుగుణంగా సాంకేతిక విప్లవమైన ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్, డేటా సైన్స్ మొదలగు రంగాలలో ఆసక్తిని పెంచుకొని నైపుణ్యాలను పెంచుకోవటంలో ధృడ సంకల్పం కలిగి ఉండాలని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి. రాజ్‌కుమార్ అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రుల తో పాటు కళాశాల అకడమిక్ డైరెక్టర్స్ గుండాల ప్రవీణ్ కుమార్, గంధం శ్రీనివాసరావు, ఎ.వి.వి. శివ ప్రసాద్, హెచ్.ఒ.డిలు, కె. అమిత్ భిందాజ్, టి. చరణ్ సింగ్, కె. స్ఫూర్తి, యమ్. సుప్రియ మీనన్, యమ్. పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన దర్బార్ అర్జీల పరిష్కారంలో జాప్యానికి తావివ్వొద్దు

**గిరిజనులు సమర్పించిన ప్రతి దరఖాస్తును నిర్ణీత గడువులోగా పరిష్కరించాలి : ఐటీడీఏ పీవో బి. రాహుల్**

భద్రాచలం, వుదయం ప్రతినిధి :

గిరిజన దర్బార్‌లో గిరిజనులు తమ సమస్యల పరిష్కారం కోసం సమర్పించే ప్రతి అర్జీని అత్యంత ప్రాధాన్యంతో పరిశీలించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించేందుకు అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ ఆదేశించారు. గిరిజనుల సమస్యల పరిష్కారంలో ఎలాంటి నిర్లక్ష్యం, జాప్యానికి తావివ్వకూడదని, అర్హత కలిగిన ప్రతి గిరిజన కుటుంబానికి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ప్రయోజనాలు సకాలంలో అందేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆయన స్పష్టం చేశారు. సోమవారం ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహించిన గిరిజన దర్బార్‌లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని వివిధ ఏజెన్సీ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో వచ్చిన గిరిజనుల నుంచి పీవో బి. రాహుల్ నేరుగా విన్నపాలు, దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా గిరిజనులు తమ వ్యక్తిగత, కుటుంబ, గ్రామస్థాయి సమస్యలను పీవో దృష్టికి తీసుకువచ్చి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌డీసీ ఆనంద్ కుమార్, డీడీ ట్రైబల్ వెల్ఫేర్ అధికారి చందన, ఏడీఎంహెచ్‌ఓ సైదులు, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి మధుకర్ తదితరులతో కలిసి పీవో గిరిజనుల నుంచి అర్జీలు స్వీకరించారు.

**భూ సమస్యలకు ప్రాధాన్యం**

గిరిజన దర్బార్‌లో ప్రధానంగా భూ సమస్యలు, పోడు భూములకు సంబంధించిన పట్టాలు, భూముల హక్కులు, ప్రభుత్వ భూములకు సంబంధించిన సమస్యలు, సంక్షేమ పథకాల అమలు, ఉపాధి అవకాశాలు, పెన్షన్లు, గృహాలు, తాగునీరు, రహదారులు, విద్యుత్, మౌలిక వసతులు, వైద్య సదుపాయాలు, సామాజిక భద్రత తదితర అంశాలకు సంబంధించిన సమస్యలను గిరిజనులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, సమస్య ఏ శాఖకు సంబంధించినదో గుర్తించి



వెంటనే సంబంధిత యూనిట్ అధికారులకు పంపించాలని పీవో సూచించారు. దరఖాస్తుదారులు పదేపదే కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి రాకుండా సంబంధిత అధికారులు సమన్వయంతో సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఉద్యానవన అధికారి ఉదయ్ కుమార్, పీవీటీజీ అధికారి గన్యా, ఏపీఓ పవర్ వేణు, ఎల్‌టీఆర్ డీటీ మనిధర్, ఏవో సున్నం రాంబాబు, మిషన్ భగీరథ ఏఈఈ వసుంధర, జేడీఎం హరికృష్ణ, మేనేజర్ ఆదినారాయణతో పాటు సంబంధిత శాఖల సిబ్బంది నరేందర్, వెంకటేశ్వర్, విజయ్, నాగేశ్వరరావు, భూచాలు, స్వాతి, కార్తీక్ పాల్గొన్నారు.

## ప్రజావాణికి 16 దరఖాస్తులు

**ఎంపీడీవో మొక్కపాటి నరసింహారావు**



చిలుకూరు ఆగస్టు 17 :( వుదయం )

మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 16 దరఖాస్తులు వచ్చినట్లు నోడల్ అధికారి, ఎంపీడీవో మొక్కపాటి నరసింహారావు తెలిపారు. రెవెన్యూ శాఖలో భూ సమస్యలు, సాగునీరు విడుదల చేయాలని రైతులు అర్జీలు అందజేశారు. దరఖాస్తులను వెంటనే ఆన్లైన్లో నమోదు చేసి రసీదులు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో, తహశీల్దార్ ధ్రువకుమార్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నీట్-పీజీ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు

- భద్రత, సీసీటీవీ, విద్యుత్ సరఫరాపై ప్రత్యేక దృష్టి : జిల్లా కలెక్టర్ అంకిత్

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆగస్టు 17 (వుదయం ప్రతినిధి)




జిల్లాలో ఈ నెల 30న నిర్వహించనున్న నీట్ –పీజీ–2026 పరీక్షను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. పరీక్ష నిర్వహణలో ఎలాంటి అవకతవకలు, సాంకేతిక అంతరాయాలకు తావులేకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సుజాతనగర్‌లోని అబ్దుల్ కలాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నలాజికల్ సైన్సెస్‌లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్ష జరుగుతుందని తెలిపారు. జిల్లాలో ఇదే ఏకైక పరీక్షా కేంద్రం కాగా, మొత్తం 100 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నారు.

పరీక్షా కేంద్రం వద్ద పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని, అభ్యర్థుల తనిఖీలు, అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై నిఘా, మాల్‌ప్రాక్టీస్ నివారణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. మౌలిక వసతులను సుజాతనగర్ తహసీల్దార్ ముందుగానే పరిశీలించి లోటుపాట్లను వెంటనే పరిష్కరించాలని సూచించారు. పరీక్షా కేంద్రం పరిసరాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సెక్షన్ 163 అమలు చేయడంతో పాటు సమీపంలోని జిరాక్స్ కేంద్రాలను మూసివేయించాలని ఆదేశించారు.

సుజాతనగర్ తహసీల్దార్ వి.కృష్ణ ప్రసాద్‌ను డ్యూటీ మేజిస్ట్రేట్‌గా నియమించగా, కొత్తగూడెం ఆర్డీఓ పరీక్షా కేంద్రాన్ని పర్యవేక్షిస్తూ తనిఖీలు నిర్వహించనున్నారు.

అబ్దుల్ కలాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నలాజికల్ సైన్సెస్ ప్రిన్సిపాల్ బి.శ్రీకాంత్ చీఫ్ సూపరింటెండెంట్‌గా, ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి హెచ్.వెంకటేశ్వరరావు అబ్జర్వర్‌గా విధులు నిర్వహించనున్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, డీఆర్వో పద్మావతి, కొత్తగూడెం ఆర్డీఓ మధు, జిల్లా వైద్య శాఖ అధికారి తుకారాం రాథోడ్, జిల్లా ఇంటర్మీడియట్ శాఖ అధికారి వెంకటేశ్వర్లు, సుజాతనగర్ తహసీల్దార్ కృష్ణప్రసాద్, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీకాంత్, పోలీస్ శాఖ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# క్రమశిక్షణతో కూడిన విద్యతోనే ఉన్నత శిఖరాలు



చర్ల, ఆగస్టు 17: (వుదయం ప్రతినిధి)

క్రమశిక్షణతో కూడిన విద్యతోనే విద్యార్థులు జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని కెనరా బ్యాంక్ విశ్రాంత మేనేజర్ కుర్సం ఎర్రయ్య అన్నారు. చర్ల ఆయిల్ బంక్ ఏరియాకు చెందిన కీర్తిశేషులు సోయం భద్రయ్య జ్ఞాపకార్థం ఆయన మనుమడు, బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ గా విధులు నిర్వహిస్తున్న కుర్సం రవితేజ కొమరం భీమ్ విద్యార్థి నిలయానికి క్వింటా బియ్యాన్ని, విద్యార్థులకు ఒకపూట భోజనాన్ని వితరణగా అందించారు. నిలయ కమిటీ కార్యదర్శి జవ్వాది మురళీకృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రవితేజ తండ్రి కుర్సం ఎర్రయ్య మాట్లాడారు. ఆదివాసీ విద్యార్థుల అభ్యున్నతి కోసం వసతిగృహాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. మారుమూల అటవీ ప్రాంత గ్రామాలకు చెందిన విద్యార్థులకు వసతి కల్పించి, వారిని అన్ని రంగాల్లో ఉత్తములుగా తీర్చిదిద్దేందుకు నిలయ కమిటీ చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. కార్యక్రమంలో తెల్లం రమణయ్య, చింత మంగారావు, సోడి సుబ్బారావు, గడ్డం మణికుమార్, కొమరం భీమ్, శబరి నిలయ ప్రముఖులు సంతోష్, వరలక్ష్మి, తోలెం. రామకృష్ణ, కూడం. ఉంగయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఇన్సూరెన్స్ పాలసీ కాకుండా పెన్షనర్స్ ప్లాన్ గా మార్చారు

**ఎస్ బి ఐ లైఫ్ ఇన్సూరెన్స్ హెడ్ ఆఫీస్ ఎదుట బాధితుడి ఆవేదన**

సూర్యాపేట ఆగస్టు 17: వుదయం ప్రతినిధి



హుజూర్ నగర్ ఎస్ బి ఐ లైఫ్ ఇన్సూరెన్స్ బ్రాంచ్ ఆఫీస్ లో ఐదు సంవత్సరాలకు గాను ఏడాదికి ఆరు లక్షల చొప్పున 30 లక్షల పాలసీని కట్టానని ఈ ఏడాది ఆగస్టు నెలలో టర్మ్ పాలసీ ముగిసిందని, కట్టే సమయంలో అదనంగా మూడు లక్షల 44 వేల రూపాయలు వస్తాయని ఇప్పుడు అలా కాకుండా ఇన్సూరెన్స్ పాలసీ కాకుండా పెన్షన్ ప్లాన్ గా మార్చారని హుజూర్ నగర్ కు చెందిన ఎస్ బిఐ లైఫ్ ఇన్సూరెన్స్ ఖాతాదారుడు బోనాల నాగార్జున ఆవేదన వ్యక్తం చేశారు. సూర్యాపేట జిల్లా కేంద్రం ఎస్ బి ఐ లైఫ్ ఇన్సూరెన్స్ హెడ్ ఆఫీస్ వద్ద సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టర్మ్ పాలసీ ముగిసిన ఏడాదికి గత సంవత్సరం ఆగస్టు 19 2025న ముగిసిన ఏడాదికి 20 లక్షలు రూపాయలు ఇచ్చారని మిగతా 13 లక్షల 44వేల రూపాయలు పెన్షన్ గా నెలకు 7వేల రూపాయలు జీవితాంతం పాలసీదారుడుకి, అనంతరం నామినీకి వస్తాయని చెప్పారని తెలిపారు. తనలాగా ఏ పాలసీదారుడు అన్యాయానికి గురి కావద్దని ఆలోచించి పాలసీలలో చేరాలని విజ్ఞప్తి చేశారు. తన పాలసీని పెన్షనర్ ప్లాన్ కాకుండా ఇన్సూరెన్స్ పాలసీగా మార్చాలని ఆయన డిమాండ్ చేశారు.

వివరణ : ఎస్బిఐ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థ నియమ నిబంధనలకు అనుగుణంగా నడుచుకుంటామని ఇప్పుడు మార్చడానికి అవకాశం ఉండదని మెయిల్ తో పాటు టోల్ ఫ్రీ నెంబర్ కి ఫోన్ చేయాలని ఎస్ బిఐ లైఫ్ ఇన్సూరెన్స్ సూర్యాపేట ఏరియా మేనేజర్ సతీష్ తెలిపారు.

# ఉత్తమ అవార్డులు అందుకున్న ఎంపీడీఓ, తహసీల్దార్‌కు తుడుందెబ్బ ఘన సన్మానం



చర్ల, ఆగస్టు 17: (వుదయం ప్రతినిధి)

చర్ల మండలానికి చెందిన ఎంపీడీఓ, తహసీల్దార్‌లు ఉత్తమ అవార్డులు అందుకున్న సందర్భంగా తుడుందెబ్బ బృందం ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సన్మానించారు. చర్ల మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలో ఉత్తమ ఎంపీడీఓగా అవార్డు అందుకున్న చర్ల ఎంపీడీఓ కె. ఈదయ్యను, ఉత్తమ (ఎఈఆర్‌ఓ) గా అవార్డు అందుకున్న చర్ల తహసీల్దార్ శ్రీనివాస్ ను తుడుందెబ్బ నాయకులు శాలువాలతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో తుడుందెబ్బ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పూనెం వరప్రసాద్, సీనియర్ నాయకులు తాటి వెంకట్రావు , మండల యువ నాయకులు పూనెం రవికిరణ్, పురిటి ప్రశాంత్, ఇర్ప అరుణ్ తేజ్ పాల్గొన్నారు.

# ఎస్సీ కమ్యూనిటీ హాలు కోసం ప్రజావాణిలో దరఖాస్తు

మునగాల, ఆగస్టు 17 (వుదయం):



మునగాల మండల కేంద్రంలోని మండల అభివృద్ధి కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఎస్సీ కమ్యూనిటీ హాలు ఏర్పాటుకు మునగాల కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు కొమ్ము ఈధరావు దరఖాస్తు అందజేశారు. మండల కార్యాలయ పరిధిలో ఎస్సీ కమ్యూనిటీ హాలు ఏర్పాటు చేయడం ద్వారా ఎస్సీ వర్గాల ప్రజలకు వివాహాలు, సమావేశాలు, ఇతర సామాజిక కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు ఉపయోగకరంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో మునగాల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాసర్ల కోటేశ్వరరావు, ఓరుగంటి రవి తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయ కుటుంబం నుంచి బుల్లితెరకు

- ఝాన్సీ ప్రస్థానంపై గురువు హర్షం

సూర్యాపేట ఆగస్టు 17: వుదయం ప్రతినిధి



"బిగ్ బాస్ అగ్నిపరీక్ష" లో సూర్యాపేట జిల్లా బిడ్డ గుండెబోయిన ఝాన్సీ టాప్ 15కు ఎంపిక కావడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నట్లు విద్యా భారతి హై స్కూల్ సోషల్ టీచర్ ఆరాల రమేష్ యాదవ్ తెలిపారు. సోమవారం ఆయన ఒక ప్రకటనలో మాట్లాడుతూ.. చివ్వెంల మండలం కోమటికుంట గ్రామానికి చెందిన ఝాన్సీ వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చి తన ప్రతిభతో బుల్లితెరపై గుర్తింపు తెచ్చుకుందని కొనియాడారు. "ఝాన్సీ 2013 నుంచి 2018 వరకు జిల్లా కేంద్రంలోని సిద్ధార్థ ఉన్నత పాఠశాలలో విద్యను అభ్యసించింది. చిన్ననాటి నుంచే పాటలపై ఆసక్తితో స్కూల్ లోనే గుర్తింపు తెచ్చుకుంది. తన కృషి, పాటలపై అభిరుచితో సింగర్ గా ఎదిగి ఇప్పుడు బిగ్ బాస్ వంటి జాతీయ స్థాయి వేదికపైకి రావడం గర్వకారణం" అని ఆయన అన్నారు. ఝాన్సీ ప్రతిభ సూర్యాపేట జిల్లా ఖ్యాతిని ఉభయ తెలుగు రాష్ట్రాలకు, దేశ నలుమూలకు చాటి చెప్పిందని ఆరాల రమేష్ యాదవ్ పేర్కొన్నారు. ఝాన్సీ మరింత రాణించి జిల్లాకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

# సీపీఎం నాయకులను పరామర్శించి సంఘీభావం




**ఆర్ఎస్పీ ప్రవీణ్ కుమార్, కంచర్ల భూపాల్ రెడ్డి నోముల భగత్**

నల్గొండ జిల్లా, వుదయం వార్త ప్రతినిధి ఆగస్టు 17

నల్లగొండ పట్టణ కేంద్రంలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కేటాయింపులో తీవ్ర అక్రమాలకు పాల్పడి, డబ్బులు తీసుకొని అనర్హులను జాబితాలో చేర్చి

అర్హులకు తీవ్ర అన్యాయం చేసిన విషయమై.. సిపిఎం నాయకులు గత మూడు రోజులుగా ఆందోళన చేస్తున్న విషయం తెలిసిందే... ఈరోజు స్థానిక తహసిల్దార్ కార్యాలయం ముందు ఆందోళన చేస్తున్న సిపిఎం నాయకులు సలీం, సత్తయ్య తదితరులను పోలీసులు వన్ టౌన్ పోలీస్ స్టేషన్ తరలించి అక్రమంగా నిర్బంధించిన విషయము తెలుసుకున్న బిఆర్ఎస్ పార్టీ నాయకులు... వన్ టౌన్ పోలీస్ స్టేషన్ చేరుకుని సిపిఎం నాయకులు సలీం సత్తయ్య తదితరులు పరామర్శించి వారికి సంఘీభావం ప్రకటించారు. ఆర్ఎస్ఎస్పి ప్రవీణ్ కుమార్ గారు మాట్లాడుతూ.. పేదలకు న్యాయం చేయమని వచ్చిన నాయకులను అక్రమంగా నిర్బంధించటమేటని వీలైతే ప్రజలకు న్యాయం చేసే విధంగా చర్యలు తీసుకునేది పోయి వారి తరపున ఆందోళన చేస్తున్న సిపిఎం నాయకులను అరెస్టు చేయడం శోచనీయమని అన్నారు. కోమటిరెడ్డి వెంకటరెడ్డి గారు మీకు ఆస్తులు బాగా కూడా పెట్టుకుని ఉన్నారు ఈ పేదవాళ్ల ఇల్లే మీకు కావాల్సి వచ్చిందా అని ప్రశ్నించారు. అక్రమాలు జరగకుండా సక్రమంగా పంపిణీ చేస్తే ఆందోళన చేయాల్సిన అవసరం ఉండేది కాదు కదా అని పోలీసులను ఉద్దేశించి అన్నారు. ఇప్పటికైనా డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పై సమగ్ర విచారణ జరిపించి అర్హులకు అందే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ట్రైకార్ మాజీ చైర్మన్ రామచంద్రనాయక్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షులు రేగట్టే మల్లికార్జున్ రెడ్డి, నల్గొండ మున్సిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి నగర పార్టీ అధ్యక్షులు బోనగిరి దేవేందర్, రావుల శ్రీనివాస్ రెడ్డి బాణావత్ దీప్లా, దండంపెల్లి సత్తయ్య రంజిత్ అల్లి శివ శంకర్ తదితరులు పాల్గొన్నారు




# సాంకేతిక విద్యాశాఖను నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వం

మధిర, ఆగస్టు 17, వుదయం ప్రతినిధి:

పాలిటెక్నిక్ కళాశాలలను శక్తి శాఖలో వీలినం చేయాలన్న ప్రభుత్వ ఆలోచనను తక్షణమే విరమించుకోవాలని, పాలిటెక్నిక్ విద్యావ్యవస్థను నిర్వీర్యం చేసే జీవో నెంబర్ 97ను రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు మదుపల్లి లక్ష్మణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.మధిర మండలం కాజీపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఎదుట ఏఐఎస్ఎఫ్ మధిర నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి అనంతరం లక్ష్మణ్ మాట్లాడుతూ పాలిటెక్నిక్ విద్య అనేది పరిశ్రమలకు అవసరమైన సాంకేతిక నైపుణ్యం కలిగిన మానవ వనరులను అందించే ఒక ప్రత్యేక వ్యవస్థ అనే ఆయన పేర్కొన్నారు దీనిని శక్తి శాఖలో కలపటం వలన విద్య వ్యవస్థ తీవ్రంగా దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు ప్రభుత్వ కళాశాలలు ప్రైవేట్ పరం అయితే పేద మధ్యతరగతి విద్యార్థులకు తక్కువ ఖర్చుతో కూడిన డిప్లమా విద్య అందకుండా పోతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు పేద విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్య ప్రభుత్వాలు అందుబాటులో ఉంచాలి గాని పేద విద్యార్థులను మరింత విద్యకు దూరం చేసే కుట్రలకు పూనుకుంటుందనీ ఆయన అన్నారు.

# పీఆర్సీ, పెండింగ్ డీఏలు విడుదల చేయాలి

- పీఆర్టీయూ జిల్లా అసోసియేట్ అధ్యక్షులు ఆర్. బ్రహ్మారెడ్డి

ఆగస్టు 17, వుదయం ప్రతినిధి:

ఖమ్మం కలెక్టరేట్ వద్ద పిఆర్టియు ఖమ్మం జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాకు మధిర, ఎర్రుపాలెం మండలాల నుంచి పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు తరలివెళ్లారు. పిఆర్సి, పెండింగ్ డిఏ లను వెంటనే విడుదల చేయడంతో పాటు సిపిఎస్ ను రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఏర్పడి 30 నెలలు దాటినా మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు అమలు కాలేదని పిఆర్టియు జిల్లా అసోసియేట్ అధ్యక్షులు ఆర్. బ్రహ్మారెడ్డి అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే పి ఆర్ టి యు ఆధ్వర్యంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మధిర,ఎర్రుపాలెం మండల శాఖల అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులుచిలుకూరి సత్యనారాయణరెడ్డి,పోలే సుధాకర్,బి. మదన్మోహన్ రెడ్డి,ఎం.బాబురావుతో పాటు జిల్లా,మండల బాధ్యులు మరియు పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరం



మధిర, ఆగస్టు 17, వుదయం ప్రతినిధి:

మదిర మండలం తొండల గోపవరం గ్రామపంచాయతీలో ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరాన్ని ప్రారంభించిన సర్పంచ్ షేక్ కన్నం సాహెబ్ మధిర మార్కెట్ కమిటీ డైరెక్టర్ అద్దంకి రవికుమార్ డాక్టర్ శ్రావణ్ కుమార్ లు ఈ సందర్భంగా అద్దంకి రవికుమార్ మాట్లాడుతూ ఇటీవల కాలంలో గ్రామీణ ప్రాంతాలలో మహిళలు ఎక్కువగా క్యాన్సర్ మహమ్మారికి గురవుతున్నారని అటువంటి వారిని లక్ష్యం చేసుకుని గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న మహిళలకు మరియు పురుషులకు 20వేల వరకు విలువచేసే క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు ఉచితంగ క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించడం గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ వారు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ముందుకు రావడం చాలా సంతోషకరమని అన్నారు. కార్యక్రమంలో క్యాంపు కోఆర్డినేటర్ మైకేల్ స్టాఫింగ్ నర్స్ కళ్యాణి రవళి ఈశ్వర్ చంద్ర మధు స్థానిక వైద్యాధికారులు కోట వెంకటేశ్వరరావు ఏఎన్ఎం లు భారతి నాగమణి ఆశ కార్యకర్తలు వేల్పుల విజయ షేక్ నాగూర్ బి నాగమణి స్థానిక కాంగ్రెస్ నాయకులు గ్రామ శాఖ అధ్యక్షులు నరెడ్ల వెంకటరెడ్డి, సూర్యదేవర వెంకటేశ్వరరావు వాసిరెడ్డి వెంకట్రావు,వార్డు మెంబర్లు బొబ్బిళ్ళ వీర వెంకయ్య, మేడేపల్లి భవాని, శివ చేబ్రోలు కృష్ణ చేబ్రోలు సాంబయ్య మేడేపల్లి మాధవరావు తలుపుల నాగేశ్వరావు ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు

# ప్రజావాణి అందరూ సద్వినియోగం చేసుకోవాలి

అనంతగిరి ఆగస్టు 17 వుదయం

మండల కేంద్రంలోనీ ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1:00 వరకు ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు . ఈ కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు హాజరైనారు శాఖలకు సంబంధించి వచ్చిన దరఖాస్తులను పరిశీలించడం జరిగినది. స్వీకరించిన దరఖాస్తులల్లో రెవిన్యూ నుండి (12) పంచాయతీ రాజ్ నుండి (2) ఆర్ అండ్ బి నుండి (1) దరఖాస్తులు రావడం జరిగింది వాటిని ప్రజావాణి సైట్ నందు ఎంట్రీ చేయడం కూడా జరిగినది. ఇట్టి ప్రజావాణి ప్రతి సోమవారం నిర్వహించబడును కావున ప్రజలందరూ ప్రజావాణి ను వినియోగించుకోవలసిందిగా మండల నోడల్ ఆఫీసర్ సూచించారు.

# కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పథకాలను వెంటనే పునరుద్ధరించాలి



**మధిర బీఆర్ఎస్ పార్టీ నాయకులు**

మధిర, ఆగస్టు 17, వుదయం ప్రతినిధి:

గత కేసీఆర్ ప్రభుత్వం పేదల పెళ్లిళ్లకు ఆసరాగా తీసుకొచ్చిన కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పథకాల అమల్లో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యం చెందిందని బీఆర్ఎస్ మధిర నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే ఈ పథకాలపై కోర్టు స్టే విధించాల్సి వచ్చిందని వారు ఆరోపించారు.సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా బీఆర్ఎస్ నాయకులు మధిర తహసీల్దార్ రాంబాబుకు వినతిపత్రం అందజేశారు.పేద కుటుంబాలకు కొండంత అండగా నిలిచే ఈ పథకాలను ఎలాంటి ఆటంకాలు లేకుండా వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతు పేదింటి ఆడపిల్లల పెళ్లిళ్లకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు ఎంతగానో తోడ్పడ్డాయి.కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుండి ఈ పథకాల నిర్వహణను పక్కనబెట్టడంతో అర్హులైన లబ్దిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు.ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకం ఫలాలు త్వరగా అందేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.లేనియెడల ప్రజలతో కలిసి పోరాటం చేసి సాధించుకుంటామని హెచ్చరించినారు.ఈ కార్యక్రమంలో బిక్కీ కృష్ణ ప్రసాద్,చిత్తారు నాగేశ్వరరావు, పల్లపోతు వెంకటేశ్వరరావు, అరెగ శ్రీనివాస రావు,ఆళ్ల నాగబాబు,బొగ్గుల వీరారెడ్డి, చీదిరాల రాంబాబు,వేల్పుల శివ, నీలం రమేష్,మార్త అప్పారావు, అబ్దుల్ ఖురేష్ వేల్పుల శ్రీను, అంగడాల గోపి తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్లతోనే సొంతింటి కల సాకారం

- మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు
- చండూరులో 8వ వార్డులో ఘనంగా గండూరి సత్యనారాయణ గృహప్రవేశం

చండూరు,ఆగస్టు17(వుదయం):



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పథకం పేదప్రజలకు ఒక అపారమైన వరమని చండూరు మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు పేర్కొన్నారు. పేదల సొంతింటి కలను నిజం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం అందిస్తున్న ఈ ఇందిరమ్మ ఇండ్లు అనేక కుటుంబాల్లో నిండైన సంతోషాన్ని నింపుతున్నాయని ఆయన హర్షం వ్యక్తం చేశారు.చండూరు మున్సిపాలిటీ పరిధిలోని 8వ వార్డుకు చెందిన గండూరి సత్యనారాయణ నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమాన్ని మున్సిపల్ పాలకవర్గం ఆధ్వర్యంలో సోమవారం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు ప్రత్యేక పూజల్లో పాల్గొని, నూతన గృహప్రవేశం చేసిన సత్యనారాయణ దంపతులకు శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇంటి పథకం ద్వారా ప్రాధాన్యత లభిస్తుందని, ప్రజల సంక్షేమానికి తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ భూతరాజు దశరథ, కౌన్సిల్ సభ్యులు బుషిపాక వాసు, జెల్ల ధనమ్మ శ్రీనివాస్, కటకం రమేష్, వార్డు అధికారులు ఏ.జగన్, బి.సాయిరాం, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఐతరాజు మల్లేష్, బిల్ కలెక్టర్లు జి. మహేష్, జి. రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్ర సర్పంచుల జాయింట్ యాక్షన్ కమిటీ

**నల్లగొండ జిల్లా అధ్యక్షులుగా అన్నెపర్తి గ్రామ సర్పంచ్ మేకల పల్లవి అరవింద్ రెడ్డి**

నల్గొండ జిల్లా వుదయం వార్త ప్రతినిధి ఆగస్టు 17



నల్లగొండ జిల్లా మండలం అన్నెపర్తి గ్రామ సర్పంచ్ మేకల పల్లవి అరవింద్ రెడ్డి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా నల్లగొండ మాజీ శాసనసభ్యులు కంచర్ల భూపాల్ రెడ్డి మేకల పల్లవి అరవింద్ రెడ్డి గారికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఎప్పటికప్పుడు సర్పంచుల సమస్యలు ప్రభుత్వానికి తెలియజేస్తూ వాటిని పరిష్కరించుకునే విధంగా కృషి చేయాలని వారిని అభినందిస్తూ కోరారు. మండల పార్టీ అధ్యక్షులు దేప వెంకట్ రెడ్డి.. నియోజకవర్గంలోని పలువురు సర్పంచులు బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు వారికి శుభాకాంక్షలు తెలియజేశారు.

# ప్రజావాణికి 10 దరఖాస్తులు

మునగాల, ఆగస్టు 17 (వుదయం):

మునగాల మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల పరిధిలోని వివిధ శాఖలకు చెందిన 24 మంది అధికారులు హాజరుకాగా, ప్రజల నుంచి మొత్తం 10 దరఖాస్తులు స్వీకరించారు. దరఖాస్తుల్లో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించినవి 3, రెవెన్యూ శాఖకు సంబంధించినవి 4, పంచాయతీరాజ్ ఎంపీవో విభాగానికి సంబంధించి 1, వ్యవసాయ శాఖకు సంబంధించి 1, ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి 1 దరఖాస్తు ఉన్నాయి. మొత్తం 10 దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి, నిబంధనల మేరకు పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి కె. రమేష్ దీన్ దయాల్, మండల తహసీల్దార్ వి. సరిత, మండల పంచాయతీ అధికారి డి. నరేష్, వ్యవసాయ అధికారి బుంగరాజు, పంచాయతీరాజ్ ఏఈ వసంత, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ నాగరాజు, మునగాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సుశాంత్, రేపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ వినయ్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ శాఖల అధికారులు, విద్యుత్ శాఖ ఏఈ వికాస్ తదితరులు పాల్గొన్నారు.

# చక్కని ఆరోగ్యం

## సౌందర్య సంరక్షణకు.. కలబంద!



సౌందర్య సంరక్షణకు మార్కెట్లో ఎన్ని ప్రత్యామ్నాయాలున్నా ఇంట్లో సహజసిద్ధంగా లభించే ఉత్పత్తులు/పదార్థాలే మంచివి. కలబంద కూడా అందులో ఒకటి. జిడ్డుగా, పొడిగా, సున్నితంగా.. ఇలా అన్ని రకాల చర్మతత్వాల వారికీ ఇది మేలు చేస్తుందంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో కలబంద చర్మానికి ఎలా ప్రయోజనకరమో తెలుసుకుందాం రండి.. చిటికెడు పసుపు, ఒక చెంచా పాలు, కొంచెం రోజ్‌వాటర్, చెంచా తేనె.. వీటన్నింటినీ బాగా కలుపుకోవాలి. ఈ మిశ్రమానికి కలబంద గుజ్జును కూడా జతచేసి మరోసారి కలుపుకోవాలి. దీన్ని ముఖానికి, మెడకు పట్టించి ఇరవై నిమిషాలు ఉంచుకోవాలి. తర్వాత శుభ్రంగా కడిగేసుకుంటే చక్కటి ఫలితం ఉంటుందట. జిడ్డు చర్మతత్వం ఉన్న వారిని మొటిమల సమస్య వేధిస్తుంది. ఇలాంటి వారు కలబంద ఆకుని నీళ్లలో కాసేపు మరిగించి దాన్ని పేస్ట్‌లాగా చేసుకోవాలి. దానికి కొన్ని చుక్కల తేనె కలుపుకొని ముఖానికి రాసుకోవాలి. పదిహేను నిమిషాల తర్వాత చల్లటి నీటితో కడిగేసుకోవాలి. ఇలా వారానికోసారి చేస్తుంటే మంచి ఫలితం ఉంటుందట. గాయాల వల్ల చర్మంపై ఏర్పడిన మచ్చలను పోగొట్టడంలోనూ కలబంద గుజ్జు ఉపయోగపడుతుంది. ఇందుకోసం కలబంద గుజ్జులో కాస్త రోజ్‌వాటర్ వేసి బాగా కలుపుకోవాలి. ఈ మిశ్రమాన్ని మచ్చలపై అప్లై చేసి ఇరవై నిమిషాల పాటు అలాగే ఉంచుకోవాలి. ఆ తర్వాత చల్లటి నీటితో శుభ్రంగా కడగాలి. ఇలా క్రమంగా చేయడం వల్ల మంచి ఫలితం ఉంటుందట. పొడి చర్మతత్వం ఉన్న వారి చర్మం నిర్జీవంగా కనిపిస్తుంటుంది. ఇందుకు కారణం చర్మంలో ఉండే తేమ శాతం తగ్గిపోవడమే! మరి తేమ శాతాన్ని పెంచుకోవాలంటే కొద్దిగా కలబంద గుజ్జులో కాస్త ఆలివ్ ఆయిల్‌ని వేసి మెత్తటి పేస్ట్‌లాగా చేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి, మెడకు రాసుకోవాలి. ఇరవై నిమిషాల తర్వాత చల్లటి నీటితో శుభ్రంగా కడిగేసుకుంటే చక్కటి ఫలితం ఉంటుందని చెబుతున్నారు నిపుణులు.

## వేసవిలో చుండ్రు, మాడు దురద సమస్యలకు చెక్ పెట్టండి..



వేసవిలో చెమట వల్ల మాడుపై మురికి, నూనె పేరుకుపోతాయి. ఇది ఫంగస్ పెరగడానికి దారితీస్తుంది. వారానికి కనీసం 3 నుంచి 4 సార్లు మైల్డ్ షాంపూతో తలస్నానం చేయాలి. జిడ్డు ఎక్కువగా ఉంటే వైద్యులు సూచించిన యాంటీ-డాండ్రఫ్ షాంపూను వాడటం మంచిది. చెమట పట్టినప్పుడు జుట్టును అలాగే ముడి వేయకూడదు. చెమట వల్ల తేమ చేరి బ్యాక్టీరియా వృద్ధి చెందుతుంది. కాబట్టి, తలస్నానం తర్వాత జుట్టును పూర్తిగా ఆరనివ్వాలి. ఆడవాళ్లు బయట తిరిగేటప్పుడు నేరుగా ఎండ తగలకుండా గొడుగు లేదా స్కార్ఫ్ ఉపయోగించడం ఉత్తమం. చుండ్రును తగ్గించడానికి ఇంట్లో దొరికే వస్తువులు బాగా పనిచేస్తాయి. తలస్నానానికి ముందు మాడుకు నిమ్మరసం పట్టించి 15 నిమిషాల తర్వాత కడిగేస్తే చుండ్రు తగ్గుతుంది. అలోవెరా (కలబంద) ఇది మాడుకు చలువనిస్తుంది, దురదను తగ్గిస్తుంది. వేప నీటితో తలస్నానం చేయడం వల్ల ఇన్ఫెక్షన్లు దరిచేరవు. మనం తీసుకునే ఆహారం కూడా జుట్టు ఆరోగ్యంపై ప్రభావం చూపుతుంది. శరీరాన్ని హైడ్రేటెడ్ గా ఉంచుకోవడానికి రోజుకు కనీసం 3-4 లీటర్ల నీరు తాగాలి. మసాలాలు, వేపుళ్లు తగ్గించి పండ్లు, కూరగాయలు ఎక్కువగా తీసుకోవాలి. జింక్, విటమిన్ బి ఉండే ఆహారం చుండ్రును నివారిస్తుంది. ఇతరుల వస్తువులను వాడటం వల్ల కూడా చుండ్రు వ్యాపిస్తుంది. మీరు వాడే దువ్వెనలు, టవల్స్, దిండు గలీబులను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలి. ఇతరుల దువ్వెనలను అస్సలు వాడకూడదు. వేసవిలో జుట్టు బలహీనంగా ఉంటుంది. హెయిర్ కలర్స్, జెల్స్ లేదా స్టైలింగ్ ఉత్పత్తులను ఈ సీజన్‌లో తగ్గించడం మంచిది. ఇవి మాడును మరింత పొడిగా మార్చి దురదను పెంచుతాయి. పుదీనా రసం మాడుకు బాగా పట్టించిన తర్వాత ఓ అరగంట సేపు ఆరనివ్వాలి.. ఆ తర్వాత తల స్నానం చేస్తే చుండ్రు సమస్య దూరం అవుతుంది. మందార ఆకులు, మందార పువ్వు రేకులను పేస్ట్ చేసి జుట్టుకు పట్టించి స్నానం చేస్తే చుండ్రును చాలా వరకు అరికట్టొచ్చు. మెంతి ఆకును దంచి పేస్ట్‌లా చేసి తలకు రాస్తే చుండ్రు, దురద సమస్యలు దూరమవుతాయి.

## వృద్ధులకే కాదు.. యువతలోనూ పెరుగుతున్న బ్రెయిన్ స్ట్రోక్

కేవలం వృద్ధుల సమస్యగా భావించే బ్రెయిన్ స్ట్రోక్.. ఇప్పుడు యువతనూ వెంటాడుతున్నది. మొత్తం పక్షవాత కేసుల్లో సుమారు 14 శాతం మంది 18-44 ఏళ్ల మధ్య వయసు గలవారే ఉండటం ఆందోళన కలిగిస్తున్నది. ఐసీఎంఆర్ (ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్) తాజా అధ్యయనం ఈ విషయాన్ని వెల్లడించింది. పలు ఆసుపత్రులలోని 34,000కు పైగా కేసులను పరిశీలించిన అధ్యయనకారులు.. పెరుగుతున్న ప్రజారోగ్య సమస్యను బయటపెట్టారు. అంతేకాకుండా పాశ్చాత్య దేశాలతో పోలిస్తే మనదేశంలో చిన్న వయసులోనే పక్షవాతాలు సంభవిస్తున్నాయని



స్పష్టం చేస్తున్నారు.భారత్‌లో స్ట్రోక్ ఒక ప్రధాన ప్రజారోగ్య సవాలుగా మారిందని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. మరణానికి నాలుగో ప్రధాన కారణంగా, అంగవైకల్యానికి ఐదో ప్రధాన కారణంగా నిలుస్తున్నట్లు వెల్లడించారు. శారీరక శ్రమ లేకపోవడం, గంటల తరబడి కూర్చుని పని చేయడమే యువతలో స్ట్రోక్‌కు ప్రధాన కారణమని చెబుతున్నారు. అంతేకాకుండా, జంక్ ఫుడ్, అధిక ఉప్పు వినియోగం, ప్రాసెస్ చేసిన ఆహారం తీసుకోవడం వల్ల చిన్న వయసులోనే రక్తపోటు పెరుగుతున్నది.కెరీర్, వ్యక్తిగత జీవితంలో ఎక్కువగా ఒత్తిడికి గురవ్వడం, సరైన నిద్ర లేకపోవడం వల్ల రక్తనాళాలపై ప్రతికూల ప్రభావం పడుతున్నది. పొగతాగడం, మద్యం సేవించడం వల్ల రక్తనాళాలు గట్టిపడి, రక్త ప్రసరణకు ఆటంకం కలుగుతున్నది. ఇవన్నీ కలిసి చిన్నవయసులోనే స్ట్రోక్ ముప్పును పెంచుతున్నాయని అధ్యయనకారులు వెల్లడిస్తున్నారు. పని ఒత్తిడిని తగ్గించుకోవడం, ప్రశాంతంగా ఉండటం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం లాంటి మార్పులతో ఈ ప్రమాదం నుంచి బయట పడొచ్చని అంటున్నారు.

## మైదాకు దూరంగా ఉంటే కలిగే మార్పులు



మనకు తెలియకుండానే రోజువారీ ఆహారంలో భాగమైపోయిన పదార్థం. బ్రెడ్, బిస్కెట్లు, నూడుల్స్, కేకులు, పేస్ట్రీలు వంటి అనేక వంటకాలలో దీన్ని విస్తృతంగా ఉపయోగిస్తున్నారు. రుచిగా ఉన్నప్పటికీ, ఇందులో పోషకాలు తక్కువగా ఉండటం, జీర్ణక్రియపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉండడంతో, ఆరోగ్య నిపుణులు దీనిని పరిమితం చేయాలని సూచిస్తున్నారు.

అందుకే కొందరు కొంతకాలం మైదాను పూర్తిగా మానేసి శరీరంలో వచ్చే మార్పులను గమనిస్తున్నారు. కేవలం రెండు వారాల పాటు మైదా తీసుకోకుండా ఉంటే కొన్ని స్పష్టమైన మార్పులు కనిపిస్తాయని నిపుణులు చెబుతున్నారు.జీర్ణ వ్యవస్థకు..మైదాను ఆహారం నుంచి తొలగించడంతో జీర్ణక్రియలో మెరుగుదల కనిపిస్తుంది. ఫైబర్ లేని మైదా జీర్ణక్రియను మందగింపజేస్తుంది. దానికి బదులుగా సంపూర్ణ ధాన్యాలు, పండ్లు, కూరగాయలు తీసుకుంటే ఉబ్బరం తగ్గి, పొట్ట తేలికగా అనిపిస్తుంది. అలాగే శక్తి స్థాయిలు స్థిరంగా మారుతాయి. మైదాతో తయారైన పదార్థాలు రక్తంలో చక్కెరను వేగంగా పెంచి, వెంటనే తగ్గిస్తాయి. దీంతో అలసట, నీరసం వస్తాయి. మైదా మానేయడం వల్ల ఈ మార్పులు తగ్గి, శక్తి స్థాయి సంతులితంగా ఉంటుంది. ఆకలి కూడా నియంత్రణలోకి వస్తుంది. మైదా ఎక్కువసేపు తృప్తిని ఇవ్వదు కాబట్టి తరచూ తినాలనిపిస్తుంది. కానీ ఫైబర్, ప్రోటీన్ ఉన్న ఆహారం తీసుకుంటే ఎక్కువసేపు నిండుగా అనిపించి అనవసరంగా తినడం తగ్గుతుంది. బరువు నియంత్రణలో కూడా ఇది సహాయపడుతుంది. చర్మ సంరక్షణకు..మైదా పదార్థాల్లో ఎక్కువగా ఖాళీ క్యాలరీలు, చక్కెరలు, కొవ్వు ఉంటాయి. వీటిని తగ్గించడం వల్ల అదనపు క్యాలరీలు తగ్గి, కొంతవరకు బరువు నియంత్రణలోకి వస్తుంది. ఉబ్బరం కూడా తగ్గినట్లు అనిపిస్తుంది. చర్మంపై కూడా స్వల్ప మార్పులు కనిపిస్తాయి. ప్రాసెస్డ్ ఆహారం తగ్గించడంతో శరీరంలో ఇన్‌ఫ్లమేషన్ తగ్గి, మొటిమలు లేదా చర్మ సమస్యలు తగ్గే అవకాశం ఉంటుంది. మైదా మానేసిన మొదటి రోజుల్లో తినాలనే కోరికలు పెరగవచ్చు. ముఖ్యంగా బ్రెడ్, బేకరీ పదార్థాలు ఎక్కువగా తీసుకునే వారికి ఇది సహజమే. అయితే కొద్ది రోజుల్లోనే శరీరం అలవాటు పడడంతో ఈ కోరికలు తగ్గిపోతాయి. మైదా పిండిని మానేయడం వల్ల ఈ విధంగా మన శరీరంలో అనేక మార్పులు కనిపిస్తాయని నిపుణులు చెబుతున్నారు.వీటిని తీసుకోవాలి..మైదాను మానేటప్పుడు దానికి బదులుగా సంపూర్ణ గోధుమలు, జొన్నలు, రాగులు, ఓట్స్, పప్పులు వంటి పోషకాహారం తీసుకోవడం అవసరం. కేవలం మైదాను మానేయడం సరిపోదు, మొత్తం ఆహార నాణ్యతను మెరుగుపరచడం ముఖ్యమని నిపుణులు చెబుతున్నారు. రెండు వారాల పాటు మైదాను దూరం పెట్టడం ద్వారా శరీరంలో వచ్చే చిన్న మార్పులను గమనించవచ్చు. ఇది కఠిన నియమం కాదు, కానీ మన ఆహారం శరీరంపై ఎలా ప్రభావం చూపుతుందో అర్థం చేసుకునేందుకు మంచి అవకాశమని నిపుణులు సూచిస్తున్నారు.


## చిప్స్ తింటూ కూల్ డ్రింక్స్ తాగితే యమ డేంజర్



వేసవిలో చాలా మంది చల్లని పానీయాలు తాగడానికి ఇష్టపడతారు. ఇవి చాలా రుచిగా ఉండటంతో పాటు వెంటనే చల్లదనం కూడా ఇస్తాయి. కొందరు ఈ పానీయాలతో పాటు చిప్స్ కూడా తింటారు. అయితే, ఇది సాధారణంగా కనిపించే అలవాటు అయినప్పటికీ, ఆరోగ్యానికి హానికరమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. చల్లని పానీయాలలో చక్కెర ఎక్కువగా ఉంటుంది. కొన్నింటిలో కెఫీన్ కూడా ఉంటుంది. ఇవి తాగినప్పుడు తాత్కాలికంగా దాహం తగ్గినట్లు అనిపించినా, వాస్తవానికి శరీరంలో నీరు తగ్గే అవకాశం ఉంది. దీని వల్ల నీరసం, తల తిరగడం, అలసట వంటి సమస్యలు రావచ్చు. వేసవిలో శరీరానికి తగినంత నీరు అవసరం కాబట్టి ఇది మరింత ప్రమాదకరం. ఇక చిప్స్ విషయానికి వస్తే, వాటిలో ఉప్పు, హానికరమైన కొవ్వులు (ట్రాన్స్ ఫ్యాట్స్) ఎక్కువగా ఉంటాయి. ఇవి శరీరంలో నీటిని తగ్గించడమే కాకుండా, ఎలక్ట్రోలైట్ సమతుల్యతను కూడా దెబ్బతీస్తాయి. ఎక్కువ ఉప్పు తీసుకోవడం వల్ల దాహం మరింత పెరుగుతుంది. దాంతో మళ్లీ మళ్లీ చల్లని పానీయాలు తాగే అలవాటు పెరుగుతుంది. ఈ రెండు కలిపి తరచుగా తీసుకుంటే, దీర్ఘకాలంలో బరువు పెరగడం, జీర్ణ సమస్యలు, గుండె సంబంధిత వ్యాధుల ప్రమాదం పెరిగే అవకాశం ఉంది. ముఖ్యంగా పిల్లలు, యువతలో ఈ ప్రభావం ఎక్కువగా ఉంటుంది. అందుకే ఈ అలవాటును తగ్గించడం మంచిది. చల్లని పానీయాల బదులుగా నిమ్మరసం, మజ్జిగ, కొబ్బరి నీరు వంటి సహజ పానీయాలు తాగడం మంచిది. ఇవి శరీరానికి తేమను అందించి, ఆరోగ్యాన్ని కాపాడుతాయి. చిప్స్‌కు బదులుగా వేయించిన మఖానా, వేరుశెనగలు లేదా తాజా పండ్లు తినడం ఆరోగ్యానికి మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

## జీర్ణ వ్యవస్థ మెరుగుపరుచుకోవడానికి..

ప్రస్తుత కాలంలో జీవనశైలి మార్పులు, ప్రాసెస్డ్ ఆహారం, ఒత్తిడి, నిద్రలేమి వంటి కారణాలతో ఆరోగ్య సమస్యలు వేగంగా పెరుగుతున్నాయి. ముఖ్యంగా జీర్ణవ్యవస్థకు సంబంధించిన సమస్యలు ఎక్కువమందిలో కనిపిస్తున్నాయి. చాలా సందర్భాల్లో బయటికి కనిపించే లక్షణాలనే పట్టించుకుంటారు కానీ వాటి వ*ల కారణం గట్ (జీర్ణ వ్యవస్థ) ఆరోగ్యంతో సంబంధం ఉండొచ్చని గుర్తించరు. అందుకే గట్ ఆరోగ్యంపై అవగాహన పెంపొందించుకోవడం ఎంతో అవసరం. ఇక శరీర ఆరోగ్యానికి గట్ ఎంత ముఖ్యమో కొత్త పరిశోధనలు మరోసారి స్పష్టం చేస్తున్నాయి. సెకండ్ బ్రెయిన్ గా పిలిచే గట్ సరిగా పనిచేయకపోతే, అది కేవలం జీర్ణక్రియకే కాకుండా మెదడు పనితీరు, రోగనిరోధక శక్తి, చర్మ ఆరోగ్యంపై కూడా ప్రభావం చూపుతుంది. 16వ ప్రోబయోటిక్ సింపోజియంలో నిపుణులు వెల్లడించిన వివరాల ప్రకారం, భారత్‌లో 10 మందిలో 7 మంది ఏదో ఒక గట్ సమస్యతో బాధపడుతున్నారని వెల్లడైంది.జీర్ణ వ్యవస్థలో వాపు పెరిగితే..గట్ అసమతుల్యత (+బ* ×ఎ*శ్రీ*అమీవ) అనేది చాలా సార్లు స్పష్టంగా కనిపించని లక్షణాల ద్వారా బయట పడుతుంది. వీటిని సాధారణంగా గమనించకుండా వదిలేస్తారు. అయితే ఈ సంకేతాలను ముందుగానే గుర్తిస్తే, ఆరోగ్య సమస్యలను నివారించవచ్చు. గట్ అసమతుల్యతను సూచించే సంకేతాల గురించి వైద్యులు వివరిస్తున్నారు. గట్ అసమతుల్యతకు ఒక ముఖ్య సంకేతం తలలో నిరంతరం చుండ్రు లేదా దురద. గట్‌లో ఇన్‌ఫ్లమేషన్ పెరిగితే అది చర్మంపై కూడా ప్రభావం చూపుతుంది. మంచి బ్యాక్టీరియా, చెడు బ్యాక్టీరియా మధ్య సమతుల్యత కోల్పోతే ఈ సమస్యలు వస్తాయి. అలాగే కారణం తెలియని అలసట కూడా గట్ సమస్యలకు సంకేతంగా నిలుస్తుంది. సరిపడా విశ్రాంతి తీసుకున్నా కూడా అలసటగా అనిపిస్తే, అది శరీరానికి అవసరమైన పోషకాలు సరిగ్గా శోషించకపోవడం వల్ల అవుతుంది.చక్కెర పట్ల ఆకర్షణ పెరగడం..వ*డవ లక్షణం వ*డ్ స్వింగ్స్ లేదా ఆందోళన. గట్, మెదడు మధ్య ఉన్న సంబంధం (గట్-బ్రెయిన్ యాక్సిస్) వల్ల గట్ ఆరోగ్యం ప్రభావితం అయితే సెరోటోనిన్ ఉత్పత్తి తగ్గి భావోద్వేగాల్లో మార్పులు వస్తాయి. అలాగే బ్లోటింగ్ (ఉబ్బరం), అసమాన మల విసర్జన కూడా గట్ సమస్యలకు ప్రధాన సంకేతాలు. ఇవి ఇర్రిటబుల్ బవెల్ సిండ్రోమ్ వంటి సమస్యలకు దారితీస్తాయి. ఈ లక్షణాలు నిరంతరం ఉంటే వైద్యులను సంప్రదించడం అవసరం. చక్కెర పట్ల ఆకర్షణ పెరగడం కూడా గట్ అసమతుల్యతకు మరో సూచన. గట్‌లో చెడు బ్యాక్టీరియా పెరిగితే అవి చక్కెరపై ఆధారపడతాయి. దీంతో తీపి తినాలనే కోరిక పెరుగుతుంది. చర్మంపై మొటిమలు లేదా బ్రేకౌట్స్ రావడం కూడా గట్ ఆరోగ్యంతో సంబంధం కలిగి ఉంటుంది.అధికంగా ప్రాసెస్డ్ ఫుడ్ ను తింటే..అధికంగా ప్రాసెస్డ్ ఫుడ్ తీసుకోవడం వల్ల గట్ బలహీనపడి చర్మ సమస్యలు పెరుగుతాయి. తరచూ జలుబు, ఇన్ఫెక్షన్లు రావడం లేదా రోగనిరోధక శక్తి తగ్గడం కూడా గట్ సమస్యల వల్లే జరుగుతుంది. ఎందుకంటే శరీరంలోని 70 ఇవ్యన్ కణాలు గట్‌లోనే ఉంటాయి. ఇక గట్ ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి నిపుణులు కొన్ని సూచనలు చేస్తున్నారు. ఫైబర్ అధికంగా ఉన్న ఆహారం, ఫెర్మెంటెడ్ ఫుడ్స్ తీసుకోవడం, తగినంత నీరు తాగడం అవసరం. అలాగే సరైన నిద్ర, ఒత్తిడి నియంత్రణ, రోజువారీ వ్యాయామం కూడా ముఖ్యమైనవి. గట్ ఆరోగ్యం శరీర మొత్తం ఆరోగ్యానికి పునాది. శరీరం ఇచ్చే చిన్న సంకేతాలను నిర్లక్ష్యం చేయకుండా, అవసరమైతే వైద్యులను సంప్రదించడం ద్వారా దీర్ఘకాలిక సమస్యలను నివారించవచ్చని నిపుణులు తెలియజేస్తున్నారు.




## మామిడి రుచికే కాదు.. ఆరోగ్యానికీ!

రుచికరమైన మామిడి పళ్లలో ఆరోగ్య ప్రయోజనాలూ అధికమే అంటున్నారు నిపుణులు. అవేమిటో తెలుసుకుందాం రండి.. మామిడి పండ్లలో విటమిన్ 'ఎ' పుష్కలంగా లభిస్తుంది. ఫలితంగా కళ్లు పొడిబారటం వంటి సమస్యలు దూరమై.. కంటి ఆరోగ్యం మెరుగుపడుతుందంటున్నారు నిపుణులు. కొంతమంది మహిళలు గర్భధారణ సమయంలో రక్తహీనతతో బాధపడుతుంటారు. ఈ సమస్యను దూరం చేసుకోవడానికి ఐరన్ అధికంగా ఉండే ఆహార పదార్థాల్ని తీసుకోమని సూచిస్తారు నిపుణులు. ఈ క్రమంలో మామిడి పండ్లను కూడా గర్భిణులు తమ ఆహారంలో భాగం చేసుకోవచ్చు. అయితే అది కూడా డాక్టర్ల సలహా మేరకు, మితంగానే తీసుకోవాల్సి ఉంటుంది. జీర్ణశక్తిని పెంపొందించడంలో కూడా మామిడి పండ్లు కీలక పాత్ర పోషిస్తాయని నిపుణులు చెబుతున్నారు. ఇందులో ఉండే ఫైబర్, కొన్ని రకాల ఎంజైమ్‌లు ఆహారం సులభంగా జీర్ణమయ్యేందుకు దోహదం చేస్తాయట. ప్రత్యేకించి వీటిలో ఉండే ఫైబర్ పేగుల కదలికను పెంపొందించి, మలబద్ధకాన్ని నివారిస్తుందట.



## పోషకాల ఖజానా 'మఖానా'!

తామర గింజలు.. 'మఖానా'గా పిలుచుకునే ఈ గింజల్లో బోలెడన్ని పోషకాలు నిండి ఉంటాయి. ప్రొటీన్లు, కార్బోహైడ్రేట్లు, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా లభించే ఈ గింజలు ఆరోగ్యానికెంతో మేలు చేస్తాయని నిపుణులు చెబుతున్నారు. అయితే వీటిని కొందరు పచ్చిగానే తీసుకుంటే.. మరికొందరు వేయించుకొని, ఉడకబెట్టుకొని, కూరల్లో, స్వీట్లలో భాగం చేసుకుంటారు. ఈక్రమంలో తామర గింజలతో ఆరోగ్యానికి చేకూరే కొన్ని ప్రయోజనాలేంటో తెలుసుకుందాం రండి.. క్యాలరీలు మోతాదుకు మించి తీసుకోవడం వల్ల కొంతమంది బరువు పెరుగుతుంటారు. అయితే మఖానాతో ఆ సమస్య లేదంటున్నారు నిపుణులు. ఎందుకంటే దీనిలో క్యాలరీల శాతం తక్కువ! వీటిలో ఉండే ప్రొటీన్, ఫైబర్.. ఎక్కువసేపు ఆకలి వేయకుండా చేస్తాయి. ఫలితంగా ఆహారపు కోరికల్ని అదుపులో పెట్టుకోవచ్చు.. బరువునూ నియంత్రించుకోవచ్చు అంటున్నారు నిపుణులు. తామర గింజల్లో యాంటీ ఆక్సిడెంట్లు, ఫ్లేవనాయిడ్లు, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు అధికంగా ఉంటాయి. ఇవి వివిధ ఆరోగ్య సమస్యలు రాకుండా అడ్డుకుంటాయట. గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువగా ఉండే ఈ గింజలు రక్తంలో చక్కెర స్థాయులను నియంత్రిస్తాయట. వీటిలోని క్యాల్షియం, మెగ్నీషియం.. ఎముకలు, దంతాల్ని దృఢంగా మారుస్తాయట. మఖానాలో సోడియం తక్కువ.. పొటాషియం, మెగ్నీషియం.. వంటి ఖనిజాలు ఎక్కువ మోతాదులో ఉంటాయి. వీటిని ఆహారంలో చేర్చుకోవడం వల్ల రక్తపోటు నియంత్రణలో ఉంచుకోవడానికి సహకరిస్తాయట. మఖానాలోని ఫైబర్ మలబద్ధకం నుంచి ఉపశమనం కలిగిస్తుందని చెబుతున్నారు నిపుణులు.



## 12.5 కోట్ల మంది ప్రయాణించేలా దిల్లీ విమానాశ్రయ విస్తరణ



దేశంలోనే పెద్దదైన దిల్లీ విమానాశ్రయం.. ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని రాబోయే 10 ఏళ్లకు మాస్టర్‌ప్లాన్ రూపొందిస్తోంది. విమానాశ్రయ వార్షిక ప్రయాణికుల నిర్వహణ సామర్థ్యాన్ని ప్రస్తుత 10.6 కోట్ల నుంచి 12.5 కోట్లకు పెంచేందుకు దిల్లీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ (డయల్) ప్రస్తుతం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ప్రస్తుతం మూడు టెర్మినల్స్ సామర్థ్యం 10.6 కోట్లుగా ఉంది. ఇందులో టీ1 4.2కోట్లు, టీ2 1.4కోట్లు, టీ3 టెర్మినల్ 5 కోట్ల మంది ప్రయాణికులకు సేవలు అందిస్తున్నాయి. 2030 ఏప్రిల్ నాటికి ప్రయాణికుల వార్షిక నిర్వహణ సామర్థ్యాన్ని 11.6 కోట్లకు పెంచనున్నారు.




## వికసిత్ భారత్ లక్ష్యాలు.. బ్యాంకింగ్‌పై త్వరలో ఉన్నతస్థాయి కమిటీ




‘వికసిత్ భారత్ 2047’ లక్ష్య సాధనలో బ్యాంకింగ్ రంగం పాత్రను సమీక్షించేందుకు త్వరలో ఒక ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేయబోతున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. ఈ కమిటీ బ్యాంకింగ్ రంగానికి భవిష్యత్ ప్రణాళికలు రూపొందిస్తుందని తెలిపారు. రాబోయే రెండు దశాబ్దాల్లో దేశాభివృద్ధికి అవసరమైన మార్పులను కమిటీ సూచిస్తుందన్నారు. ఈ మేరకు ప్రభుత్వరంగ బ్యాంకుల సదస్సులో ఆమె మాట్లాడారు. బ్యాంకింగ్ రంగంలో చేపట్టాల్సిన సంస్కరణలపై తమ సిఫార్సులు, సూచనలు అందించాలని ఈ సందర్భంగా బ్యాంకు అధిపతులను కేంద్ర మంత్రి కోరారు. వికసిత్ భారత్ లక్ష్యాలను చేరుకోవడానికి ఇంకా కేవలం 20 ఏళ్లు మాత్రమే ఉన్నాయని నిర్మలా సీతారామన్ అన్నారు. కాబట్టి ఈ తక్కువ సమయంలో బ్యాంకింగ్ రంగాన్ని అందుకు అనుగుణంగా సిద్ధం చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం నిరర్థక ఆస్తులు (NPAs) కనిష్ఠ స్థాయికి చేరాయన్నారు. కాబట్టి రాబోయే రెండు దశాబ్దాల ఆర్థిక వృద్ధికి అవసరమైన సంస్కరణలను వేగవంతం చేయడానికి ఇదే సరైన సమయమని ఆమె పేర్కొన్నారు. బ్యాంకింగ్ అంశంపై కాన్‌క్లేవ్‌లో చర్చించాల్సిన ఏడు అంశాలను డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ గుర్తించిందని నిర్మలా సీతారామన్ తెలిపారు. యువతకు బ్యాంకింగ్ సేవలను చేరువ చేయడం, పెట్టుబడుల ప్రోత్సాహం, గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు, ప్రాధాన్య రంగాలకు రుణాలు, క్రెడిట్ కార్డు వ్యాపార పునర్నిర్మాణం వంటివి ఇందులో ఉన్నాయని చెప్పారు. ముఖ్యంగా యువతపై దృష్టి సారించాలని బ్యాంకులకు సూచించారు. తమ ప్రణాళికల్లో డెమోగ్రాఫిక్ ప్రొఫైల్‌ను పరిగణనలోకి తీసుకోవాలని నిర్మలా సీతారామన్ తెలిపారు.

# పరిమిత శ్రేణిలోనే ట్రేడింగ్!

స్టాక్‌మార్కెట్లో ప్రధాన సూచీలు ఈ వారం పరిమిత శ్రేణిలో చలించొచ్చన్నది విశ్లేషకుల అంచనా. కార్పొరేట్ జూన్ త్రైమాసిక ఫలితాలు ముగింపునకు రావడంతో, అంతర్జాతీయ పరిణామాల నుంచి మార్కెట్లు సంకేతాలందుకోవచ్చు. ముఖ్యంగా పశ్చిమాసియా యుద్ధ పరిస్థితులు కీలకం కానున్నాయి. ఇరాన్ పోర్టుల దిగ్బంధనాన్ని కొనసాగిస్తామని అమెరికా బెదిరిస్తున్నందున, చమురు సరఫరాపై ఆందోళనలు తలెత్తుతున్నాయి. దేశీయంగా కార్పొరేట్ ఫలితాలు అంచనాల కంటే మెరుగ్గా నమోదవడం, 2026–27 ఆదాయార్జన అంచనాల పెంపు, రూపాయి కదలికల్లో స్థిరత్వం వంటివి సానుకూల పరిణామాలు. విదేశీ పోర్టుఫోలియో మదుపరులు జులైలో రూ.20,200 కోట్లు; ఈనెలలో ఇప్పటికే రూ.16,621 కోట్ల కొనుగోళ్లు జరపడం సెంటిమెంటును బలపరుస్తోంది. అయినా కూడా మార్కెట్ ధోరణి అంతర్లీనంగా ప్రతికూలంగా ఉందని సాంకేతిక నిపుణులు చెబుతున్నారు. నిఫ్టీ–50 సూచీ 24,180 స్థాయికి తగ్గొచ్చని అంటున్నారు. ఈ సూచీకి 24,200–24,000 స్థాయుల్లో మద్దతు, 24,500 వద్ద నిరోధం కనిపిస్తున్నాయి. వివిధ రంగాలపై విశ్లేషకులు ఏమంటున్నారంటే.. వాహన, విడిభాగాల షేర్లు ఈ వారం మళ్లీ లాభాల్లోకి రావొచ్చు. ఈ సూచీ 27,500 స్థాయిని అధిగమించాక బులిష్ ధోరణి కనిపిస్తోంది. 30,000 స్థాయి నిరోధంగా, 29,600 మద్దతుగా పనిచేయగలదు. జీఎస్‌టీ కోత వల్ల లభించిన సానుకూలతతో పోలిస్తే, వాహన ధరల పెంపు పెద్దగా ఇబ్బందిగా మారబోదని అంచనా. లోహ సూచీ ఒక దిశను ఎంచుకునేందుకు ముందు స్థిరీకరణకు గురయ్యే అవకాశం ఉంది. మధ్యకాలానికి సూచీ బాగానే కనిపిస్తున్నా, స్వల్పకాల ధోరణి విషయంలో అప్రమత్తత తప్పదు. తక్షణ నిరోధం 13,220, ఆ తర్వాత 13,930 వద్ద కనిపిస్తోంది. చమురు–గ్యాస్ కంపెనీల షేర్లు ఊగిసలాటకు గురికావొచ్చు. ముడి చమురు అధిక ధరలు కాస్తా చమురు మార్కెటింగ్ కంపెనీలకు తలనొప్పిగా మారొచ్చు. 10,700 మద్దతు స్థాయి దిగువన మరింత విక్రయాల ఒత్తిడి ఎదురుకావచ్చు. వినియోగదార్ల సంఖ్య, వినియోగదారు నుంచి లభించే సగటు ఆదాయం (ఆర్పు) మెరుగవుతున్నందున టెలికాం కంపెనీల షేర్లపై విశ్లేషకులు సానుకూలంగా ఉన్నారు. ఆర్పు పెంపునకు కంపెనీలు చేపట్టే చర్యలను మార్కెట్ గమనిస్తుంది. రెండు వారాల పాటు తగ్గుతూ వచ్చిన ముడి చమురు ధర మళ్లీ పెరుగుతుండడంతో ఎఫ్ఎమ్‌సీజీ షేర్లపై ఒత్తిడి ఏర్పడొచ్చు. ఈ రంగ సూచీ 47,500 దిగువకు వస్తే 45,000–44,000 స్థాయులను పరీక్షించొచ్చు. ప్రభావం చూపే వార్తలు లేనందున సిమెంటు షేర్లు మార్కెట్‌తో పాటే కదలాడొచ్చు. సెప్టెంబరు త్రైమాసికంలో వర్షాల కారణంగా నిర్మాణ కార్యకలాపాలు తక్కువగా ఉంటాయి కనుక ఫలితాలు మోస్తరుగానే ఉండొచ్చు. విద్యుత్, ఇంధన వ్యయాల ప్రభావం కంపెనీల లాభదాయకతపై పడొచ్చు.




నిఫ్టీ ఫార్మా సూచీ ఒక శ్రేణిలో చలించొచ్చు. గత నెలరోజుల్లో కాంట్రాక్ట్ డెవలప్‌మెంట్ తయారీదారయిన గ్లాండ్ ఫార్మా, సాయి లైఫ్ సైన్సెస్, దివీస్ షేర్లు 14–19% వరకు పెరిగాయి. అందువల్ల ఫార్మా సూచీలో లాభాల స్వీకరణకూ అవకాశం ఉంది. ఐటీ షేర్లు సమీప కాలంలో ఊగిసలాటకు గురికావొచ్చు. అనిశ్చిత ద్రవ్యోల్బణం, అస్థిరంగా ఉన్న కృత్రిమ మేధ (ఏఐ) ధోరణులు ఇందుకు దోహదం చేయొచ్చు. ఐటీ కంపెనీల విలువలు అధికంగా ఉన్నందున, కొంత మేర నష్టాలకు అవకాశం ఉంది.


## ఈ వారం 7 ఐపీఓలు

దలాల్ స్ట్రీట్‌లో పబ్లిక్ ఇష్యూల సందడి కొనసాగుతోంది. ఈ వారం కూడా పలు కంపెనీల ఐపీఓలు ఎంట్రీ ఇవ్వనున్నాయి. ఏడు కంపెనీలు సంయుక్తంగా రూ.6,400 కోట్ల నిధులను సమీకరించనున్నాయి. లలితా జువెలరీ, హొరైజన్ ఇండస్ట్రియల్ వంటి పలు కంపెనీలు ఇందు లో ఉన్నాయి. మరి వాటి వివరాలు పరిశీలిస్తే.. బ్లాక్‌స్టోన్ మద్దతు కలిగిన హొరైజన్




ఇండస్ట్రియల్ పార్క్ కంపెనీ ఆగస్టు 17న పబ్లిక్ ఇష్యూకు రానుంది. రూ.2,600 కోట్ల నిధులను సమీకరించనుంది. ఒక్కో షేరు ధర రూ.57–60గా కంపెనీ నిర్ణయించింది. ఐపీఓ నిధులను కంపెనీ రుణాల చెల్లింపునకు ఉపయోగించనుంది. ప్రముఖ ఆభరణాల తయారీ కంపెనీ లలితా జువెలరీ కూడా రూ.1700 కోట్ల నిధుల లక్ష్యంతో ఆగస్టు 17న పబ్లిక్ ఇష్యూకు వస్తోంది. ఒక్కో షేరు ధర రూ.190–201గా కంపెనీ నిర్ణయించింది. రూ.1200 కోట్ల విలువైన తాజా షేర్లు, రూ.500 కోట్ల విలువైన షేర్లు ఆఫర్ ఫర్ సేల్ రూపంలో విక్రయిస్తున్నారు. శంకేశ్ జువెలర్స్ రూ.367 కోట్లు నిధుల సమీకరణతో ఆగస్టు 18న పబ్లిక్ ఇష్యూకు వస్తోంది. ధరల శ్రేణి రూ.88–93గా కంపెనీ నిర్ణయించింది. 2.95 కోట్ల తాజా షేర్లు, కోటి షేర్లు ఆఫర్ ఫర్ సేల్ రూపంలో విక్రయానికి ఉంచుతున్నారు. ఫిల్మ్ అండ్ టెలివిజన్ సన్‌షైన్ పిక్చర్స్ రూ.282 కోట్ల లక్ష్యంతో ఆగస్టు 18న ఐపీఓకు వస్తోంది. ధరల శ్రేణి రూ.342–360 కంపెనీ నిర్ణయించింది. 48 లక్షల తాజా షేర్లు, 30.37 లక్షల షేర్లు ఆఫర్ ఫర్ సేల్ రూపంలో విక్రయిస్తున్నారు. గాజా క్యాపిటల్ బ్రాండ్‌కు చెందిన గాజా అసెట్ మెనేజ్‌మెంట్ రూ.550 కోట్ల నిధుల లక్ష్యంతో ఆగస్టు 19న ఐపీఓకు వస్తోంది.

## ఒప్పోతో ఏంబర్ ఎంటర్‌ప్రైజెస్ డీల్..




ఎలక్ట్రానిక్స్ మాన్యుఫాక్చరింగ్ సర్వీసెస్ దిగ్గజం ఏంబర్ ఎంటర్‌ప్రైజెస్ స్మార్ట్‌ఫోన్ తయారీ రంగంలోకి ఎంట్రీ ఇవ్వనుంది. ఇందుకోసం ఒప్పోతో డీల్ కుదుర్చుకుంది. ఇకపై చైనాకు చెందిన ప్రముఖ బ్రాండ్‌లు ఒప్పో, వన్‌ప్లస్, రియల్‌మీ స్మార్ట్‌ఫోన్లను భారత్‌లోనే తయారుచేయనుంది. ఈ మేరకు కంపెనీ ఆర్థిక ఫలితాల వెల్లడి సందర్భంగా ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ అండ్ సీఈఓ జస్బీర్ సింగ్ తెలిపారు. ఉత్పత్తిని ప్రారంభించిన తొలి ఏడాదిలో దాదాపు 80 లక్షల యూనిట్లను విడుదల చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు సింగ్ తెలిపారు. ఇందుకు ఒప్పో మొబైల్ ఇండియా కంపెనీతో భాగస్వామ్యం కుదుర్చుకున్నామన్నారు. మరోవైపు, డిక్సన్ టెక్నాలజీస్‌తో కలిసి జాయింట్ వెంచర్ కంపెనీని ఏర్పాటు చేసేందుకు వివో సిద్ధమవుతోంది.

# రిఫైనరీలకు ఉత్పత్తి లక్ష్యాలు విధించిన ప్రభుత్వం

పశ్చిమాసియా యుద్ధ ప్రభావంతో, సరఫరాలకు ఆటంకాలు ఏర్పడి, మన దేశంలో వంటగ్యాస్ (ఎల్‌పీజీ)కు తీవ్ర కొరత వచ్చి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. భవిష్యత్తులో దిగుమతులకు అంతరాయం ఏర్పడినా, దేశీయంగా వంటగ్యాస్ కొరత రాకుండా చూసేందుకు కేంద్ర ప్రభుత్వం ముందుజాగ్రత్త చర్యలు చేపడుతోంది. అందుకే ప్రభుత్వ, ప్రైవేట్ రంగ రిఫైనరీలు, అప్‌స్ట్రీమ్ చమురు కంపెనీలకు తొలిసారిగా ‘ఉత్పత్తి లక్ష్యాలను’ కేంద్ర పెట్రోలియం, సహజవాయువు మంత్రిత్వ శాఖ నిర్దేశించింది. దేశవ్యాప్తంగా ఉన్న 21 రిఫైనరీలు, అప్‌స్ట్రీమ్ కంపెనీలు కలిపి రోజుకు గరిష్ఠంగా 63,810 టన్నుల ఎల్‌పీజీని ఉత్పత్తి చేయగలవు. ఇది 2025–26లో దేశీయంగా జరిగిన ఎల్‌పీజీ ఉత్పత్తి కంటే రెట్టింపు కాగా, దేశ రోజువారీ అవసరాల్లో దాదాపు 70 శాతానికి సమానం. దేశంలో కొరత తలెత్తినప్పుడు ఈ లక్ష్యాలు తక్షణమే అమల్లోకి వస్తాయి. ఇందులో రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు అధిక కోటా లభించింది. రిలయన్స్ ఇండస్ట్రీస్: గుజరాత్ జామ్‌నగర్‌లోని రిలయన్స్ రిఫైనరీకి దేశంలోనే అత్యధికంగా రోజుకు 18,000 టన్నుల ఎల్‌పీజీ ఉత్పత్తి లక్ష్యాన్ని విధించారు. ఎగుమతుల కోసం ఉద్దేశించిన 35.2 మి.టన్నుల సామర్థ్యం కలిగిన యూనిట్‌కు ఎటువంటి లక్ష్యాన్ని పెట్టలేదు. ప్రభుత్వ రంగ రిఫైనరీలు: ప్రభుత్వ రంగ చమురు సంస్థలకు చెందిన 18 రిఫైనరీలు సంయుక్తంగా రోజుకు 31,470 టన్నుల ఎల్‌పీజీని ఉత్పత్తి చేయాల్సి ఉంటుంది. నయారా ఎనర్జీ: వడినార్‌లోని నయారా రిఫైనరీకి రోజుకు 4,480 టన్నుల ఎల్‌పీజీ ఉత్పత్తి లక్ష్యాన్ని నిర్దేశించారు. అప్‌స్ట్రీమ్ కంపెనీలు: సహజవాయువు, ఎల్‌పీజీని వెలికి తీసే అప్‌స్ట్రీమ్ కంపెనీలైన ఓఎన్‌జీసీ, గెయిల్ సంస్థలకు రోజుకు 6,460 టన్నుల ఉత్పత్తి పరిమితిని కేటాయించారు.



2025–26లో దేశంలో మొత్తం 33.2 మిలియన్ టన్నుల ఎల్‌పీజీ వినియోగమైంది. అంటే రోజువారీ వినియోగం 91,000 టన్నులుగా ఉంది. ఇందులో దేశీయ ఉత్పత్తి 13.1 మి.టన్నులు మాత్రమే. మిగిలిన 21.3 మి.టన్నుల (రోజుకు 58,400 టన్నుల) అవసరాలు దిగుమతుల ద్వారానే తీరాయి. వంటగ్యాస్ అవసరాల్లో దాదాపు 64% దిగుమతులే తీర్చాయి. పశ్చిమాసియా సంక్షోభ సమయంలో పెట్రోరసాయనాల ముడిసరకును ఎల్‌పీజీకి మళ్లించడం, వంటి తాత్కాలిక చర్యలతో ఉత్పత్తిని రోజుకు 55,000 టన్నులకు పెంచగలిగారు. గృహ వినియోగదారులకు సిలిండర్ బుకింగ్ వ్యవధినీ పెంచడం ద్వారా ఒత్తిడి తగ్గించారు. ఇప్పుడు ఉత్పత్తి పెంచేందుకు పటిష్ఠ నిబంధనావళి తీసుకొచ్చారు. ఆరు నెలలకోసారి సమీక్ష: వంటగ్యాస్ ఉత్పత్తి షెడ్యూల్‌ను ప్రభుత్వం ఏటా జనవరి 1, జులై 1 తేదీల్లో సమీక్షించనుంది. కొత్తగా జతచేరే రిఫైనరీలు, నూతన టెక్నాలజీలు, రవాణా మార్గాల విస్తరణ ఆధారంగా ఉత్పత్తి కోటాలను ఎప్పటికప్పుడు సవరించనున్నారు.




## బంగ్లా చేతిలో ఓటమి.. ఆసీస్‌కు ఫైన్‌తోపాటు పాయింట్ల కోత!



బంగ్లాదేశ్ చేతిలో సొంత గడ్డపై ఓటమిపాలైన ఆస్ట్రేలియా జట్టును మాజీలే విమర్శిస్తున్నారు. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో ఘోర ప్రదర్శన చేశారంటూ తూర్పారబట్టారు. రెండు టెస్టుల సిరీస్‌లో 0–1తో వెనుకబడిన ఆసీస్‌ను ఐసీసీ దెబ్బ కొట్టింది. అయితే, ఆ జట్టు చేసిన తప్పిదానికే బోర్డు చర్యలు తీసుకుంది. స్లో ఓవర్ రేట్ కారణంగా జరిమానాతోపాటు ఒక మ్యాచ్ పాయింట్‌ను కోతగా విధించినట్లు తెలుస్తోంది. బంగ్లాదేశ్‌తో తొలి టెస్టు మూడో రోజు ఆటలో ఆస్ట్రేలియా నాలుగు ఓవర్లను తక్కువగా వేసింది. ఐసీసీ రూల్స్ ప్రకారం.. ఒక్కో స్లో ఓవర్‌కు ఒక పాయింట్ కోత పడుతుంది. ఈ లెక్కన ఆసీస్‌కు నాలుగు పాయింట్ల వరకూ కోత పడుతుందని ఐసీసీ వర్గాలు పేర్కొన్నాయి. ఇక ఒక్కో ఆటగాడిపై ఐదు శాతం జరిమానా కూడా పడనుంది. దీంతో 11 మంది ప్లేయర్లపైనా 4వేల డాలర్ల చొప్పున 44 వేల డాలర్ల వరకూ జరిమానా పడనుంది. అయితే, ఇదంతా మ్యాచ్ రిఫరీ నిర్ణయంపైనే ఆధారపడనుంది.

## పూర్తి వివరాలు బయటకు వెల్లడించాల్సిందే: ఐపీఎల్ ట్రేడింగ్‌పై సునీల్ గావస్కర్



ఐపీఎల్ 2026 సీజన్ ముగిసిన నాటి నుంచే భారత స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్య ఫ్రాంఛైజీ మారిపోతున్నాడంటూ వార్తలు వచ్చాయి. అతడిని ట్రేడ్ చేసుకొనేందుకు నాలుగు ఫ్రాంఛైజీలు ఆసక్తి చూపించాయనేది వాటి సారాంశం. ఇంతవరకూ ఏ జట్టు గానీ, అటు హార్దిక్ గానీ దీనిపై నేరుగా ప్రకటన చేయలేదు. మరోవైపు ముంబయి ఇండియన్స్ మాత్రం తాము ఎవరితోనూ సంప్రదింపులు జరపలేదని స్పష్టం చేసింది. అయినా సరే ప్రచారం మాత్రం ఆగట్లేదు. హార్దిక్‌ను ఫలానా ధరకు ట్రేడ్ చేశారంటూ కథనాలు వస్తూనే ఉన్నాయి. ఈ క్రమంలో క్రికెట్ దిగ్గజం సునీల్ గావస్కర్ .. బీసీసీఐతో పాటు ఫ్రాంచైజీల ముంగిట ఓ కీలక డిమాండ్ ఉంచారు. ‘ఒక ఫ్రాంచైజీ నుంచి మరొక దానికి ప్లేయర్లు మారుతున్నారంటూ గత కొద్ది రోజులుగా మీడియాలో తెగ హడావుడి జరుగుతోంది. ఆ ప్రక్రియకు సంబంధించి గడువు ముగిసేందుకు ఇంకా చాలా సమయం ఉంది. సదరు ప్లేయర్ వేరే ఫ్రాంఛైజీకి మారినట్లు అందరికీ తెలిసినా.. ఎంత ట్రేడింగ్ జరిగిందనేది మాత్రం నలుగురికే తెలుస్తుంది. ఆటగాడితోపాటు బీసీసీఐ, రెండు ఫ్రాంఛైజీల వద్ద మాత్రమే పూర్తి సమాచారం ఉంటుంది’’ అని గావస్కర్ తెలిపారు. ‘ఇలాంటి పరిస్థితుల్లో ప్రతి ఫ్రాంచైజీ తన జట్టు కోసం నిర్ణయించిన మేరకే వేతనాల పరిమితిని పాటించిందా? లేదా నిబంధనలను అతిక్రమించిందా అనేది ఇతరులకు ఎలా తెలుస్తుంది? పూర్తి పారదర్శకత, జవాబుదారీతనం కోసం ట్రేడింగ్ వివరాలను బహిర్గతం చేయడం ముఖ్యం. ప్రపంచంలోనే ఐపీఎల్ అత్యుత్తమ టీ20 లీగ్. అందుకే, ఆర్థిక పరమైన విషయాల్లోనూ లీగ్ వైపు ఎవరూ వేలెత్తి చూపేందుకు ఆస్కారం ఇవ్వొద్దు. అందుకోసం ప్రతి విషయాన్ని బయటకు చెప్పడం ఉత్తమం. అప్పుడు ఐపీఎల్ ప్రొఫైల్ ఇంకా బెటర్‌గా మారుతుంది’’ అని గావస్కర్ సూచించారు.

## ఇవి బ్యాడ్మింటన్ ‘ఒలింపిక్స్’.. ఇక్కడ పాయింట్లే కరెన్సీ..!




దిల్లీ వేదికగా బీడబ్ల్యూఎఫ్ ప్రపంచ ఛాంపియన్‌షిప్స్ పోటీలు మొదలయ్యాయి. హేమాహేమీ షట్లర్లు బరిలోకి దిగారు. ఇక్కడో గమ్మత్తైన విషయం ఉందండోయ్.. విజేతగా నిలిచే ప్లేయర్‌కు నయాపైసా రాదు. మరి ఈ టోర్నీ వల్ల ఉపయోగం ఏంటనే అనుమానం రాకమానదు. కానీ, చాలా ప్రయోజనాలు ఉన్నాయండీ.. అవేంటో చూద్దాం..! అంతర్జాతీయంగా బ్యాడ్మింటన్ వరల్డ్ ఫెడరేషన్ నిర్వహించే టోర్నీలకు ప్రైజ్ మనీ ఉండటం సహజం. సైజ్‌ను బట్టి ఇచ్చే బహుమానాల్లో హెచ్చుతగ్గులు ఉంటాయి. బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్‌కు 3 మిలియన్ డాలర్లు, సూపర్ 1000 టోర్నీ అయితే 1.45 మిలియన్ డాలర్ల ప్రైజ్‌మనీ ఉంటుంది. ప్రధానమైన వరల్డ్ ఛాంపియన్‌షిప్‌లో మాత్రం ఎలాంటి నగదు బహుమతి ఉండదు. అందుకు బదులు కేవలం జాతీయ గౌరవం, ట్రోఫీ, ప్రపంచ ర్యాంకింగ్ పాయింట్ల కోసం క్రీడాకారులు ఐదు విభాగాల్లో అత్యంత కఠినమైన పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుంది. మరి వీటి వల్ల ఏమైనా ఉపయోగమా? అంటే కచ్చితంగా ఆటగాళ్లకు ప్రయోజనమే..! పురుషుల, మహిళల విభాగంలో సింగిల్, డబుల్స్‌తో పాటు మిక్స్‌డ్ డబుల్స్‌లో పోటీలు జరుగుతాయి. ఇక్కడ నగదు బహుమతి లేకపోయినా.. ప్రపంచ ర్యాంకింగ్ పాయింట్లు ఉంటాయి. వాటినే అత్యంత విలువైన కరెన్సీగా భావిస్తారు. రెండేళ్ల కిందట అప్‌డేటెడ్ గైడ్‌లైన్స్ ప్రకారం.. వరల్డ్ ఛాంపియన్‌షిప్ గోల్డ్ మెడల్‌ను అందుకొంటే సదరు షట్లర్ 14,500 పాయింట్లు సొంతం చేసుకుంటారు. ఉదాహరణకు ప్రస్తుతం పీవీ సింధు 58,051 పాయింట్లతో 11వ స్థానంలో ఉంది. ఇప్పుడీ ఎడిషన్‌లో బంగారు పతకం సొంతం చేసుకుంటే..72,551 పాయింట్లతో ఎనిమిదో స్థానానికి చేరుకొనే అవకాశం ఉంది. సెమీస్ వరకూ వెళ్లినా తన ర్యాంక్ మెరుగు కావడం ఖాయం. వరల్డ్ ఛాంపియన్‌షిప్స్‌లో వచ్చిన పాయింట్ల ఆధారంగా సూపర్ 1000, సూపర్ 750 ఈవెంట్స్ సీడింగ్‌ను నిర్ణయిస్తారు. ఒలింపిక్స్‌లోనూ అథ్లెట్లకు ఎలాంటి నగదు బహుమతి ఉండదు. పతకాలను అందజేస్తుంటారు. కానీ, ఆ మెడల్స్‌తోనే ప్రపంచవ్యాప్తంగా పేరు మార్మోగిపోతుంది. అలానే బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ ఛాంపియన్‌షిప్స్‌లోనూ ప్రైజ్‌మనీ రాకపోయినా.. ఇందులో పతకం సాధిస్తే ఆయా దేశాల ఫెడరేషన్‌లు, జాతీయ ఒలింపిక్ కమిటీలు, ప్రభుత్వాలు నజరానా ప్రకటిస్తాయి. కొన్ని దేశాల్లో క్యాష్ ప్రైజ్‌లతోపాటు అవార్డులు, జీవితకాలం పెన్షన్‌లు దక్కుతాయి. ప్రపంచ ఛాంపియన్ అనే స్టేటస్ ప్లేయర్లకు లభిస్తుంది.

## నా ఫుట్‌బాల్ కెరీర్‌కు ఇదే ఆఖరి సీజన్: క్రిస్టియానో రొనాల్డో

పోర్చుగల్ ఫుట్‌బాల్ స్టార్ క్రిస్టియానో రొనాల్డో తన కెరీర్ చివరి దశకు చేరుకుందని స్పష్టం చేశాడు. ఇదే ఆఖరి సీజన్ కావచ్చని వ్యాఖ్యానించాడు. దాదాపు పదేళ్ల పాటు రిలేషన్‌లో ఉన్న జార్జినాను ఇటీవలే రొనాల్డో వివాహం చేసుకున్న సంగతి తెలిసిందే. గత ఫిఫా ప్రపంచ కప్‌లో పోర్చుగల్ నాకౌట్ స్టేజ్‌లోనే వెనుదిరిగింది. అప్పుడే తనకు చివరి వరల్డ్ కప్ అని 41 ఏళ్ల రొనాల్డో ప్రకటించాడు. తాజాగా ఓ ఇంటర్వ్యూలోనూ 2026–27 సీజన్‌తో కెరీర్‌ను ముగిస్తానని స్పష్టం చేశాడు. ‘నా ఫుట్‌బాల్ కెరీర్‌కు ఇదే చివరి సీజన్. నా ఘనమైన లెగసీని అభిమానులకు వదిలి వెళ్లాలని కోరుకుంటున్నా. ఆటకు వీడ్కోలు పలికిన తర్వాత ఎలాంటి జీవితం గడపాలనే దానిపై నాకు ఆలోచనలు ఉన్నాయి. భవిష్యత్తు కార్యాచరణ ప్రణాళికలను ఎప్పుడో సిద్ధం చేసుకున్నా. నన్ను నేను బిజీగా ఉంచుకొనేందుకు చాలా విషయాలు ఉన్నాయి. అందులో ఒక్క పేరునే చెప్పడం చాలా కష్టం. అదే సమయంలో ఫుట్‌బాల్‌ను వీడటమూ మాటల్లో చెప్పినంత తేలికేం కాదు. గత రెండున్నర దశాబ్దాలుగా ఫుట్‌బాల్‌తో అనుబంధం ఏర్పడింది. అద్భుతమైన జ్ఞాపకాలు ఉన్నాయి’’ అని రొనాల్డో తెలిపాడు. ‘‘రిటైర్మెంట్ తర్వాత కోచింగ్ కాకుండా.. బిజినెస్ వైపు వెళ్లే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. క్లబ్ ఓనర్ కావచ్చు. చాన్నాళ్ల కిందట నుంచే



నాకు ఆ ఆలోచన ఉంది. సొంతంగా ఫుట్‌బాల్ క్లబ్ ఉండాలనేది ఆకాంక్ష. నా కెరీర్ రెండు లేదా మూడేళ్లు (2023నాటికి) మాత్రమే మిగిలి ఉంది. జాతీయ జట్టును వదిలి వెళ్లేటప్పుడు ముందుగా ఎవరికీ ఆ విషయం చెప్పను.

## కొందరి వల్లే ఎన్ఎస్ఎఫ్ ప్రక్రియపై అనుమానాలు: యోగా ఫెడరేషన్ సెక్రటరీ ఆరోపణలు

జాతీయ క్రీడా సంఘం (ఎన్ఎస్ఎఫ్)గా యోగా ఫెడరేషన్ ఆఫ్ ఇండియాకు గుర్తింపును పునరుద్ధరించడంలో జాప్యం జరుగుతోంది. గతంలోనూ పారదర్శకంగా ఈ ప్రక్రియ సాగకపోవడంతో న్యాయస్థానాలకు వెళ్లాల్సి వచ్చిందని యోగా ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి అభినవ్ జోషి వ్యాఖ్యానించారు. ‘‘ఈసారీ గుర్తింపు ప్రక్రియ పారదర్శకంగా ఉంటుందని భావించడం లేదు. గత కొన్నేళ్లుగా మేం న్యాయపోరాటం చేస్తూనే ఉన్నాం. ఒకవేళ అవే పరిస్థితులు పునరావృతమైతే మళ్లీ కోర్టులను ఆశ్రయిస్తాం. అలాగే ప్రజాస్వామ్య పద్ధతుల్లో మా పోరాటాన్ని కొనసాగిస్తాం. ప్రభుత్వంతో మాకు ఎలాంటి ఇబ్బంది లేదు. కానీ, కొంతమంది ప్రభావవంతమైన వ్యక్తుల జోక్యం మాత్రం ఆందోళన కలిగించే అంశమే’’ అని జోషి వెల్లడించారు. ‘గుర్తింపు కోసం ఇప్పటికే మా ప్రయత్నాలు చేస్తున్నాం. త్వరలోనే భారత ఒలింపిక్ సంఘం ప్రెసిడెంట్ పీటీ ఉష, కేంద్ర క్రీడల శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయను కలుస్తాం. గత 51 ఏళ్లుగా మాసంఘం యోగాసనకు ఓ క్రీడగా గుర్తింపు తీసుకురావడానికి కష్టపడుతోంది. దేశవ్యాప్తంగా 700కిపైగా మా యూనిట్లు ఉన్నాయి. బలమైన ఆర్గనైజేషన్‌ను తయారు చేసుకున్నాం. మెరిట్, అనుభవం పరిగణనలోకి తీసుకున్నా మేం చాలా గొప్పగా ఉన్నాం.



# అత్యంత ఘనంగా జరిగిన నిర్మాత బండ్ల గణేశ్ కుమార్తె జనని-సూర్యతేజ వివాహం



**వుదయం సినిమా:** ప్రముఖ నిర్మాత, నటుడు బండ్ల గణేశ్ కుమార్తె జనని వివాహం సూర్యతేజతో అత్యంత ఘనంగా జరిగింది. హైదరాబాద్‌లోని జేఆర్‌సీ కన్వెన్షన్‌లో జరిగిన ఈ వేడుకకు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరయ్యారు.ఏపీ సీఎం చంద్రబాబు దంపతులు, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డితో పాటు సినీ ప్రముఖులు మెగాస్టార్ చిరంజీవి దంపతులు, విక్టరీ వెంకటేష్, కింగ్ నాగార్జున, నాగచైతన్య దంపతులు, గోపీచంద్, తేజ సజ్జ, కిరణ్ అబ్బవరం, శ్రీకాంత్, నటి జయప్రద, దర్శకులు కె రాఘవేంద్రరావు, బోయపాటి శ్రీను, కొరటాల శివ, త్రివిక్రమ్ శ్రీనివాస్, శ్రీను వైట్ల, అనిల్ రావిపూడి, మెహర్ రమేష్, నిర్మాతలు అల్లు అరవింద్, నాగవంశీ, అనిల్ సుంకర, శిరీష్, సాహు గారపాటి తదితర సినీ, రాజకీయ ప్రముఖులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.




# 'ఇరుముడి' ప్రీ-రిలీజ్



**వుదయం సినిమా:** మాస్ మహారాజా రవి తేజ, శివ నిర్వాణ, మైత్రి మూవీ మేకర్స్ 'ఇరుముడి' చిత్రం నుంచి ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'మల్లెపూల పల్లకి' సాంగ్ రిలీజ్ – గూస్‌బంప్స్ తెప్పించేలా అదిరిపోయిన పాటమాస్ మహారాజా రవితేజ మోస్ట్ అవైటెడ్ మూవీ 'ఇరుముడి' ఆగస్టు 21న థియేటర్లలో విడుదల కానుంది. శివ నిర్వాణ దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించిన ఈ డిఫరెంట్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌పై ఇప్పటికే భారీ అంచనాలు ఉన్నాయి. ఆసక్తికరమైన గ్లింప్స్, మెలోడీతో పాటు ఎనర్జిటిక్ సాంగ్స్‌తో సినిమా మంచి బజ్ క్రియేట్ చేసింది. తాజాగా విడుదలైన థియేట్రికల్ ట్రైలర్ అంచనాలను మరింత పెంచింది.'ఇరుముడి'లోని భక్తి భావానికి మరింత ఎనర్జీని జోడిస్తూ మేకర్స్ మోస్ట్ అవైటెడ్ 'మల్లెపూల పల్లకి' పాటను విడుదల చేశారు. గ్రాండ్ ప్రీ-రిలీజ్ ఈవెంట్‌లో లాంచ్ చేసిన ఈ పాట.. అందరికీ సుపరిచితమైన అయ్యప్ప భక్తి గీతానికి కొత్త రూపాన్ని తీసుకొచ్చింది.అయ్యప్ప భక్తుల్లో ఎంతో ప్రత్యేకమైన స్థానం ఉన్న ఒరిజినల్ 'మల్లెపూల పల్లకి' పాటలోని భక్తి భావాన్ని అలాగే ఉంచుతూ.. 'ఇరుముడి' కోసం సంగీత దర్శకుడు జీవీ ప్రకాష్ కుమార్ దీనికి కొత్త మ్యూజికల్ టచ్ ఇచ్చారు. గ్రాండ్ ఆర్కెస్ట్రేషన్, పవర్‌ఫుల్ రిథమ్స్‌తో పాటను మరింత ఎనర్జిటిక్‌గా తీర్చిదిద్దారు. పాట మొదలైన వెంటనే దాని పవర్‌ఫుల్ బీట్స్, డప్పు రిథమ్స్ ఆకట్టుకుంటాయి. సాంప్రదాయ భక్తి భావాన్ని, రవితేజ సినిమాల్లో ఉండే మాస్ ఎనర్జీని అద్భుతంగా కలిపారు. ఒరిజినల్ పాటకు తన ప్రత్యేకమైన గొంతుతో గుర్తింపు తెచ్చుకున్న డప్పు శ్రీను మరోసారి తన వాయిస్‌తో పాటకు రా, డివోషనల్ ఫీల్ తీసుకొచ్చారు.అయ్యప్ప స్వామి భక్తుడి గెటప్‌లో కనిపించిన రవితేజ తన ఎనర్జిటిక్ పెర్ఫార్మెన్స్‌తో పాటను మరో స్థాయికి తీసుకెళ్లారు. ప్రతి బీట్‌కు తగ్గట్టుగా వేసిన ఆయన డ్యాన్స్ మూవ్స్, స్క్రీన్ ప్రెజెన్స్ పాటకు పక్కా మాస్ అప్పీల్‌ను తీసుకొచ్చాయి. శేఖర్ మాస్టర్ కొరియోగ్రఫీ కూడా పాటకు మరింత బలం చేకూర్చింది.

# సోనీ పిక్చర్స్ నెట్‌వర్క్స్ ఇండియా తాజాగా సెలబ్రిటీ మాస్టర్‌చెఫ్ తమిళ్ ప్రకటన




**వుదయం సినిమా:** సోనీ పిక్చర్స్ నెట్‌వర్క్స్ ఇండియా తాజాగా 'సెలబ్రిటీ మాస్టర్‌చెఫ్ తమిళ్'ను ప్రకటించింది. ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన ఈ కుకింగ్ ఫార్మాట్‌ను తమిళ ప్రేక్షకుల కోసం సోనీ విజా, సోనీ లివ్‌లో స్టార్ హీరోయిన్ సమంత రూత్ ప్రభు హోస్ట్ చేస్తుండటం విశేషం. సెలబ్రిటీలు, ఫుడ్, కాంపిటీషన్.. ఈ మూడు ప్రపంచాలను ఒకే దగ్గరకి తీసుకొస్తూ 'సెలబ్రిటీ మాస్టర్‌చెఫ్ తమిళ్' రూపొందుతోంది. తమిళ ఎంటర్‌టైన్‌మెంట్ రంగానికి చెందిన పలువురు ప్రముఖులు తొలిసారి సెట్స్ నుంచి కిచెన్‌లోకి అడుగుపెట్టి.. కఠినమైన వంటలకు సంబంధించిన సవాళ్లు, ఊహించని ట్విస్టులు, ఒత్తిడిని ఎదుర్కోబోతున్నారు. ప్రేక్షకులను మెప్పించడంతో పాటు.. ప్రతి ఛాలెంజ్‌లో విజయం సాధించేలా రుచికరమైన వంటకాలను తయారు చేస్తూ తమ టాలెంట్‌ను నిరూపించుకోబోతున్నారు.బనిజె ఏషియా నిర్మిస్తోన్న 'సెలబ్రిటీ మాస్టర్‌చెఫ్ తమిళ్'.. ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన మాస్టర్‌చెఫ్ ఫార్మాట్‌ను ఆధారంగా చేసుకుని రూపొందుతోంది.

# 'RaPo23' కోసం ఏకధాటిగా షూట్ చేసిన స్టార్ రామ్ పోతినేని

**వుదయం సినిమా:** ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని దర్శకుడిగా పరిచయం అవుతున్న ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్ 'RaPo23' కోసం కోసం అహర్నిశలూ శ్రమిస్తున్నారు. ఈ సినిమా కోసం ఇటీవల పుదుచ్చేరి శివార్లలో రామ్ ఏకంగా 24 గంటల పాటు నిర్విరామంగా షూట్ చేశారు. విశేషం ఏమిటంటే రామ్ కేవలం డైరెక్టర్‌గా కెమెరా వెనుక ఉండటమే కాకుండా హీరోగా కూడా నటిస్తున్నారు.పుదుచ్చేరిలో ఈ సినిమా కోసం భారీ సెటప్ వేశారు. దాదాపు 9 రోజుల పాటు సాగిన ఈ షెడ్యూల్‌లో రామ్ నటుడిగా తనపై ఉన్న బాధ్యతతో పాటు, దర్శకుడిగా సినిమా ప్రతి అంశాన్ని పర్యవేక్షిస్తూ శ్రమిస్తున్నారు. భారీ స్థాయిలో తెరకెక్కుతున్న 'RaPo23' ప్రస్తుతం అందరిలో హాట్ టాపిక్‌గా మారింది. అయితే అనూహ్యంగా కురిసిన వర్షాల కారణంగా పుదుచ్చేరి షెడ్యూల్‌కు తాత్కాలికంగా బ్రేక్ పడటంతో యూనిట్ హైదరాబాద్‌కు తిరిగి వచ్చింది. మిగిలిన షూటింగ్‌ను అదే భారీ సెటప్‌లో పూర్తి చేసేందుకు త్వరలోనే టీమ్ మళ్లీ పుదుచ్చేరి వెళ్లనుంది.హీరోగా, దర్శకుడిగా ఒకేసారి రెండు బాధ్యతలు తీసుకున్న రామ్.. ఇంత కఠినమైన షూటింగ్ షెడ్యూల్స్‌లోనూ డెడికేషన్ తో పని చేస్తున్న తీరు 'RaPo23'పై ఆసక్తిని మరింత పెంచుతోంది. కృష్ణ పోతినేని నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని రాపో సినిమాటిక్స్ బ్యానర్‌పై భారీ స్థాయిలో తెరకెక్కిస్తున్నారు. డార్క్, ఇంట్రెస్టింగ్ నియో-నోయిర్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే సైకలాజికల్ యాక్షన్ థ్రిల్లర్‌గా ఈ సినిమా రూపొందుతోంది. ఈ సినిమాకు నేషనల్ అవార్డ్ విన్నింగ్ సినిమాటోగ్రాఫర్ తిరునవుక్కరసు (తిరు) కెమెరామెన్‌గా పనిచేస్తున్నారు. యాక్షన్ పార్ట్‌ను విక్రమ్ మోర్, పీటర్ హెయిన్ కలిసి హ్యాండిల్ చేస్తున్నారు. ప్రొడక్షన్ డిజైనర్ ఏఎస్ ప్రకాష్ సినిమా కథకు, భారీ స్కేల్‌కు తగ్గట్టుగా ప్రత్యేకమైన సెట్స్‌ను రూపొందిస్తున్నారు. సినిమా కాస్ట్, క్యారెక్టర్స్, తదుపరి షెడ్యూల్స్‌కు సంబంధించిన మరిన్ని వివరాలను మేకర్స్ రాబోయే రోజుల్లో వెల్లడించనున్నారు.



# "సా V3" మూవీ టీజర్ లాంచ్




**వుదయం సినిమా:** సామ్రాట్, డీమోన్ పవన్, లిఖిత (రాను బొంబాయికి రాను సాంగ్ ఫేమ్) హీరో హీరోయిన్లుగా నటిస్తున్న సినిమా "సాV3". ఈ చిత్రాన్ని లక్ష్మి కృష్ణ ఫిలింస్ బ్యానర్ పై ప్రొడక్షన్ నెం.2గా నిర్మాత వి. విజయ నిర్మిస్తున్నారు. నటుడు, దర్శకుడు కృష్ణమాయ ఈ సినిమాను రూపొందిస్తున్నారు. చిత్రీకరణ పూర్తిచేసుకున్న ఈ సినిమా త్వరలోనే గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. ఆదివారం సాయంత్రం హైదరాబాద్ లో "సాV3" సినిమా టీజర్ ఛ్ ఈవెంట్ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో పలువురు బిగ్ బాస్ సెలబ్రిటీలు పాల్గొని సందడి చేశారు. ఈ కార్యక్రమంలోసింగర్, బిగ్ బాస్ ఫేమ్ రాము రాథోడ్ మాట్లాడుతూ – "సాV3" సినిమా టీజర్ నాకు బాగా నచ్చింది. సామ్రాట్, లిఖిత, డీమోన్ పవన్ తమ పర్ ఫార్మెన్స్ లతో ఆకట్టుకున్నారు. ఈ సినిమాలో వాళ్లు పోటాపోటీగా నటించారని అనిపిస్తోంది. ఈ సినిమా పెద్ద హిట్ కావాలని మన స్ఫూర్తిగా కోరుకుంటున్నా. అన్నారు.నటుడు సంజయ్ తుమ్మ మాట్లాడుతూ – "సాV3" సినిమా టీజర్ చాలా బాగుంది. డైరెక్టర్ కృష్ణ మాయ, ఇతర టీమ్ అందరికీ ఆల్ ది బెస్ట్. నేను డీమోన్ పవన్ నటనకు అభిమానిని. ఆయన ఫ్యూచర్ లో మంచి పేరు తెచ్చుకుంటారు. ఒక మెగాస్టార్ చిరంజీవి, మహేశ్ బాబు, నాని లా పేరు తెచ్చుకుంటాడని నమ్మకంగా చెప్పగలను. అన్నారు.నటి హారిక మాట్లాడుతూ – ఈ సినిమాలో నేనొక ఇంపార్టెంట్ రోల్ చేశాను. నేను ఈ పాత్రలో మెప్పించగలను అని నమ్మి అవకాశం ఇచ్చిన డైరెక్టర్ కృష్ణ మాయ కి థ్యాంక్స్. ఆయనకు సినిమా అంటే చాలా ప్యాషన్. పొద్దుటి నుంచి రాత్రి వరకు అదే ప్యాషన్ తో ఎనర్జీతో వర్క్ చేస్తుంటారు. సామ్రాట్ తన క్యారెక్టర్ లో నటించారు అనేకంటే జీవించారు అని చెప్పాలి.

# 'అమీర్ లోగ్' కంప్లీట్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ఉంటుంది

**వుదయం సినిమా:** 'అవ్వల్ నంబర్ ప్రొడక్షన్స్' బ్యానర్‌పై మాధవి రెడ్డి సోమ నిర్మించిన తొలి చిత్రం 'అమీర్ లోగ్'. ఈ మూవీకి రమణా రెడ్డి సోమ దర్శకత్వం వహించారు.

**మీ నేపథ్యం గురించి చెప్పండి?**

మాది నల్గొండ జిల్లాలోని రాఘవపురం. 1997లోనే ఉన్నత చదువుల కోసం హైదరాబాద్‌కి వచ్చాను.

**సినిమాలు తీయాలనే ఆలోచన ఎలా వచ్చింది?**

కథలు రాయడం, చదవడం నాకు చాలా ఇష్టం. ఆరేడేళ్ల నుంచి కథల నుంచి రాయడం ప్రారంభించాను.

**మొదటి సినీ ప్రయత్నం గురించి చెప్పండి?**

మూడేళ్ల క్రితం షార్ట్ ఫిల్మ్ తీశాను. రాత్రి రాశా.. ఉదయం పూట షూటింగ్ చేసేశాం. ఊర్లో, సిటీలో కలిపి 33 నిమిషాలు ఫుటేజ్ వచ్చింది.

**'అమీర్ లోగ్' జర్నీ గురించి చెప్పండి?**

'అమీర్ లోగ్' అనే టైటిల్‌ను ముందు ఫిక్స్ అయ్యాను. అక్కడి నుంచి అసలైన అమీర్ లోగ్ ఎవరు? అని రకరకాలుగా రాసుకున్నాను. ఓ బస్తీ, ముగ్గురు కుర్రాళ్లు అని కథను రాయడం ప్రారంభించాను.

**సింక్ సౌండ్‌తో చేయాలని ఎందుకు అనుకున్నారు?**

ఆర్టిస్టులు ఎంతో నేచురల్‌గా నటించారు. కొంత డబ్బింగ్ చెప్పారు.




# '2కె లవర్స్' పూజా కార్యక్రమాలతో ప్రారంభం



**వుదయం సినిమా:**ఎం బి ప్రొడక్షన్ హౌస్ బ్యానర్ మీద రాజేష్ నాయుడు దర్శకత్వంలో బిచ్చు నాయక్ నిర్మిస్తున్న ప్రొడక్షన్ నెం.1 '2కె లవర్స్' (Soul of Love) పూజా కార్యక్రమాలు ఆదివారం నాడు దైవ సన్నిధానం లో ఘనంగా జరిగాయి. ఈ సినిమాలో మోహిత్ పెడాడ, శృతి శంకర్, సాయి కుమార్, తనికెళ్ల భరణి, ప్రణీత్ రెడ్డి, సప్తగిరి, రచ్చ రవి, మొట్టా రాజేంద్రన్, రమ్య పొందూరి, సూర్య, శివన్నారాయణ, ఆమని తదితరులు ముఖ్య పాత్రలను పోషించబోతున్నారు. ఈ మూవీకి రసూల్ భాయ్ కథను అందించారు. ఈ చిత్ర ప్రారంభోత్సవానికి మెలోడీ బ్రహ్మ మణిశర్మ, తనికెళ్ల భరణి, వీఎన్ ఆదిత్య ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ముహూర్తపు సన్నివేశానికి వీఎన్ ఆదిత్య క్లాప్ కొట్టగా, మణిశర్మ గౌరవ దర్శకత్వం వహించారు. తనికెళ్ల భరణి స్క్రిప్ట్ అందజేశారు. పూజా కార్యక్రమాల అనంతరం..దర్శకుడు రాజేష్ నాయుడు మాట్లాడుతూ .. 'రసూల్ గారు అద్భుతమైన కథను ఇచ్చారు. తెలంగాణ నేపథ్యంలో సాగే అందమైన ప్రేమ కథతో పాటు, ఎమోషన్స్‌తో సినిమాని రూపొందిస్తున్నాం. ఆద్యంతం వినోదభరితంగా మూవీ ఉంటుంది. మా చిత్ర ప్రారంభోత్సవానికి వచ్చిన మణిశర్మ గారికి, తనికెళ్ల భరణి గారికి, వీఎన్ ఆదిత్య గారికి ధన్యవాదాలు. నాకు ఈ అవకాశం ఇచ్చిన మా నిర్మాత బిచ్చు నాయక్ గారికి, రసూల్ కి ధన్యవాదాలు తెలియజేశారు.నిర్మాత బిచ్చు నాయక్ మాట్లాడుతూ .. 'ఈ రోజు మా ఎం.బి. ప్రొడక్షన్స్ హౌస్ ప్రారంభించడం ఆనందంగా ఉంది. రసూల్ మంచి కథను అందించారు. రాజేష్ గారు సినిమాకి దర్శకత్వం వహిస్తున్నారు. తెలంగాణ యాసలో ఇది వరకు చూడని ప్రేమ కథ, ఫ్యామిలీ ఎమోషన్స్‌తో సినిమా ఉండబోతోంది.

Printed, Published & Owned by Sirikonda Maria, Printed at Sri Rama Avadutha Offset, 9-2-57, Mayuri Centre, Khammam - 507001 and Published from H. No. 10-6-77, Mamillagudem, Khammam - 507001, Telangana.
Editor : Sirikonda Maria, RNI No. APTEL/2013/53008. E-mail : voodayam2007@gmail.com, Cell : 9247698676.